

40.పై.
25-7-69
ఆంధ్ర సచిత్ర వార
పత్రిక



"ఆపదల్లో వున్న ఆత్మీయుల్ని ఆదుకునే వారు" "ఆదుకున్నవార్ని ఆదరించేవారు"

"తను కన్‌ఫ్యూజై అందర్నీ కన్‌ఫ్యూజ్ చేసేవారు"

"తనుప్రేమించిన యువతిని పెళ్ళాడలేక జీవితంలో సుఖపడలేని వ్యక్తి"


"తను ప్రేమించిన పడతిని పొందుటకై కోతలు కోసేవారు"

"ప్రేమకు అంతస్థులు లేవనే పడతులు" "పైమెరుగులు కోసం ప్రాకులాడే ఆడపిల్లలు"

"భర్త అనురాగాన్ని నోచుకోలేని యువతులు" డబ్బు కోసం నానాగడ్డి తినేవారు"

తెలుగు జీవితంలో జీవితంగా పాత్రలో పాత్రగా.

సంచలనమయ్యే కథతో కూడిన చిత్రం.



శ్రీ సారథీ స్టూడియోస్ వారి


ఆత్మీయులు

సంగీతం: రాజేశ్వరరావు * దర్శకత్వం: వి. మధుసూదనరావు * ఫొటోగ్రఫీ: సెల్వరాజ్

నిర్మాత: దుక్కిపాటి మధుసూదనరావు బి.ఏ.

నవయుగ

NVKR


తప్పక
చూడండి!
శ్రీరాజ్ ఆర్ట్ ఫిలింస్
సమర్పించు
విచిత్ర కుటుంబం
మాటలు: భమిడిపాటి రాధాకృష్ణ • పాటలు: డా. సి. నారాయణరెడ్డి • సంగీతం: టి.వి.రాజు • కెమెరా: ఆర్. సంపత్
దర్శకత్వం: కె. ఎస్. ప్రకాశరావు నిర్మాత: వి.కె.వి. శంకవర్మ

ఉత్తరాలు

బుకాయింపు కాక మరేమిటి? దీనితో పోలిస్తే, ఆంధ్రప్రాంతంలో జరిగిన అభివృద్ధి ఏమిటి? మీకు జరిగినది అన్యాయమయితే శ్రీకాకుళం జిల్లాకి (అలాంటి జిల్లాలు కోస్తా, రాయలసీమలలో యింకా వున్నాయి—) గత 16 ఏళ్ళబట్టి జరుగుతున్నదాన్ని ఏమనాలి? 1953 నుంచి 1956 వరకు శ్రీబాగ్ ఒప్పందం పేరుతో రాయలసీమకు, ఆ తర్వాతనుండి నేటివరకు తెలంగాణావారికి ప్రత్యేకత యిచ్చి, ఆ ప్రాంతాలను కొద్దో గొప్పో అభివృద్ధి పరచడం జరిగింది. యిలాంటి సౌకర్యాలు కాని ఆంధ్రకోస్తా ప్రాంతాన్నిగాని, అందులోని వెనుకబడ్డ జిల్లాలను గాని పట్టించుకొన్న వారు లేకపోయారు. దీనినిబట్టి ఎవరు ఎవరిని భరిస్తున్నారో స్పష్టమౌతుంది కదా?

ఇంతకీ తెలంగాణాకి అన్యాయాలు జరిగాయనే అనుకుందాం. 17 మంది గల ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో 9 మంది తెలంగాణా మంత్రులు వున్నారు. అంతకు ముందు 1962 నుంచి, ప్రస్తుతం ప్రత్యేక తెలంగాణా వుద్యమాన్ని నడిపిస్తున్న శ్రీ చెన్నారెడ్డి మంత్రిగాను, ఆరోగ్య శాఖ, ఆర్థిక మంత్రిగాను పని చేశారు కదా? నిన్నంతా యీ అన్యాయాన్ని గూర్చి అప్పుడే ఎందుకు చెప్పలేదు? వీరు కాక నిరా ఎమ్. ఎల్. ఏలు వున్నారు కదా! నిన్నంతా యీ అన్యాయాలు గూర్చి మాట్లాడటంగాని, వాటిని అరికట్టటం గాని ఎందుకు చేయలేదు?

అసలు సంగతి ఏమిటంటే, 1956 వరకు స్వతంత్ర్యం పెద్దగా లేని తెలంగాణా ప్రజలు ఆంధ్రప్రదేశ్ అవటంతో, తర్వాత 12 ఏళ్ళలో రాజకీయ పరిశ్రమలు, విద్యారంగాలలో సాధించిన అభివృద్ధి చూపించి, అసలు అభివృద్ధి అంటే ఏమిటో తెలియచేసింది. దానికారణంగా, స్వతహాగా కాని, చరిత్రకారణంగా కాని అభివృద్ధి కాంక్ష గల ఆంధ్రప్రాంతం వారితో యీ రంగాలలో పోటీ ఏర్పడింది. ఇది నిజానికి అభివృద్ధికి చాల ఆరోగ్యకరం. ఈ పోటీతో తూగలేక, చేతకాక న్యూనతా భావం— అక్కసు పెంచుకొని వారిపై ద్వేషం పెంచుకొన్న కొందరు అవకాశవాదులైన రాజకీయ నాయకులంతా చేతులు కలిపి సామాన్య ప్రజలను మోసం చేస్తూ పెట్టిన చిచ్చు ఒక్క సంగమేమీ కాదిదంతా! [illegible] గారు 'ఆంధ్రుడా! అంధుడా!' అంటూ ఏదో పేలితే వచ్చినది ప్రయోజనం? నిజానికి ఎవరు అంధులు? అన్యాయపు పెద్దలవల్ల ఎన్నికలలో తమ కోర్కెలు తీర్చుకొనిపించుకొని, పదవులు పొందిన నాయకులను ఎన్నుకొని వారిని అనుసరిస్తూ వుద్యమాలలో పాల్గొని, గోతుల్లోకి దిగుతున్న వారే నిజమైన అంధులు.

శ్రీ చిన్నప్పరెడ్డిగారు తమ లేఖలో అన్నదమ్ములుగా విడిపోదామన్నారు? ఎవరు ఎవరికి అన్నదమ్ములు? ఆ ఆంధ్ర స్త్రీలపై సంస్కారముగల ఏ మనిషి వూహించలేనటువంటి, కూడ నటువంటి అసభ్యపు మాటలు వ్రాసినవారు మాకు అన్నదమ్ములా? ఒక మనిషిని పెట్రోలు పోసి సజీవదహనం చేసినవారు మాకు సోదరులా? జిల్లాలలోను, జంటనగరాలలోను ఆంధ్రప్రాంతం వారి యిళ్ళపై దాడిచేసి, కొల్లగొట్టి, తగులబెట్టిన వారా మాకు తోబుట్టువులు? రజాకార్లు సహితం సిగ్గుతో తలవంచుకునేటట్లు చేసిన యీ పనులు అన్నదమ్ములనే వారు చేయవలసినవేనా?

ప్రత్యేక తెలంగాణా వుద్యమం, దానిని జరిపే పద్ధతి, దానివల్ల ఆంధ్రులకు జరుగుతున్న, జరిగిన అన్యాయాలు వ్రాయాలంటే పుస్తకాలు వ్రాయవచ్చు. వుద్యమ విధానంలోని నిజానిజాలు బయట పడితే తెలంగాణా వారి పరువు కాస్తా పోతుంది.

ఉద్యమం వల్ల ఆర్థికంగా నష్టపోయింది. యింకా పోతున్నదీ తెలంగాణా వారే. యిప్పటి యీ నష్టాన్ని పూర్తి చేసుకొనేందుకు మరి ఎన్నాళ్ళు పడుతుందో ఆలోచిస్తే, యీ వుద్యమం గొప్పతనం బయటపడుతుంది. అదీకాక విద్యార్థుల చదువు, దాని మూలంగా తల్లిదండ్రులు ఎంతెంత నష్ట పోతున్నారో వూహించలేం.

అందుచేత, యిప్పటికైనా, ఒకరిపై, అన్యాయం చేస్తున్నారంటూ ఆరోపణలు చెయ్యటం మానివేసి, అభివృద్ధి గురించి సరియైన నాయకులను ఎన్నుకొని, సాధన చెయ్యడం మంచిది. ప్రత్యేక తెలంగాణా వచ్చినా, రాకపోయినా సామాన్య వ్యక్తి తన బాగోగులు తను చూసుకోవలసిందే. ఇప్పటి యీ నాయకులు గాని, రేపు వచ్చే కొత్తనాయకులు గాని, ప్రజలను యింట్లో కూచోబెట్టి తిండి పెట్టలేరు. కష్టపడి బయటికి రావాలంటే పోటీ చెయ్యగలిగి వుండాలి. ఈ పోటీ చెయ్యగలిగిన భావం ప్రజలలో చైతన్యం లేనిదే ఏ ప్రాంతమూ బాగు పడదు. ఈ రెండూ వున్ననాడు ఎవరికి కావలసినవి వారు సంపాదించుకోగలరు. ఎవరూ వారిని చిన్నచూపు చూడరు, చూడలేరు. యీ విషయం తెలంగాణా వారికైనా, రాయలసీమ వారికైనా, లేదా కోస్తా ప్రాంతం వారికైనా సమంగా వర్తిస్తుంది.

తెలంగాణా వుద్యమం వల్ల తెలుగువారందరూ దేశమంతటా నవ్వుల పాలయ్యారు. దేనినైనా పాడు చెయ్యటం సులభం కాని, బాగుచెయ్యడం కష్టం. 1956 నుంచి తెలంగాణా చాల అభివృద్ధిని సాధించింది. యింకా సాధిస్తుంది. అయితే వందల ఏళ్ళబడి పెరిగిన ప్రాంతీయ అనుమానత్వాలు ఒక్క పది పన్నెండేళ్లలో తొలగిపోవటం తేలిక కాదు. నాయకులనబడేవారందరూ, ప్రజలూ కూడ యీ విషయాన్ని గ్రహించి వుద్యమాన్ని విరమించుకొని సమైక్య ఆంధ్రప్రదేశ్ గురించి పాటుపడినప్పుడు, తెలుగుదేశం బాగు పడుతుంది. —సి. వి ఆర్. బాబు, గరిగపాటి. సత్యసిరాజా, బి. ఎస్. శాస్త్రి (బొంబాయి.)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 25—7—'69
శ్రీ సౌమ్యనామ సం॥ నిజాషాఢ శు॥ ఏకాదశి
సంపుటము: 61 సంచిక: 48

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక


నా శతజయంతిలో
వీటినా నేను చూడాలి
వచ్చింది!
రెండు నాలికల
శివసేన
ఘెరావ్
జాతీయకరణ

దేశం మండిపోతూ ఉంటే విలాసయాత్రలు

భారత ప్రధాని పేరు 'లోకసంచారి' అంటే బాగుంటుందేమో. ఇటీవలే వారు ఒక విదేశయాత్ర ముగించుకుని తమ కాంప్ ఆఫీసుకి తిరిగి వచ్చారు. వారి పెట్టెలు విమానం దిగీదిగగానే వారు తిరిగి కాంబోడియా, థాయిలాండులకి వెడతారనే వార్త వెలువడింది.

ఈ కింద 'హిందూస్థాన్ టయిమ్స్' పత్రిక మొదటి పేజీ అంశాలు కొన్ని ఇస్తున్నాను. అవి దేశ పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయనిపిస్తుంది.

ఇండియా, ఇండోనేసియా

జూన్ 29:

హైదరాబాదులో తిరిగి కర్ఫ్యూ
మరి ఏడుగురు తెలంగాణా మంత్రుల రాజీనామా
విద్యార్థులచే రయిలుబండి లూటీ.
బీహారులో రాష్ట్రపతి పాలన తథ్యం.
ప్రధానికి ఇండోనేసియా ఘన స్వాగతం.

జూలయి 1:

హైదరాబాదు. పోలీసులచే కాల్పులు తూటాల కాల్పులు.
కలకత్తా: జ్యోతిబాసూచే మొరార్జీ ప్రకటన ఖండన.
పాట్నా: పాస్వాన్ మంత్రివర్గం రాజీనామా.
శ్రీమతిగాంధి, ఇండోనేసియా అధ్యక్షులచే ఆసియాలో మిలిటరీ వప్పందాల నిరసన.
సుహార్తో శ్రీమతి గాంధి భారతదేశానికి రమ్మని పిలిచిన ఆహ్వానాన్ని స్వీకరించారు.

జూలయి 2

రెండు విమాన ప్రమాదాలలో 26 మంది సైనికదళాల మృతి.
హైదరాబాదు: మంత్రుల [illegible]
[illegible]
భారతదేశం అణ్వస్త్రాలు చెయ్యదని ప్రధాన మంత్రి జకార్తాలో అన్నారు.

జూలయి 3:

ఢిల్లీలో ఫాక్టరీకి పనివారు నిప్పుపెట్టారు.
జకార్తా: ప్రధానమంత్రి సుహార్తోలచే శాంతి కోసం విజ్ఞప్తి.

జూలయి 4:

హైదరాబాదు: మరికొందరు సమితి నాయకుల అరెస్టు.
బీహారులో కేంద్ర పరిపాలన నిర్ణయం.

జూలయి 5:

హైదరాబాదులో రయిలు పట్టాల నిర్మూలన.

జూలయి 6:

పార్లమెంటు సభ్యుల పర్యటనలలో షాక్ లేవు.
హైదరాబాదులో తిరిగి కాల్పులు.



రాష్ట్రపతి పదవికి కాంగ్రెసుపార్టీ ఎన్నుకున్న అభ్యర్థి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు.

జూలయి 7:

కలకత్తాలో మిలిటరీ రయిలుబండి ముసుగు దొంగలచే దోపిడీ.

హైదరాబాదు: ఆందోళనకారులమీద బాష్ప వాయువు ప్రయోగం. మంత్రిగారి ఇంటిమీద బాంబు విసురు.

దినేష్‌సింగ్ కెయిరో ప్రయాణం.

జూలయి 8:

హైదరాబాదు: కర్ఫ్యూ విధింపు ప్రారంభం.
పోలీసు కాల్పులలో ఒక వ్యక్తి మరణం.
బెంగాలు సభలో అలజడి
కానాట్‌ప్లేస్‌లో యువతి దోపిడీని అపివ్యానం. శ్రీయుతులు గోపాలన్, నంబూద్రిపాద్‌లు తిరువనంతపురంలో 'పార్లమెంటరీ పద్ధతిలో బలహీనతలని కమ్యూనిసమ్ తీసుకురావటానికి వాడుతున్నా'మని అన్నారు.

జూలయి 9:

కలకత్తా: వార్తా పత్రికల కార్యాలయాలమీద విద్యార్థుల దాడి.

ప్రపంచ యాత్ర

మేడమ్ గాంధిగారు ఒంటరిగానూ, తమ తండ్రి గారితోనూ యూరప్, అమెరికా, కెనడా ఇతర ప్రాంతాలని చాలావరకూ పర్యటించారు. వారిద్దరూ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, లాటిన్ అమెరికా లను పర్యటించ లేదు. అయితే, మేడమ్ గాంధి గారు ప్రధాని అవగానే మలేసియా, సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్లను చూసి వచ్చారు. తర్వాత లాటిన్ అమెరికా, జపాన్, ఇండోనేసియాలని చూసి వచ్చారు. ఇప్పుడు థాయిలాండ్, కాంబోడియాలకి వెళ్లపోతున్నారు.

తెలంగాణా నిజంగా మండి పోతోంది. పశ్చిమ బెంగాలులో కమ్యూనిస్టులు ప్రజాస్వామ్యాన్నే నాశనం చెయ్యటానికి పూనుకున్నారు. దేశంలో ఎన్నో ముఖ్య సంస్థలలో కమ్యూనిస్టులు బలంగా ఉన్నారు. ఎప్పుడు కావలిస్తే అప్పుడు అసహాయ్య స్థితిని తెచ్చుకు రాగలరు. భిల్లులు సయితం కాల్పులు దువ్వుతున్నారు.

ఇదంతా మేడమ్ గాంధీకి అనవసరం. వారి ప్రపంచ యాత్ర వారికి ముఖ్యం.

బ్రిటిషు ప్రధాని విదేశ యాత్రలు

బ్రిటిషు ప్రధాన మంత్రికి కూడా సమస్యలు ఉంటాయి. బ్రిటిషు ప్రధాన మంత్రులు ఎందరు, ఎన్ని సార్లు విదేశాలకి వెడుతూ వచ్చారు? శ్రీ విల్సన్ ఇప్పటిదాకా రెండు మూడుసార్లకన్నా దేశం వదిలి వెళ్ళలేదు.

ఈ పరిస్థితి ప్రతిపక్షంలో కొందరికి, ప్రత్యేకంగా కమ్యూనిస్టులకి అనువుగా ఉంటోంది.



రాష్ట్రపతి పదవికి మేడమ్ గాంధీగారి అభ్యర్థి కింద పరిగణింపబడుతున్న శ్రీ వి. వి. గిరిగారు.

అశాంతి బాగా పెరిగితే వారు అధికారాన్ని చేపట్ట గలుగుతారు.

కాంగ్రెసు అధ్యక్షులు కూడా ఇటీవలే విలాస యాత్ర ఒకటి చేసి వచ్చారు. ఆయన ప్రధాన మంత్రిని ఏమి అంటారు? మిగిలిన వారి సంగతీ ఇంతే.

హత్యల సంఖ్య

ఢిల్లీలో హత్యల సంఖ్య పెరిగితే ఎవరూ ఆశ్చర్య పడనవసరం లేదు. ఎక్కడ చూసినా ఇప్పుడు అశాంతి ఆందోళనా. ఇక మొరార్జీ దేశాయిగారు గాంధీ శతజయంతి ఉత్సవాలకోసం జర్మనీ వెళ్లారు. శ్రీ దివాకర్ యూరప్, బ్రిటన్‌లని పర్యటిస్తున్నారు— గాంధీ ఉత్సవం కోసం.

పత్రికల వాళ్లు తమపాత్రలని నిర్వహిస్తున్నారు. ఉద్యోగాలు లేనప్పుడు 'నేరస్థులని' గురించి రాస్తారు. ఉద్యోగాలు దొరికినప్పుడు ఆ 'నేరస్థులనే' పొగడుతారు.

మేడమ్ గాంధీగారి దుబారా కట్టు విధానాలు ఈ దేశంబయట చెలామణి కావు. సుకర్నో విధానాలు ఆయన కేమి తెచ్చి పెట్టాయో అందరికీ తెలుసు.

నే ర స్థు లు

196౦ నేరస్థులు ఎవరు?

తమ ఉద్యోగాలకి అంటి పెట్టుకుంటున్నవారు.

శ్రీ శ్రీ శ్రీ ఎస్. కె. పాటిల్‌గారు తమకి మంత్రి పదవి అవసరం లేదంటారు. ఇస్తే వద్దంటారా? ఆయన రోజూ చేసే ప్రయత్నం అంతా ఆ పదవి కోసమే కదా?

శ్రీ మొరార్జీదేశాయిగారు ఆడంబరం లేనివారు. రాజీనామా ఇచ్చి ప్రతిపక్షంవారికి తృప్తి ఇవ్వ నంటారు. ఈ పదవీ వ్యామోహమే నేటి పరిస్థితులకి కారణం.

లార్డ్ బిర్కెన్‌హెడ్ ఒకసారి గాంధీగారిని గురించి అన్నారు— కుక్కలు మొరిగినా కారవాన్ ఆగదు. అని. మేడమ్ గాంధిగారి కారవాన్‌ని చూసి ఎన్నో కుక్కలు మొరుగుతున్నాయి. అది మాత్రం దుమ్ము లేపుకుంటూ ముందుకి సాగి పోతోంది......

తు ది మా ట

అమెరికన్ల చర్మాలు చాలా మందం అంటారు. కాని, ఇంత మందం అనుకోలేదు నేను. ఇటీవల అధ్యక్షుడు నిక్సన్‌ని మేడమ్ గాంధిగారు అవమాన పరిచిన విధంగా ఆమెగారు ఏ చిన్న దేశం నాయకుడినీ అవమాన పరచలేదు. శ్రీ నిక్సన్ పిలవని పేరంటానికి వస్తున్నారన్నట్లుగా ఆమె మాట్లాడారు. శ్రీ నిక్సన్ మాత్రం చీకూ చింతా లేకుండా భారతదేశానికి వస్తున్నారు. ఎందుకు? భారతీయులని ఉద్ధరించటానికి. అమెరికా ద్వేషులలో అగ్రగణ్యుడయిన శ్రీ దినేష్‌సింగ్‌కి అమెరికాలో పెద్ద స్వాగతం లభిస్తోంది. వెర్రివాడి డబ్బు నిలవదంటారు. అమెరికా వారికి డబ్బు చాలా ఉంది.

తెలంగాణా ఉద్యమం: ఒక సమీక్ష

తెలంగాణా ఉద్యమం రెండు విషయాల మీద ఆధారపడి ఉంది. ఒకటి ఉద్యోగాలకి సంబంధించినది; రెండవది 'మిగుళ్లు' లేక 'నిధులకి' సంబంధించినది.

ఉద్యోగాలలో 'రిజర్వేషన్' సరికాదని హైకోర్టు నిర్ణయించింది. మనం స్వీకరించిన ప్రజాస్వామ్య సాంప్రదాయాలు ఈ నిర్ణయాన్ని చర్చించటానికి అంగీకరించలేవేమో కాని 'స్వంత' రాష్ట్రంలో ఒక భాగం అనుకుని 'ఆంధ్ర' ప్రాంతంనుంచి తెలంగాణాలో ఉద్యోగాలకి వెళ్ళినవారిని అనాగరికపద్ధతులతో హింసించి తరిమి వెయ్యటంమాత్రం అందరికీ తెలిసిన విషయమే. 'స్వంతరాష్ట్రం' ప్రసక్తి లేక కేంద్రప్రభుత్వోద్యోగాలలో, వృత్తులలో, వ్యాపారాలలో తెలంగాణాలో ఉంటున్న ఆంధ్రులనికూడా ప్రాంతీయాభిమానులు తరిమివేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణా నిర్మాణానికీ దీనికీ ఏమిటి సంబంధం?

ఇక 'మిగుళ్లు' సంగతి: శ్రీ కుమార్ లలిత్ నివేదికలో జరిగిన కేటాయింపు సిద్ధాంతాలని ప్రశ్నించేవారిని దొంగ లెక్కలు తయారుచేస్తున్నారనటం హాస్యాస్పదం. శ్రీ లలిత్ రాష్ట్రప్రభుత్వం వారు చెప్పిన పద్ధతులని అనుసరించటానికి 12 సంవత్సరాల లెక్కలని వాడారు. ఇవన్నీ ఆడిట్ అయిన లెక్కలు. శ్రీ లలిత్ అనుసరించిన పద్ధతులని వారే వర్ణించారు ఈ పద్ధతులలోని న్యాయాన్ని కొందరు ప్రశ్నించారు.

అంతేకాదు, కొన్ని సందర్భాలలో అక్రమపద్ధతులుకూడా వాడినట్లు ఆరోపణలువచ్చాయి. ఒక ఆరోపణ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, వాడకానికి సంబంధించినది; మరొకటి పాల వ్యాపారానికి సంబంధించినది—శ్రీ లలిత్ నివేదికలో విజయవాడలో పాలు కొన్నప్పుడు అది 'ఆంధ్ర' వ్యయంగానూ, ఆ పాలని హైదరాబాదులో అమ్మినప్పుడు తెలంగాణా ఆదాయంగానూ చూపబడి ఉందిట!

పైన చెప్పిన దానిని మళ్లీ చెప్పటం అనవసరం: ముఖ్యమంత్రి ఒప్పుకున్నంత మాత్రాన గణితశాస్త్రం మారిపోదు. అన్యాయం న్యాయం అయిపోదు. దూషణ వాదంకాదు.

అదేవిధంగా అల్పసంఖ్యాకుల హింస స్వతంత్రోద్యమం అవదు. విడిపోవటానికి ఎన్నోవిధానాలు ఉన్నాయి. (ఒ. వి.)

డాక్టర్ కబుర్లు

దంతాల ఆరోగ్యం

'చూయింగ్‌గమ్' నమలటం మూలాన నోటిలో ఉమ్మి ఉత్పత్తి ఎక్కువ అవుతుంది. ఉమ్మి క్షారపదార్థం కాబట్టి దంత నాశనాన్ని అరికడుతుందంటారు. ఉమ్మిపుట్టించే గ్రంథులు తీసివేస్తే దంతక్షీణం అధికం అవుతుందని పరిశోధనలు తెలుపుతున్నాయి.



అయితే, చూయింగ్‌గమ్‌లో చక్కెర ఉంటుంది. చక్కెర పళ్లకి ఏమాత్రం మంచిదికాదని దంతవైద్యుల నమ్మకం.

భోజనాలమధ్య తీపి తినటం మంచిదికాదుట. తీపివల్ల పళ్ల మీద 'ఎనామెల్' పోతుంది.

ఒకవేళ తీపి తింటే వెంటనే పళ్లని శుభ్రం చెయ్యటం మంచిది.

తరచు దంతవైద్యుని సంప్రదించటం మంచిది.

హెచ్. ఎల్. హార్విన్‌సోన్
(కాపీరయిటు)




పాండ్స్ ఫేస్ పౌడర్‌తో గంటలకొలది మీ ఛాయ నిర్దోషంగా కళకళలాడుతూ వుంటుంది

పట్టులా మెత్తగా వుండే పాండ్స్ ఫేస్ పౌడర్‌తో మీ ముఖాన్ని నిర్దోషంగా సౌందర్యంతో ప్రకాశింపజేసుకోండి. చారలు పడవు....పగుళ్లు ఏర్పడవు. పాండ్స్ ఫేస్ పౌడర్ అతి సుకుమారంగా సమానంగా మీ చర్మానికి అంటుకొని గంటలకొద్దీ అందాలు చిందుతూ మనోహరంగా వుంటారు!

క్రీమ్ ఫ్లవర్ 8 ఛాయలలో కావలసినది తీసుకోండి: న్యాచురల్, ఒంషెల్, గోల్డెన్ రాషెల్, పీచ్, సన్‌ట్యాన్, బ్రాంజ్, హన్సిగ్లో మరియు వైట్.

మూడు సైజులతో: చిన్నది, మధ్యరకము, పెద్దది.

మీమీ
వ్యక్తిగత ఛాయలకు
అనుగుణ్యంగావుండి
ప్రాముఖ్యత నిచ్చేలా
8 రంగులలో
లభిస్తూంది



ఏ యితర ఫేస్ పౌడర్‌కంటె పాండ్స్ ఫేస్ పౌడర్‌నే చాలామంది స్త్రీలు వాడతారు.

చీస్బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమిత బాధ్యతతో యు.ఎస్.ఎ.లో స్థాపితము)

P-4960A

తెలుగు సమైక్యతా మైదానంలో తోడేళ్ళ గుంపు

మీ పత్రికలో ప్రచురితమైన కొన్ని వ్యాసాలు (తెలంగాణా గురించి) చదివిన తరువాత ఈ వ్యాసం వ్రాయాలనిపించింది. నిష్పక్షపాతమైన వాస్తవమైన అభిప్రాయాలు ఆంధ్రలోకానికి అందజేసినందుకు ఎంతో సంతోషము. ఉద్రేకాలకు ఆవేశాలకు అనుమానాలకు తెలంగాణా ఈ ఆరునెలల నుంచి నిలయమైంది. ప్రజాజీవితం, విద్యాలోకం పూర్తిగా స్తంభించి పోయింది. అవమానాలు, అన్యాయాలు, అరాచకాలు, పరిస్థితులు అవగాహన చేసుకోలేని కొన్ని అరాచక శక్తులు చేసినప్పటికీ కుట్రదారుల ఎవరో తెలుగు సోదరులకు అర్థమయ్యే సమయము ఆసన్నమయింది. అసలు ఈ ఉద్యమం ఎలా ప్రారంభమయిందో ఎవ్వరు (?) చెప్పుకున్నా మొదట ఖమ్మంలో కొంత మంది విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి సరిగానా (?) మాట్లాడుతూ అంతాలకు (?) దిగి కాబోయే రాబోయే ఉద్యోగాన్వేషణకు తెలంగాణా రక్షణలు లేని (?) నిరాహార దీక్ష ప్రారంభించారు. ఇది సదుద్దేశంతో నైనా కొన్ని రాజకీయ శక్తులకు ఈ గాలం బాగా నచ్చింది.

అగ్నికి ఆజ్యం పోసినట్లు ముఠాతత్వాలకు పుట్టి రాజకీయాలకు పరస్పర ద్వేషాలకు ఊపిరి పోసి అయిన ఉస్మానియా విద్యార్థి సంఘంలో రెండు ముఠాతత్వాలు పంతాలకు పట్టింపులకు పోయి 'రక్షణలు' అని కొంతమంది (అధ్యక్ష వర్గం) 'విడిపోదాం' అనేనినాదంతో కొంతమంది (కార్యదర్శివర్గం) తీర్మానించుకున్నాయి. అసలు ఆరోజు కార్యక్రమంలో ఇరు వర్గాలు కూడా ఒకరు కోరిన దానికి ప్రతికూలమైనది మరొక వర్గం కోరాలనే నిశ్చయానికి వచ్చారు. ఇలా విద్యార్థులు వీధులెంట పడి రక్షణలు, విడిపోదాం అనే ధోరణికి వచ్చారు. విద్యాలయాలు మూసి పోయాయి. నగరంలో ఒక సంచలనం బయలు దేరింది. ప్రభుత్వం దీన్ని కుట్రకారు చేష్టల క్రింద ఊహించి జాగు చేసింది. ఇలా పరిణమించిన ఈ విపరీతం సమయవాదులకు అవకాశంగా మారింది. ఒకరి కొకరు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఉద్యమంలో ఇప్పుడు అసలు సిసలైన రాజకీయ వేత్తలు తలలు దూర్చారు. (తెలంగాణా ఆంధ్ర రెండూ భార్యాభర్తలు. వారు ఇష్టం లేనప్పుడు విడిపోవచ్చు అని శ్రీ స్వామీ గారన్నారు.) అలాగే అందులో [illegible] భార్య అను కొంటే.

ఇప్పటికి ఆంధ్రనే భార్య అనుకుందాం. అంటే ఈ భార్యపై తెలంగాణా భర్తకు రకరకాలైన దుష్ప్రచారాలు చేసారు కొంత మంది తెలుగేతరులు. ధన సహాయం 'ముమ్మ రంగా కురిపించారు. ఉద్యమం మొదట్లో ఎవర్నీ ఆకర్షించలేక పోయింది. కలసిఉంటే కలదు సుఖం అని చాలా మంది అభిప్రాయ పడ్డారు. కానీ విశాల హృదయాలు అందరికీ వుంటాయంటే అనుమానమే కదా! అమాయకులైన తెలుగు సోదరులకు లారీలలో తిరగడం సత్యాగ్రహాలు చేయడం, అరెస్టులు కావడం అలవాటు చేసారు. తెలంగాణా అంటే ఏమిటో, ఆంధ్రులెవరో తెలియని అమాయకులు కుట్రదారుల ఉచ్చులోకి బాగా ఇరుక్కు పోయారు. బస్తీ బస్తీకి తిరిగి ఆంధ్రులేదో అఘాయిత్యాలు చేసారని వారికి చెప్పారు. లారీలలో తిరగడం సరదా అయిన అలగాపులగా జనం—అందులో ముప్పాతిక మంది 12 సం. లోపు వయస్సు వారు—ఆ నాయకులు అనిపించే కొన్ని నినాదాలు గొంతులు చించుకొని అరవడం, నగరంలోని గోడలపై నింపడం చేసారు. ఈ అసభ్యకరమైన నినాదాలు చూస్తే ఇవి వీరి నాయకులకు నిజమైన తెలంగాణా కావాలో లేక తమకుఇష్టం లేని కొంతమంది మంత్రులు గద్దె దిగాలని వ్రాసారో నగర వీధులు పర్యవేక్షిస్తే తెలుస్తుంది. ఈ నినాదకులకు రోజూ నగరంలోని కొన్ని హోటళ్ళలో ఫలహారాలు పెట్టించడంతో ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమం చాల బాగుందనుకున్నారు. ఇంటు గడవని కొన్ని వర్గాలకు ఈ ఉద్యమం మహదానందం కలిగించింది. దీనికి తోడు నాయకులు లూటీలు, దహనాలు, అత్యాచారాలు చేయమని చెప్పడంతో ప్రతి వీధిలోను కుర్రకారు ఒకడబ్బా పట్టుకొని కనపడిన ఆంధ్రునెల్లా కిందిసిఅడిగి జీవన భుక్తికి మార్గంగా చూసుకున్నారు. మర్యాద కాపాడుకో దలచిన ప్రతి ఆంధ్రుడు చిరునవ్వు తోనే 'ఆడబ్బాతో' తృణమో ఫణమో వెయ్యాల్సి వచ్చింది.

ఇక ముమ్మర సత్యాగ్రహ సమరం జరిగింది. అందులో ప్రతి పురుషుడికీ మూడు రూపాయలు, స్త్రీకి ఆరు రూపాయలు ఇవ్వడం జరిగింది. ఇది ధనం బాగా కురిసే దాకా జరిగింది. ఒక్కసారిగా అందరికీ ఆశ్చర్యం కలిగించేటట్లు మటు మాయమయ్యాయి. ధనమూలం ఇదం జగత్ అన్నారు [illegible] స్వార్థం చూసుకుంటాడు.

కొన్ని ఆంధ్ర కాలనీలలో కొన్ని రోజులు పని మనుషులు పని మానేశారు. పనికాదు, సత్యాగ్రహంలో వారికి గిట్టుబాటు ఎక్కువగా ఉండేది. ధన బలం తక్కువయి కొద్దీ సత్యాగ్రహాల సంఖ్య తక్కువయింది. ఇక అసలైన ఉద్యమకారులు ద్వేష (?) మాటలతో అలజడి (?) చేశారు. ఆ కొన్ని రోజులు ముఖ్యంగా జూన్ 3 వ తారీఖు ప్రభుత్వము స్తంభించి పోయిందనే చెప్పాలి. నాయకులు అనర్గళంగా ఉపన్యసించారు. నేను అలాంటి ఉపన్యాసాలు విన్నందు వలన కొన్ని వివరిస్తాను. ఒకానొక మహిళ ఇలా హరిజనవాడలో అన్నది: 'మనమంతా ఆంధ్రోళ్ళని తరమాలి! మంచి మంచి బిల్డింగులు కట్టినారు. వీళ్ళందరూ ఎళ్ళిపోతే మీ బస్తీ (?) కాడున్న ఆంధ్రోళ్ళ బిల్డింగులు మీకు తెలంగాణా సర్కారు వ్రాసనే (?) ఇస్తుంది.' ఈ మాటలు మరుసటి రోజు పాల (?) వాళ్ళు, పాకీవాళ్ళు, పని మనుషులు ఆంధ్ర కాలనీలలో చెప్పుకుని కొంతమంది వారికి ఏ భవంతి ఇష్టమైంది కూడ నిర్ణయం చేసుకొన్నారు.

మరొక ప్రముఖ వ్యక్తి ఇలా అన్నాడు: 'మన తెలంగాణా బియ్యం అంతా ఆంధ్రోళ్ళు మింగేస్తున్నారు. వాళ్ళు ఈడి నుంచి ఎళ్ళిపోతే మన సర్కార్ రూపాయికి నాలుగు సేర్ల బియ్యం ఇస్తుంది' అన్నారు. పాపం! అమాయక ప్రజలకు బియ్యం గవాణా (?) సమాచారం తెలియదు కదా. పగటి కలలకి ఉబ్బిపోయారు. ఒక విద్యార్థి నాయకుడు ప్రసంగిస్తూ 'మీరు ఏమి గాభరా పడకండి. పోరగాళ్ళను ఇస్కూళ్ళకు పంపకండి. తెలంగాణా సర్కారు అందరినీ పాస్ చేస్తుంది. పోరగాళ్ళను లారీల్లోకి తోలండి. భయమేమీ లేదు. మా పోరగాండ్లు జెయిలుకు పోతే మేము అన్నం పెట్టి పంపుతాం!' ఇలా నాయకుల ఉపన్యాసాలు కొన సాగాయి. అంతూ పంతూ లేకుండా ఈ ఉద్యమం నడచింది. ప్రభుత్వలోపం పూర్తిగా ఉందని చెప్పడం కూడ కష్టమే. ప్రజాస్వామ్యంలో ఆ మాత్రం వాక్ స్వాతంత్ర్యము అనుభవించాలని ప్రభుత్వ నాయకులు అనుకొని యుంటారు. దీనికి కారణం ముఖ్యంగా 'లోకల్ పోలీసు'. తండ్రి డాక్టరయినా తన బిడ్డకు జబ్బు చేస్తే మరొక డాక్టరు దగ్గరకి తీసికెళ్తాడు. అలాగే ఇక్కడ క్రొత్త పోలీసులు లేకుండా ప్రాంతీయ పోలీసులు వీరిని అదుపులో పెట్టడానికి మొహమాటాలు, పెద్దరికాలు అడ్డు వచ్చాయి. కొంత నిర్లక్ష్యం కూడ దీనికి కారణం. ఖాదీబోర్డు భవంతి—ఆరోజు నేనక్కడన్ కాచిగూడా చౌరస్తాలోనే ఉండడం తటస్థించింది. సుమారు

60 మంది దాకా లోకల్ పోలీసు దళం ఆ ప్రాంతాల్లో ఉన్నారు. ఆ ఖాదీ గోడౌన్‌ను సుమారు 20 లేక 30 మంది దుండగులు అటకాయించారు. వీరిని అదుపు చేయడం పోలీసులకు తేలికే, కానీ వారి నిర్లక్ష్యం వల్ల గోడౌనపోయి ప్రతిఒక్కరూ అందులో చొరబడ్డారు. బేళ్ళకు బేళ్ళు వస్త్రాలు మోసుకు పోయిన తరువాత మిగతా వాటిని తగుల బెట్టారు. ఈ దుండగుల కన్నా, సినిమా చూస్తున్న ప్రేక్షకవర్గం ఆ పరిసరాలలో విస్మయోయుక్తై నిట్టూర్పులు విడుస్తూ ఉంది. వీధి వీధికి అడుగడుగుకూ పెద్ద గుడి బండలు అడ్డంచారు, దీన్ని కొంతమంది సంఘంలో పెద్దలు ఇళ్లల్లో కూర్చుని అల్లరి మూకలను అదుపు తీసికొని కార్యక్రమాన్ని నడిపించారు. దీనికి లోకల్ పోలీసు సహాయ నిరాకరణోద్యమం కారణమనే చెప్పాలి. ఒకచోట పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డు బ్లాక్ చేశారు. పోలీసులు దీన్ని పర్యవేక్షిస్తూ కూర్చున్నారు. ఆ తరువాత అప్పటికి ఒక సహాయ పోలీసు కమీషనరు జీప్‌లో రావడం, పోలీసులపై అక్షింతలు పడ్డ తరువాత వారికి కొద్దిగ చలనం కలగడం జరిగింది.

ఏదో జరిగింది జరిగింది. అసలైన మూలం ఏమిటి అని ఆలోచించాలి. ఏవో అన్యాయాలు జరిగాయని అన్నారు పెద్దలు. ఆ అన్యాయా లేమిటి? మాకు ఉద్యోగాలు రాకుండా ఆంధ్రులు ఆక్రమిస్తున్నారు! ఇది విద్యార్థిలోకం నించి వినిపించే ఆర్తనాదం. దీనికి సమాధానం శ్రీ కొండా లక్ష్మణ్ గారు చెప్పే యున్నారు. వారన్నట్లు తెలంగాణా ప్రాంతీయులు సెక్రటేరియట్‌లో డైరెక్టరేట్‌లలో ఎక్కువ మంది ఉన్నా వారిలో తెలుగువారి సంఖ్య చాల తక్కువ అన్నారు. దీనికి ఆంధ్రులేమి చేస్తారు? అందరూ క్రైస్తవులు, దూదేకులు గవ్లీలు, కిష్టన్‌లూ, పాండేలు, కరేలు, జైనులు తెలంగాణ పేరు చెప్పుకొని పదవులు ఆక్రమించారు. పూర్వం నుంచి తెలుగువారిని అణచిపెట్టి, భూస్వాములై, అధికారులై, అధికారాలు స్వీకరించారు. ఈ దురదృష్టానికి ఆంధ్రు లెలా కారణమవుతారు? ఈ ప్రాంతం నుంచి పానీపొస్తు నించి ఉద్యోగాలలో తెలుగు వారికి అడ్డంగా నిలబడ్డ ఈ తెలుగేతరులకు ఆంధ్రులేమి కారకులవుతారు?

తెలుగువారిని కాదని తెలంగాణా పేరుతో ఉద్యోగాలు సంపాదించారు. తెలుగువారు ఉద్యోగానికి రాలేకపోవడం, మొదటి నుంచి వారి దమన విధానం. నిన్న మొన్న వచ్చిన ఆంధ్రుల దమన విధానమా? నాగా పరిస్థితులు ఆకళింపు చేసికొంటే అసలు సిసలైన పరిస్థితులు అవగాహన మవుతాయి. ఈ ఉద్యోగ వివాదం తెలంగాణా విద్యార్థులలో వ్యాపించి ఆంధ్రులపై ఒకవిధమైన విద్వేషం కలిగించింది. ఒక తెలుగేతరుడు ఇలా అంటాడు: "ఏ ఆంధ్రావాలా పూరా తెలంగాణాకో గుటా లేయాలి.' పాపం గుత్తంవాళ్ళు ఎలాగో క్షేత్ర ద్రోహులైన తెలుగు వారికి తెలియ రాలేదు. ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డ తర్వాత ప్రభుత్వం అంతా సుమారే కదా. మన రాజధాని ముక్కోటి ఆంధ్రులకు ముఖ్యపట్టణం. భాగ్య నగరం అంటూ రాష్ట్రం కోని పరిశ్రమలన్నీ హైదరాబాదులోనే కేంద్రీకరించింది. శ్రీ వెంకటస్వామి ఎం. పి. గారు ఒక రోజు ఉపన్యసిస్తూ 'నేను లక్ష యాభై వేల మందికి కార్మిక నాయకుడనని' సగర్వంగా చెప్పుకున్నారు. అంటే ఇన్ని పరిశ్రమలు ఏర్పడితేనే కదా అంత మంది కార్మికులకు అవకాశం దొరికింది, ఉద్యోగ సమస్య తేలింది. ఈ కార్మికులు ఆంధ్ర ప్రాంతం వారా! ఇది పాపం శ్రీ వెంకటస్వామి గారికి స్ఫురించి ఉండదు. హైదరాబాదు సరిహద్దులు లేకుండా పెరిగి పోయింది. ఎటు చూచినా అందమైన భవనాలు, ద్రాక్షతోటలు, సినిమా పరిశ్రమలు, స్టూడియోలు, ఇవన్నీ అనుభవించే హక్కు తెలుగు వారైన తెలంగాణాకే కాని ఆంధ్రలోని సామాన్య ప్రజానీకం రాజధాని అందాన్ని చూసి, అనుభవించే భాగ్యం ఉండదు కదా! ఇలా పెరిగిపోతున్న నగరంలో సామాన్యంగా ఉద్యోగావకాశాలు, ఎవరికీ లభిస్తాయి. ఇది ఆలోచించక కేవలం ఆవేశంతో మాట్లాడితే లాభం ఏమిటి?

ఆంధ్రు లొచ్చి నగరంలో స్థలాలను కొని పోయారు అన్నారు. భూములను ప్రభుత్వం పట్టా లిచ్చిందా, ఈ భూస్వాములు గదా రెండు నుంచి రెండు వందల దాకా అమ్మేరు కదా? ఆంధ్రుల రాకతో ఒక క్రొత్త పరిశ్రమ లాగ ఇళ్ళు కట్టేవారికి జీవన భుక్తి కలిగిందా లేదా! మేస్త్రీలు కూలీలు కట్టారు. 5 రూ. నుంచి 7 రూ. దాకా తీసుకొన్నారు కదా. ఎంత మంది బీద ప్రజలకు బ్రతుకు తెరువు ఏర్పడిందా లేదా? వీరందరూ ఆంధ్రులను తలచుకొని క్షణం అంటూ ఉండగా తెలంగాణా పేరుతో పిలిచినప్పుడు ప్రభుత్వం భరించుకున్నదా! పోటీ సామాన్య ప్రజానీకం కాదు కీయ పెట్టుకున్నాను చెప్పాం. మరి సంఘంలో పవిత్ర స్థానమున్న ఉపాధ్యాయ వర్గం ఎందుకు ఈ ఉద్యమంలో పడింది. ఈ కాలేజీ ఉపాధ్యాయ వర్గం ఒక రిపోర్టు అంటూ రెండు గంటలు కష్టపడి ఒక మీటింగులో బయట పెట్టింది. ఈ మహానుభావులు రిపోర్టు అంటే ఫిలిప్స్ నుండి పారా! వీరి రిపోర్టు పేపర్లో అంతా 'వన్ సైడ్' (ఏక పక్షీయం)గా ఉంది. రిపోర్టు అంటే అందులో బాగోగులు రెండూ చూడాలి కాని అందులో ప్రత్యేక తెలంగాణా కావాలి అని రిపోర్టు వేశారే కాని ప్రత్యేక తెలంగాణా వస్తే రాబోయే అనంతరాలు వారికి ఉద్రేకంలో తెలియరాలేదు.


ఇక పోతే న్యాయవాదులను తీసుకుందాం. ఆంధ్రులలో మంచి మేధావులయిన న్యాయవాదు లున్నారు. వారి సంఖ్య కూడ ఎక్కువగానే ఉంది. వారిని అందరూ పేరున్నవారని ఆశ్రయిస్తే వీరేమయేది మరి. ఇక వ్యాపార సంస్థలు తీసుకుందాం. కొన్ని గుత్తుందార్ల వ్యాపార సంస్థలు ముమ్మరంగా దబ్బులు కురిపించారని సోషలిస్టులైతే కాంగ్రెసు పార్టీ సమావేశాలలోనూ కూడ చాల మంది ఫిర్యాదు చేశారు. చాల మంది మూలాయిగా బిల్డింగ్స్ రాస్తి గిరాఖీకి అవకాశం దొరక పోవచ్చు. మొన్న జరిగిన లూటీ, దౌర్జన్యంలో ఒక్కొక్కరికి 10 రూ. ఇచ్చారని చెప్పుకుంటారు? ఇలా కొన్ని అవాకే తీస్తే చాల కథ ఉంటుందని కొందరి భయం. మరొక గమనించ దగ్గ విషయం ఏమిటంటే వార్ తరువాత నగరంలో ముఖ్య స్థలాలు ఎస్. ఆర్. పి., ఎ. ఆర్. పి. దళాలు ఆక్ర



అమెరికా రాయబారి శ్రీ చెస్టర్ బి. బౌలింగ్ [illegible] 2వ [illegible] [illegible] శ్రీ [illegible] [illegible] [illegible]

'రంగులరాట్నం'

మోవా



పరిణామ చరిత్రలో పక్షులు ఎగరటం అలవాటు, వీలు చేసుకోడం ఒక ముఖ్యఘట్టం. అయితే ఏదో బ్రహ్మాండమైన కార్యం సాధిద్దామని అత్యాశకు పోయినట్లుగా మనం ఈ సాధించడాన్ని వర్ణించకూడదు. శత్రువులనుంచి తప్పించుకొని పోవడానికి వేరే గతిలేక, ఆ మార్గం పట్టాయి. భయపడవలసిన శత్రువు లేకపోతే, లేక తగిన ఇతర రక్షణే ఉంటే, తిరిగి ఆ రెక్కలను ఉపయోగించుకోడం మానుకొని నేలమీద జీవితానికి అలవాటు పడిపోతాయని మనకు రుజువులున్నాయి. మన కోడి అలాటిదే ఒకటి.

మానవజాతి పరిణామం చెందక ముందే అనేకజాతులు ఇలా, విహంగ దశనుండి, భూచరస్థితికి మారి పోయాయి. వాటిలో ఒకటి 'మోవా' అనేది. ఇది న్యూజిలాండులో ఉండేది. బహుశా 600 సంవత్సరాల క్రితం అయి ఉండవచ్చు, ఇది పూర్తిగా నాశనమైపోయింది. దీనికి కారణం అక్కడ ఉండే మవోరీజాతి ప్రజలు అని శాస్త్రజ్ఞుల అనుమానం. వాటి ఎముకలు గుడ్డు పెంకులు విరివిగా [illegible] ఇవి 12 అడుగుల ఎత్తు కూడా ఉండేవని తెలుస్తోంది. [illegible]

అదేవిధంగా మడగాస్కరులో 'రాక్' అనే, ఏనుగుపక్షి అని పిలవబడేవి ఉండేవి. ఇవి 10 అడుగుల ఎత్తు కూడా ఉండేవి. నిలబడి చెయ్యి ఎత్తినా దానితల అందేది కాదు. ఇది కూడా 300 సంవత్సరాల క్రితమే నిశ్శేషమయింది. దీని గుడ్ల పెంకులు ఎముకలు విరివిగా దొరికేయి. గుడ్లు అడుగు పొడవు వెడల్పు ఉండి 2 గాలన్ల పదార్థం పట్టగలిగేవిగా ఉండేవి. వీటిని అక్కడి ప్రజలు పెద్ద గిన్నెలుగా ఉపయోగించుకొనే వారంటే ఆశ్చర్యం లేదుకదా!

వీటి ఎముకలు కూడా చాల బలమైనవి. వాటికాళ్ళు ఒక్కొక్కటి మన అంతఎత్తు ఉండేవి. 'అరేబియన్ నైట్స్' కథల్లో వచ్చేపక్షులు వీటి ఆధారంగానే వచ్చి ఉంటాయని అందరూ భావిస్తారు.

మానవజాతి రాకముందు తమ రెక్కలని క్షీణింప చేసుకొన్న ఇవి, మానవజాతి అవతరించాక అతని చేతుల్లో నాశనమయ్యాయి. ఉష్ట్రపక్షి, కివీ, మొదలైనవి ఇంకా జీవించి ఉన్నా, ఆ దురదృష్టదశకు ఎంతో దూరంలో లేవనుకోవచ్చు. అయితే మన దూరదృష్టి వాటిని కాపాడగలదుకూడా. జాతిని నాశనం చెయ్యగలంగాని తిరిగి సృష్టించలేము కదా!

—జమ్మి కోనేటిరావు.

తెలుగు సమైక్యతా...

మించాయి. ఆ తరువాత హింసాకాండ కుద్యుక్తులైన అల్లరి మూకలు బయటికి రాకపోవడానికి కారణం. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో కొందరు ఎందుకు తల దూర్చారు అన్న ఒక ప్రశ్న ఉదయిస్తుంది. చేరిన వారిలో సగం మంది భయస్తులు. స్వతహాగా ఇష్టం లేకపోయినా మూక దవుర్జన్యానికి భయపడి చేరినవారు ఎక్కువ. అధికార దాహం ఇందులో ఉన్నా పరస్పర ద్వేషం దురాలోచనలు ప్రబలమైన కారణాలే. అసలైన తెలంగాణీయుడు వేరు తెలంగాణా కోరడు.

ఒక ప్రసిద్ధ తెలంగాణా కవి కొన్ని మూకలు అతన్ని వేరు తెలంగాణా ఉద్యమంలో పాల్గొనమంటే ఇలా అన్నారట — వీర తెలంగాణానే కాని నాకు వేరు తెలంగాణా వద్దు అని. కురువృద్ధులు శ్రీ మాడపాటిగారు దీని నెందుకు తిరస్కరించారు? ఏమైనా కొన్ని పెద్ద తలలు కేవలం ఆత్మ రక్షణకే ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఎన్. జి. వో. లు దీనిలో పాల్గొన్నారు. వీరి అధ్యక్షుడు ఒక కేరళీయుడు. ఈతని ఉద్రేకపూర్వక రెచ్చగొట్టే ఉపన్యాసాలే ఇతన్ని పదవి నుంచి తొలగించాయి. ఎన్. జి. వో. లకు ప్రభుత్వం రక్షణ కలిగించడంలో కొద్ది లోపం ఉంది. నూరుమంది వద్దన్నా పదిమంది కావాలని అడ్డుకుంటే చిక్కే కదా! ఎన్. జి. వో. లకు ప్రజా సమితి వాగ్దానాలు ఏమిటి? మీ ఉద్యోగాలు వదులుకోండి. తెలంగాణా సర్కార్ మిమ్మలను కాపాడుతుంది. మిమ్మల్ని ఉద్యోగం నుంచి తొలగిస్తే మేము 3 నెలల జీతం ఇస్తాం, అన్నారు. ఆ తరువాత అప్పులు ఇప్పిస్తాం, ఆ తరువాత చూద్దాం అనే ధోరణికి వచ్చారు, తీరా వారికి జీతాలు రాకపోయేటప్పటికి.

ఏది ఏమైనప్పటికీ ప్రతి తెలుగువాడు అనేదేమంటే ఈ తెలుగేతరులు ఈ ఉద్యమాన్ని నడిపారు అని. వారు ప్రశ్నించే దేమంటే ఈ క్రింద పేర్కొన్న ప్రముఖులు, తెలంగాణా భవిష్యత్తు కోరే పెద్దలు, కనీసం తెలుగు మాట్లాడటం వ్రాయటం చేతకాని వారికి తెలంగాణా భవిష్యత్తు కావాలా? వారెవరంటే శ్రీ పిట్టీ, శ్రీ మేల్‌కోటి, శ్రీ పద్మనాభన్, శ్రీ మల్లిఖార్జున్, శ్రీ మదన్ మోహన్, శ్రీ జైన్, శ్రీమతి కుముద్ నాయక్, శ్రీ సక్సేనా, శ్రీ జైస్వాల్, శ్రీ గోవిందసింగ్, శ్రీ అహ్మెస్, శ్రీ అన్సారీ, శ్రీ దూత్ ఇతరులు ఈ ప్రముఖులు తెలుగు సోదరుల మధ్య కక్షలకు కారకులు కారా? తెలుగు సోదరుల సమైక్యతా మైదానంలో ప్రవేశించి అభూత కల్పనలు, ఆవహేళనలూ, అవమానాలు, ద్వేషాలు కలిగించిన ఈ తోడేళ్ళ గుంపును తెలుగు సోదరులు సమైక్యంగ నిలిచి ఎదురించిన నాడే తెలుగు తల్లి సంతసిస్తుంది.

—వై. యాదగిరి ●

భార్యాభర్తలపై అత్యాచారం

ఝాన్సీరాణి మహారాణి లక్ష్మీబాయ్ మెమోరియల్ ప్రాంతంలో ఒక స్త్రీ శవం దొరికిందట. సినిమా చూసి, సైకిలుమీద వస్తున్న భార్యాభర్తలను ఎవరో దుండగులు ఆపి భార్యను చంపేశారట. భర్త ప్రాణాలు చేతబట్టుకుని సైకిలుతో, భార్యను వదిలి పారిపోయాడట పాపం.

చెరుకుతోటలో స్త్రీశవం


ఆర్కాటుకు చెందిన ఆరణిలో ఒక చెరుకు తోటలో ఒక స్త్రీ శవం దొరికిందట. ఆమె పేరు సరోజ అనీ వయస్సు ఇరవై నాలుగేళ్ళుండవచ్చని కనిపెట్టింది పోలీసు. ఆమె భర్త నాగ్‌దాసుతో పని చేస్తున్నాడట. శవం మీద గాయాలు కత్తి వేటులుండడంలేదుగానీ, పొత్తి కడుపు చీల్చి నట్టు వుందట. ఇంత దారుణంగా హత్యచేసిం వారెవరో, ఎందుకు చేశారో ఇంకా తేలవలసి వున్నది.

ప్రాణభీతి

ప్రేమ్‌నారాయణదాస్ అనే అతను తన ఉద్యోగం పోయి, పదుగురు పిల్లలను, భార్యను కాపాడలేక, వారి అవస్థ, కుటుంబస్థితి చూడలేక అందర్నీ హత్య చేశాడట. [illegible] ఒడ్డుకు తీసుకుని వెళ్ళి తాడుతో అందర్నీ కట్టేసి వారితో సహా తనూ దూకేశాడట. భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్ళు చనిపోయారట. అతనుమాత్రం ఈదుకుంటూ వచ్చి, పోలీసు స్టేషనుకు వెళ్ళి తన నేరాన్ని ఒప్పుకున్నాడట. ఆయన సారంగ



లాకప్‌లో డ్యూటీ మంచు ఎప్పుడూ ఎక్కించి పటుగా పని చేస్తుండే వాడట.



కొత్తా కవింత...

ఇర్ఫానీస్ ధాకర్ అనే 23 ఏళ్ళ అమ్మాయి తన తలిదండ్రుల అభిప్రాయాలకు ప్రాముఖ్యత ఇవ్వక తన మనస్సుకు నచ్చిన [illegible]కులానికి చెందిన బాపూభాయ్ అనే అతన్ని పెళ్ళి చేసుకుందట. పెళ్ళయి 15 నెలలు అయ్యిందట. పెళ్ళయ్యాక రానురాను వీరికి ఒకరంటే ఒకరికి గిట్టకపోవడం ఎక్కువయ్యిందట. దాంతో పోయిన మే 22న ఇద్దరు విడాకులివ్వడానికి ఏర్పాటు చేసుకున్నారట. ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయిందట. కానీ బాపూభాయి అప్పుడప్పుడు ఆమెను భయపెట్టి తనింటికి తీసుకు వెళ్ళేవాడట. జూన్ 12న అవిధంగా తీసుకు వెళ్ళి, ఆమెకు విషం పెట్టేశాడట. ఇంటికి వచ్చి ఆమె స్పృహ కోల్పోయే సరికి తలిదండ్రులు వి. యస్. ఆసుపత్రిలో చేర్చారట. అక్కడ ఆమె చనిపోయిందట.

* * *

దొంగతనం చేశాడని నింభద్రదాస్ అనే 22 ఏళ్ళ కుర్రాణ్ణి, (అల్లా మధుర) పోలీసు స్టేషనులో ఖైదీగా 12 వ తేదీన వుంచారట. అయితే 17 వ తేదీన అతని శవం ఓ బియ్యం మిల్లు పక్కన రోడ్డు మీద పడుందట. అదేమంటే అతను ఆత్మహత్య చేసుకున్నాడు మేం వదిలేశాం పొమ్మన్నారట పోలీసు. కానీ ఇది మోసం అని నింభద్రదాస్ తండ్రి కొన్నివేల మంది జనంతో ఆ పోలీసు స్టేషను మీద దాడి చేసి రాళ్ళు రువ్వారట. దాంతో పోలీసులు కాల్పులు జరపడం, ఒకరు చనిపోయి, ఆరుగురు గాయపడడం జరిగింది. పోలీసులవైపు 13 మంది తీవ్రంగా గాయపడ్డారట.

* * *

జెర్సీసిటీలో రాల్ఫ్ టారిస్ అనే 40 ఏళ్ళ ఆయన తన భార్యను, ఏడుగురు పిల్లలను పొడిచి చంపేశాడట. తొమ్మండుగురు పిల్లల లోనూ ఇద్దరు పిల్లలు ఆ సమయంలో అక్కడ లేకపోవడంవల్ల మిగిలారట. పోలీసులు ఇంతవరకూ ఆయన అంత క్రూరంగా అందర్నీ చంపిన కారణాన్ని వెల్లడించలేదు.

* * *

లక్నోలో లాల్ బాగ్ క్రాసింగ్ వద్ద రత్నా అనే 25 ఏళ్ళ యువతిని ఎవరో ఇద్దరు పొడిచి చంపేశారట. స్నేహితురాలితో మాట్లాడుతున్న రత్నా [illegible] (జీతం తెచ్చుకోడానికి) కొంచెం అనుకొని వెళ్ళిందట. అంతలో ఎవరో ఒక వ్యక్తి అతని [illegible] మీద ఇటికతో కొట్టాడట. క్రింద పడిపోయేసరికి మరో వ్యక్తి ఆమెన్ని కత్తితో పొడిచి చంపేశాడట. ఇద్దరూ అందరూ చూస్తుండగా పారిపోయారట. గత ఎన్నో సంవత్సరాలుగా ఎన్నో హత్యలు జరుగుతూ 'హత్యాపురం' అని పేరుగాంచిన లాల్ బాగ్ క్రాసింగ్‌కు ఈ హత్య ఆ పేరుకు మరింత బలం తెచ్చింది.

* * *

దహాతి అనే గ్రామంలో ఓ అమ్మాయికి ఒక అబ్బాయితో వివాహం నిశ్చయమైంది. అబ్బాయి దహాతికి చెందినవాడట. అయితే తీరా పెళ్ళి ఆ అమ్మాయికి మరో అబ్బాయితో జరుగుతోందట. అది చూసి దహాతి గ్రామ పెద్దలు 'అన్యాయం' అని అడ్డుపడ్డారు. దాంతో తగవులాట తన్నులాటగా మారి పురోహితుడు, మరో ఇద్దరు మొత్తం ముగ్గురు చనిపోయారట.

పక్కవారి కుక్కల్ని తినడం న్యాయంకాదు!

రంగూన్ ప్రజలు పెంపుడు కుక్కలను తినేస్తున్నారట. పెంపుడు కుక్కలను డిన్నరులలో వాడుకో వద్దని, పక్కవారి కుక్కలను పట్టి చంపి తినేయడం న్యాయంకాదని ఆ ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది "నా కుక్కను [illegible] తినేశాడు" అని



పోలీసులు [illegible] ఇరుకున పెడుతున్నారు, కదిలించటంలేదు.


ఎపోలో-11

జూలై 16 వ భారత కాలమానం ప్రకారం సాయంత్రం గం. 7-02 లకు ఎపోలో-11 ముగ్గురు వ్యోమగాములతో కెన్‌కెన్నెడీ నుంచి చంద్ర మండల యాత్రకి బయలుదేరుతుంది. ఎంతో శక్తివంతమైన శాటరన్ రాకెట్ చివర అమర్చబడిన ఈ వ్యోమనౌకలో కమాండర్ నీల్ ఎ. ఆమ్‌స్ట్రాంగ్, కమాండ్ మాడ్యూల్ పైలట్ మైకేల్ కాలిన్స్, లూనార్ మాడ్యూల్ పైలట్ ఎడ్విన్ ఇ. ఆల్డ్రిన్ ఉంటారు.

ఎపోలో-11 మొదట భూప్రదక్షిణ కక్ష్యలో ఒకటి అనంతరం భూమ్యాకర్షణ పరిధినుంచి తప్పించుకుని చంద్రుని పైకి ప్రయాణం చేస్తుంది. చంద్ర కక్ష్యలో ప్రవేశించిన తర్వాత ఎపోలో-11 చంద్రుని చుట్టూ తిరగటం ప్రారం-




చంద్రుని పై కాలుమోపనున్న ఎపోలో-11 వ్యోమగాములు నీల్ ఎ. ఆమ్‌స్ట్రాంగ్, మైకేల్ కాలిన్స్, ఎడ్విన్ ఇ. ఆల్డ్రిన్ (జా)



లూనార్ మాడ్యూల్ చంద్రునిపై దిగిన తర్వాత ఎలా ఉంటుంది అన్న ఊహాచిత్రం. ఆమ్‌స్ట్రాంగ్ చంద్రుని నేలని పరిశీలిస్తుండగా అతన్ని కలిసేందుకోసం నిచ్చెన పైనుంచి దిగివస్తున్న ఎడ్విన్ ఇ. ఆల్డ్రిన్ (జా)

భిస్తుంది. అప్పుడు ఆమ్‌స్ట్రాంగ్, ఆల్డ్రిన్‌లు లూనార్ మాడ్యూల్‌లో ప్రవేశిస్తారు. అనంతరం అది మాతృనౌకనుంచి విడిపోయి చంద్రునిపై దిగుతుంది. చరిత్రలో అత్యద్భుతం, అపూర్వం అయిన ఈ సంఘటన జూలై 20 వ తేదీన జరుగుతుంది. కమాండ్ మాడ్యూల్ పైలట్ మైకేల్ కాలిన్స్ ఆ సమయంలో చంద్రునిపై 70 మైళ్ళ ఎత్తున ప్రదక్షిణలు చేస్తుంటారు. చంద్రునిపై దిగిన ఆమ్‌స్ట్రాంగ్, ఆల్డ్రిన్‌లు 15 గంటల విశ్రాంతి, అవసరమైన సన్నాహాల అనంతరం చంద్రోపరితలంపై అడుగు పెట్టడానికి ప్రత్యేకంగా రూపొందించిన దుస్తులని ధరిస్తారు. మొదట ఆమ్‌స్ట్రాంగ్ లూనార్ మాడ్యూల్‌నుంచి దిగి చంద్రునిపై అడుగు పెడతారు. ఆమ్‌స్ట్రాంగ్ దిగిన 30 నిమిషాలకి ఆల్డ్రిన్ కూడా దిగివచ్చి ఆయనతో కలుస్తారు. వారిద్దరూ మూడు గంటల సేపు చంద్రోపరితలంపై సంచరిస్తూ అక్కడి రాళ్ళని, ధూళి ఇతర పదార్థాలని సేకరించి ప్లాస్టిక్ సంచులలో, లోహపు పెట్టెలలో వుంచుకొంటారు. వ్యోమగాములు తమ వెంట తెచ్చిన టెలివిజన్ కెమెరాలు అమర్చి భూమిమీద ఉన్న ప్రజలంతా వారి కదలికలని, మాటల్నీ మాటలని, చూడటానికి వీలు కల్పిస్తారు. అందువల్ల భూమి

మీద ఉన్నవారంతా ఈ అపూర్వమైన అద్భుతమైన దృశ్యాలని చూడడానికి వీలవుతుంది. చంద్రకంపన సాధనాన్ని, లేజర్ అద్దాన్ని చంద్రునిపై అమరుస్తారు. సౌరగోళంనించివచ్చే సూక్ష్మరేణువుల్ని పట్టేదాచే సాధనాన్నికూడా అమరుస్తారు (తర్వాత దాన్ని తిరిగి భూమికి తీసుకుని వస్తారు). మూడు గంటల



ఎపోలో—11 చంద్రమండలయాత్ర పథకాన్ని చూపే ఊహాచిత్రం.

పాటు చంద్రునిపై సంచరించిన వ్యోమగాము లిద్దరూ తిరిగి ల్యూనార్ మాడ్యూల్‌లోకి వచ్చి దాని సహాయంతో మాతృనౌకని చేరుకుని ముగ్గురు వ్యోమగాములూ భూమికి తిరిగివస్తారు.

ఎపోలో—11 యాత్రవలన తాత్కాలిక ప్రయోజనాలకి పనికివచ్చే సమాచారం కొంతవరకూ లభిస్తుంది. అయినా ఈ యాత్ర సాహసమైనది, చారిత్రకమైనది. అక్కడ్నించి తిరిగి భూగోళానికి చేరుకో మానవుడు చంద్రలోకానికి ప్రయాణం కలదు అని నిరూపించడమే ఈ యాత్ర చేయగలడు, చంద్రునిపై దిగగలడు, లక్ష్యం.

ఎస్. ఎస్, బళ్లారి

సినిమా హాలులో మనముందు ఆడజాతి వున్న సినిమా చూచుటకు చాలా యింపుగా ఉంటుంది కదండీ?

తమబోంట్ వారింకా ఉండడంవల్లే ఎంత వద్దనుకున్నా సినిమాల్లో స్త్రీలకు ప్రత్యేకస్థానాలు ఉంటున్నాయి శివప్పగారూ, స్త్రీని తోటి వ్యక్తిగా గౌరవించకల్గడం తమ సభ్యతకు గీటురాయిగా ఎప్పుడు గుర్తిస్తారో తమబోంట్లు! ఆరోజుకై ఎదురు చూద్దాం.

సి హెచ్. ఎల్. ఆర్, భువనేశ్వర్

చలం స్త్రీపై మీ అభిప్రాయం? ప్రస్తుతం చలంగారెక్కడున్నారు? ఆయన దగ్గరకు ఎవరేనా వెళ్ళవచ్చా?

చలం స్త్రీ అందరూ ఓసారి చదువ వలసిన పుస్తకం. వారు రమణాశ్రమంలో ఉన్నారు. ఎవరైనా వెళ్లి చూడవచ్చు.

వి జి. కె. ఆర్, తాడేపల్లిగూడెం

జ్ఞానోదయం అంటూ బుద్ధుడు అమాయకురాలైన భార్యను విడిచి పెట్టాడు. విందు చులాలిగా ఉన్న సీతను ఎవరో ఏదో అన్నారని రాముడు అడవుల పాలు చేశాడు. సత్యం అంటూ హరిశ్చంద్రుడు భార్యను నడివీధిలో అమ్మాడు, వినోదం కోసమని ధర్మరాజా ద్రౌపదిని జూదంలో ఓడాడు. వీరినిరోజా భగవత్స్వరూపులుగా యుగపురుషులుగా ఎందుకు చెప్పుకొంటున్నాం?

బలవత్తరమైన నైతిక విలువలు భూతద్దం లోంచి ప్రస్ఫుటంగా చూపే ప్రయత్నంలో మీరన్న ఆయా భగవత్స్వరూపులలా ప్రవర్తించారంటే గాని— మానవ మాత్రులకవి ఆచరణ యోగ్యాలని చాటి చెప్పలేదే. వారి యీ చర్యల తుదిఫలితాలే మనకి ముఖ్యంగాని మిగిలినవి కావని ..... ఆయా గ్రంథాలే చెప్పక చెప్పకన్నాయి......మీవిద్దరూ, పోనీ వదిలేయండి. ఈమధ్య నో రచయిత్రి రాశారు పేకాటలో భార్య నోడినట్లు! ఇది నమ్మదామా?!

వి. ఎస్. ఆర్, హైదరాబాదు

మావారు అమాయకులు. ప్రతివారూ ఆయనకి అన్యాయం చేయాలనే చూస్తారు. చివరికి నా సోదరుడుకూడా వారినిగురించి నాదగ్గర తేలికగా మాట్లాడుతుంటే సహించలేకుండా ఉన్నాను.

మీవారు అమాయకులు కారు. మెత్తని పులి. మీకే నోర్పు కావాలి. పెళ్లయిన ఆర్నెల్లకే వారి తరపున మీరు యుద్ధ ప్రకటనలు ప్రారంభించారే? గో—ప్ప! చిట్టితల్లి!

ప్రశ్నలు ? జవాబులు

డి హెచ్. ఏ. డి, కాకినాడ

ఆరుద్రగారి గెడ్డాన్నెలా భరిస్తున్నారండీ బాబూ!

సోదరూ, 'రోజూ గీసుకోని మగాడి గెడ్డం
మోజున్న నరసానికొస్తుందా అడ్డం?'

శ్యామల, ఉయ్యూరు

...ఆయన (శరత్) గురించి చదివిన దానిలో ఎక్కడా ఆయనలా రాసినట్టు చదవలేదు. ఎవరైనా చెప్పగా కూడా విన లేదు...

జర్నలిస్టులు ఆధారంలేని రచన సాధారణంగా చేయరు శ్యామలా?!..... శరత్ గురించి తమరు చదివినది చాలా తక్కువ....మళ్లీ ఓసారి చదివి యీ ప్రశ్న తిరగరాస్తే మంచిది!.....మీరు చదవక పోవడం, కనీసం వినకపోవడం నా తప్పా!!

వి. బి హెచ్, హైదరాబాదు

...అనాథ అమ్మాయినియిచ్చి చేయాలని ఉంది...అక్కా! తప్పకుండా ఈ అభాగిని కోర్కె తీర్చుతావు కదూ?

బాగుంది వెర్రిలా, మొండిది మొగుడి పెళ్ళి కెళ్ళిందన్నట్టు. అనాథ అయితేమటుకు పవిత్రగా నిన్ను ఒప్పుకోవద్దా?! పిచ్చి కోర్కెలు పెట్టుకోక ఏ శరణాలయంనుంచైనా పండంటి బాబుని తెచ్చి పెంచుకోండి.

జి. ఎల్. బి, కావలి

మీరు మీవారిని లొంగతీసుకున్నారా?

ఎవరికీ చెప్పకు లక్ష్మిబాయీ. ఇప్పుడే పరిమళా సోమేశ్వర్‌ని దొంగతనంగా చదవడం ప్రారంభించాను!

ఎస్. ఎస్. ఎల్, హైదరాబాదు

...నాకు తెలియక అడుగుతాను. చాలా మంది పురుషులు ప్రతిఫలం ఆశిస్తే గాని సహాయం చేయడానికి ఇష్టపడరెందుకండీ? నిన్ను సోదరునిగా భావిస్తున్నాను అన్నదంటే... తప్పుకుంటారు...

ప్రతిఫలాపేక్ష లేకుండా ఒక్క పురుషులేకాదు, ఎవరూ పని చేయరు. ఇక సోదరునిగా చూస్తానంటే వైదొలగుతారు, ప్రేమిస్తానంటే పరుగెత్తి వస్తారన్న మీ మాట ఎబ్బెట్టుగా ఉంది సోదరీ. సోదరీమణులకు కొదవలేని కుర్రవాగమ్మ ప్రేయసికోసం వెతకవచ్చు. స్నేహితురాలికోసం చూడవచ్చు. తప్పేం లేదే. సోదరప్రేమ ప్రకటించ లేనివాడు వైదొలగి పోవడం— సబబే. హిపాక్రిసీటే కనువర్చలేని అతని నిజాయితీని మెచ్చుకో.

ఎన్. ఏ. కె, కర్నూలు

జెరోమ్. కె. జెరోమ్ రాసిన కథలు చదివారా? ఆ మనిషి స్త్రీయా? పురుషుడా?

ఇప్పుడేమోగాని పూర్వం స్కూల్ ఫైనల్ చదివిన ప్రతి విద్యార్థికీ సుపరిచితుడు జెరోమ్ కె. జెరోమ్. బొమ్మ వ్రేలాడవేయడం, బోటులో ముగ్గురు— యివన్నీ ఒకసారి చదివితే ఎవరూ మరిచిపోరు— తల్చుకు తల్చుకు నవ్వుకోవాలి...అది జెరోమ్ కె. జెరోమ్ ప్రత్యేకత.

స్. ఆర్. పి. జి, బెంగుళూరు

చదువుతున్నరోజుల్లో ఉన్నంత హుషారు ఇప్పుడు బాధ్యతవేత, చింతలవల్ల కోల్పోయాను. ఇక నా జీవితానికి హుషారులేదా?


ఫికర్ ప్రకార్, చింత ఎప్పుడూ ఉండవు. బాధ్యత అంటావా ఎవ్వాళ్ళు తప్పించుకో కలవు?...... హుషారు లేదా? అది పోవడం బాగుండదు. జీవితం మన కిచ్చిన అవకాశాలలోంచి హుషారు పిండు కోవడమే.

ఎస్. ఎస్, సాతవుత్తిరి

... వ్యాలింటే ఆమె హృదయ సౌందర్యంముందు నేను గడ్డిపోచకన్నా హీనమైనట్లు ఫీలవుతున్నాను. పేరు రామలక్ష్మిగారూ, ఈ దావానలాన్ని భరించ లేను. దయచేసి ఒకసలహా నివ్వరూ. మీ సలహా అడిగానని పెన్నెముకలేని హీరోనని మాత్రం చెప్పపోడవకండి. ప్లీజ్.

మిత్రమా! మబ్రహ్మణ్యా!! లే. ధైర్యం చిక్క పట్టు. గుండెపై చేయి నిడుకొని తలవంచి ప్రేయసి చిరుపాదం చూసి... 'నడవండి, నడవండి నామీదంచి నడవండి గడ్డిపోచను నేను' అని కవన మాలపించు. ఫలితానికై ఎదురుచూడు. (ఎలా వుంది మన ఐడియా?!)




HIMALAYAN
FINEST
GOLDEN DUST TEA
HIMALAYAN
FINEST
GOLDEN DUST TEA

వారఫలం

25-7-1969 శుక్రవారం మొదలు 31-7-1969 గురువారం వరకు

మేషం. కొన్ని వ్యవహారాల్లో మీరు ప్రయోజనం లేని శ్రమకు గురి కాగలరు ఆందోళన కలుగుతుంది. వారం మధ్యలో వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

స్త్రీలకు.— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంధి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం: వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది. వారం మధ్యలో, అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మిధునం: వ్యాపారంలో సాటివారితో పోటీ పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాల్లో అనుకోని చికాకులకు గురి కాగలరు.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

కర్కాటకం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

స్త్రీలకు:— సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. సాటివారితో మాట పట్టింపులు తగవు.

సింహం సామాన్యమైన పనులక్కు కూడా విశేషమైన కృషి చేయ్యవలసి వస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి వారం మధ్యలో వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగా ఉంటాయి. వ్యాపారంలో సాటివారితో పోటీ పెరుగుతుంది,

స్త్రీలకు.— దైవకార్యాలు నెరవేరుతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కన్య: వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణించగలదు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

తుల: వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. నూతన విషయాలను తెల్సుకొంటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— సంతోషకరమైన వార్తలను వింటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

వృశ్చికం: వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. నూతన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు. అనుకూల వార్తలను వింటారు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. వ్యాపారంలో శ్రమకు గురి కాగలరు. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు:— అధిక వ్యయం జరుగుతుంది. కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి.

మకరం. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో ఆకస్మికంగా చికాకులకు గురి కాగలరు ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో తిరిగి, అనుకూలమైన మార్పులు వస్తాయి

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. నూతన విషయాలను తెల్సు కొంటారు

కుంభం: అన్ని వ్యవహారాల్లోను గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాల్లో చికాకులు కలుగుతాయి

స్త్రీలకు:— బంధువులకు సహాయం చేస్తారు. దైవకార్యాలు నెరవేరతాయి

మీనం. వృత్తి, వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు, ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

స్త్రీలకు:— సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

—మహేష్

దాహం

వసుంధర



సాయంత్రం అయిదుగంటలు దాటింది. ఎండతీవ్రత చాలావరకూ తగ్గింది. అప్పుడప్పుడే దుకాణాలకు రద్దీ ప్రారంభమవుతోంది. ఆ సమయంలో ఒక మహానగరంలో ఒక బిచ్చగాడికి దాహంవేసింది. ప్రొద్దుట్నుంచీ కాసిన ఎండ ప్రభావమేమో ఆ దాహం అతి త్వరలోనే అధికమై ఆ బిచ్చగాడు మంచినీళ్ళు అడుక్కుందుకు బయల్దేరాడు. ముందు ఒకటిరెండు కుళాయిల దగ్గర ప్రయత్నించాడు. కానీ కుళాయిలు కట్టేసి ఉన్నాయి. ఆ నగరంలో కుళాయిలు సాయంకాలం ఏడుదాటితే గానీ వదలరన్న సంగతి ఆ బిచ్చగాడికి గుర్తుకొచ్చి ఏ దుకాణంలోనైనా మంచినీళ్ళు కనిపిస్తే అడగాలనే ఉద్దేశ్యంతో బయల్దేరాడు. అలా బయల్దేరిన అతను రంగయ్య సెట్టి దుకాణం రాగానే ఆగి ఆశగా రంగయ్యవంక చూశాడు.

రంగయ్య గల్లాపెట్టిలోంచి కత్తిబయటకు తీశాడు. పక్కనే ఉన్న నిమ్మకాయను రెండుగా కోశాడు. ఇవతలి పక్కగా ఒక కూజా దానిమీద బోర్లించి ఒకగాజుగ్లాసూ ఉన్నాయి. కూజాను ఒంచి గ్లాసులో నీళ్ళు పోసుకున్నాడు రంగయ్య. ఎదురుగా ఉన్న ఉప్పు తొట్టిలోంచి కొద్దిగా ఉప్పుతీసి గ్లాసులోవేసి ఓ చెంచాతో రెండు నిముషాలసేపు కలియబెట్టి — 'దీం తస్సాదియ్యా —ఏం దాహమేస్తోందీ !'అని నెమ్మదిగా గొణుక్కుంటూ గ్లాసుని నోటిదాకా పోనిచ్చాడు.

'దాహంతో ప్రాణం పోతోంది. కాసిని మంచినీళ్ళిప్పించు నాయనా — నీకు పుణ్యముంటుంది !'

రంగయ్య ఒక్కనిముషం ఆగి నిమ్మకాయ నీళ్ళు గటగటా తాగేశాడు. అతను తాగుతున్నంతసేపూ బిచ్చగాడు ఆశగా అతని వంకే చూస్తున్నాడు కన్నార్పకుండా.

తాగడం అయిపోయినాక రంగయ్య — 'మాయాసంసారము తమ్ముడూ!' అంటూ నెమ్మదిగా సినిమాపాట పాడడం మొదలుపెట్టాడు. తనకు ఎదురుగా ఒక క్షుధార్తుడు కొన్నిగజాల దూరంలో తనవంకే చూస్తున్నాడని అతను గ్రహించినట్లు లేదు.

'కాసిని మంచినీళ్ళిప్పించు బాబూ — పుణ్యముంటుంది !'

ఈసారి రంగయ్యలో చలనం కదిలింది. 'చాల్చాల్లే మునిసిపాలిటీవాళ్ళ కుళాయిలు బోలెడుండగా మంచినీళ్ళకి నా కొట్టే కావలసి వచ్చిందా నాయనా— వెళ్ళు వెళ్ళు!' అన్నాడు.

మునిసిపాలిటీ కుళాయిల పరిస్థితిని గురించి బిచ్చగాడు రంగయ్యకు వివరించే ప్రయత్నం చేయబోయి — అంతలో రంగయ్యకు ఏదో బేరం తగలడం చూసి ఊరుకున్నాడు.

'హార్లిక్సుందా సెట్టిగారూ!'

రంగయ్య తమాషాగా నవ్వి—'మీకు తెలియందేముందండీ—స్టాకు రావడం లేదు—' అన్నాడు.

'అది సరేలేవయ్యా— ఎంతకిస్తున్నావో చెప్పు అన్నాడవతలవ్యక్తి.

'ఏమిటో ఎదవ యాపారం పంతులుగారూ—ముగమాటానికి పోతే నట్టమొస్తుంది. నిక్కచ్చిగా ఉంటే మాటొస్తుంది. ఇంతకంటే కాసింతపాలం కొను

క్కని వ్యవసాయం చేస్తే బాగుంటుందని పిస్తుందండీ!' అన్నాడు రంగయ్య.

పంతులుగారు చిరాగ్గా ముఖం పెట్టాడు— 'సరే—ఇదెప్పుడూ పాడేపాటే గానీ—ఎంత కిచ్చేదీ చెప్పు. అవతల జబ్బు మనిషింట్లో ఉన్నాక ఎంతయితే మాత్రం కొనక తప్పుతుంది!'

రంగయ్య ముఖం గంభీరంగా మారి పోయింది. 'నాకు బ్లాకు మార్కెటంటే పరమ అసయ్యం పంతులుగారూ—అయితే ఏం లాభం? ఊళ్లో జబ్బుమనుషులున్నారు—మరో దారిలేదు—అని మీలాంటోళ్లకోసమని బ్లాకులో నేను హార్లిక్సు సీసాలు కొని అమ్ముతున్నాను కొన్న ధరకే ఇవ్వలేను కాబట్టి ఓపావలా లాభమేసుకుంటున్నాను. కానీ మీకేమో కంట్రోలు ధరకే దొరకాలని ఉంటుంది. దానికీ దీనికీ లంగరందదు. మయాన బ్లాకుమార్కెటు చేస్తున్నానని నాకు పేరుస్తోంది' అంటూ నిట్టూర్చాడు.

పంతులుగారు రంగయ్య ఇంకా మాట్లాడేలా ఉన్నారని గ్రహించి మౌనం వహించాడు. 'ఏడు రూపాయలకు కొన్నా బాబూ ఆపైన మీ చిత్తం. అయినా ఒక సీసాయే ఉండేవొచ్చని నా అనుమానం— చూస్తుండండి' అంటూ లేవబోయాడు రంగయ్య.

సీసాధర ఏడుంబావలా అని పంతులుగారికి అర్థమయింది తను బేరానికి దిగితే సెట్టి లోపలికివెళ్లిచూసి—లేదంటాడు. ఒకసారి లేదన్నాడంటే తర్వాత తను ఎంతిస్తానన్నా—సరుకులేదన్న తన మాటమీదనే నిలబడతాడు అవసరం తనది—తప్పుతుందా?

'మరీ అన్యాయంగా ఉంది సెట్టీ— హార్లిక్సు సీసా ఏడుంపావలా ఏమిటి?' అంటూ పదిరూపాయల నోటందించాడు.

'అదే నాకూ బాధగా ఉంది బాబూ— ఎక్కడి పావలెక్కువ ఆరు—ఎక్కడ ఏడు రూపాయలు? కొనడానికి నాకే ఉసూరుమంది. అయితే ఏం చేస్తాం బాబూ అవసరం మంది—లేదంటే అదీ దొరకదు' అంటూ నోటు గల్లాపెట్టెలోపడేసి రెండు ముప్పావలా పంతులుగారికి ఇచ్చాడు. 'నా మతి మండ—డబ్బు తీసేసుకుంటున్నానుగానీ—ఇంతకీ సీసా ఉందో లేదో చూశానేకాదు!' అంటూ లేచి లోపలికివెళ్లి మరో నిముషంలోనే ఓ సీసాతో వచ్చాడు— 'అదృష్టమంటే మీదంటే పంతులుగారూ—సరిగ్గా ఒకే క్క సీసా ఉంది!' అంటూ ఆయనకాసీసా అందించాడు. తీసుకుని ఆయన వెళ్లిపోయాడు.

'కుళాయిలు కట్టేశారు చాలా దాహంగా ఉంది—కొంచెం మంచి నీళ్లిప్పించండి బాబూ పుణ్యముంటుంది!' మళ్లీ బిచ్చగాడి కంఠస్వరం.

రంగయ్య చిరాగ్గా బిచ్చగాడివంక చూశాడు గ్లాసు నందుకుని దాంట్లోకి కూజాలోంచి నీళ్లు ఒంపుకున్నాడు. ఆశగా చూస్తూన్న బిచ్చగాడికేసి మళ్లీచూసి గటగటా మంచినీళ్లు తాగేశాడు

'బాబూ—దాహం!'

'ఛా— పొమ్మంటూంటే నీక్కాదూ— మరెక్కడైనా అడుగు—' అంటూ విసిరాడు రంగయ్య రంగయ్య కంఠంలోని దృఢత్వాన్ని గ్రహించిన బిచ్చగాడు నిరాశగా ముందడుగు వేశాడు.

కానీ రంగయ్యకు ఇంకా దాహం తీరినట్లులేదు. మరోగ్లాసు మంచినీళ్లు తాగి 'అబ్బా— ఎంత దాహంగా ఉందీ!' అనుకున్నాడు. అతని దాహం ఇంకా తీరలేదు పొట్ట బరువెక్కింది. మంచినీళ్లతో బరువెక్కిన కడుపువంక, నీళ్ల కూజావంక నిస్సహాయంగా చూశాడు రంగయ్య. దాహం తీరని రంగయ్య!

అయినా రంగయ్యదాహం మంచినీళ్లలో ఎలా తీరుతుంది? ఇంకా ప్రజోపకారార్థం కొన్న బోలెడు హార్లిక్సు సీసాలు లోపల మూలుగుతున్నాయి. అవన్నీ ఏడుంబావలాచేసి అమ్మగలడా? ఈలోగా అన్నీ కంట్రోలు ధరకు దొరగడం ప్రారంభిస్తే ఎంత నష్టం? రావలసిన లాభంకంటే తక్కువ లాభం రావడం—రంగయ్య దృష్టిలో నష్టానికి అర్థం! తన దాహం తీరేది కాదని తెలియని రంగయ్య ప్రయత్నించి మరో గ్లాసు మంచినీళ్లు త్రాగాడు

బిచ్చగాడు నిరాశగా ముందుకు నడుచుకుంటూ పోతున్నాడు— అతని దాహం— ధరల్లా పెరిగిపోతోంది. ఆ బాధకు అతను తట్టుకోలేక పోతున్నాడు. అయినా తనబాధ తీర్చేవారు దొరక్కపోతారా అనే ఆశ అతన్ని ముందుకు నడిపిస్తోంది. పెద్ద ఇళ్లున్న వీధికంటే చిన్న ఇళ్లున్న వీధి మంచిదనే ఉద్దేశ్యంతో బిచ్చగాడు కనిపించిన మరో వీధిలోకి మళ్లాడు. తలుపులు బార్లా తెరిచివున్న ఓ ఇంటిముందు ఆగి— 'అమ్మా — దాహం తల్లీ!' అన్నాడు.

అనుకోకుండా లోపల్నుంచి సమాధానం వచ్చింది. మాటకొంచెం ముద్దగా ఉంది. 'రా తమ్ముడూ — దాహం తీర్చుకొందువు గాని!' అంది ఓ మగకంఠం

బిచ్చగాడు ఒక్క క్షణం [illegible] యించాడు. లోపల ఉన్నయన ఎవరను కున్నాడో ఏమో — లేకుంటే తమ్ముడూ అని ఎందుకు పిలుస్తాడు? తీరా లోపలికి వెడితే నాలుగు [illegible] గెంటేస్తాడేమో! అనిపి[illegible]తోంది. లోపలికి వెడితే [illegible] రేమో కూడాను!

ఇన్ని ఆలోచనల[illegible] బిచ్చగాడి విపరీతమైన దాహం [illegible]యించింది. ఏమయితే అయిందని ధైర్యంగా [illegible] శించాడు.

ముందుగది [illegible]గా ఉంది [illegible] ఎవరూ లేరు. లోపలికి వెళ్లడానికి తలుపు తీసి ఉంది. నెమ్మదినెమ్మదిగా అడుగులు వేస్తూ బిచ్చగాడు ఆ గదిలో ప్రవేశించాడు.

'వస్తున్నావా—రా తమ్ముడూ— [illegible] ఇదిగో — అందుకో తీర్థం!' అంటూ ముద్దగా మాట్లాడుతున్న ఓ యువకుడు నవ్వుతూ బిచ్చగాడికి ఓ చిన్న అందమైన నగిషీలు చెక్కి ఉన్న గ్లాసు అందించాడు. గదిలో మరెవ్వరూ లేరుగానీ — ఆ గదిని ఆనుకుని మరోచిన్న గది ఉంది.

బిచ్చగాడు తెల్లబోయాడు అతని చేతులు వణికాయి. ఎదురుగా ఉన్న యువకుడు బాగా తాగి ఉన్నాడని అతను గ్రహించాడు. తన చేతిలోఉన్న గ్లాసులోని ద్రవం ఏదో హైక్లాసు సారా అయి ఉంటుందని ఊహించాడతను.

'తాగు తమ్ముడూ—దాహంగా ఉంది న్నావుగా —తాగుమరీ!' ఆ యువకుడు బిచ్చగాణ్ణి సమీపించాడు. బిచ్చగాడు కంగారుగా వణుకుతూ — 'నాకు మంచినీళ్ల కావాలిబాబూ — దీంతో నా దాహం తీరదు. నాకు మంచినీళ్లు కావాలి!' అన్నాడు.

గది అదిరపోయేలా నవ్వాడా యువకుడు—'ఛ ఛ—మంచినీళ్లా? అవి మనుషులకోసం కాదు — గడ్డితినే పశువులు తాగడంకోసం పుట్టాయి—అసల్తైన మని

ఆంధ్రసచిత్రవారపత్రిక

1969 దీపావళి కథల పోటీ

ఎప్పటివలెనే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించబోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము రచయితలందరూ ఎప్పటి వలెనే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 2300

రెండవ బహుమతి రు. 1600

మూడవ బహుమతి రు. 550

నిబంధనలు

1 కథలు ఇంతకుముందు అచ్చుఅవని స్వంత రచనలై ఉండాలి ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనేనని, దేనికీ అనువాదంకానీ, అనుసరణకానీ కాదని హామీగా రాసి పంపాలి ఈ హామీలు వేరేకాగితం మీద కాకుండా కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి

2 కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి

3 వ్రాతప్రతి మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయితపేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి రచనలు 12 అరఠావు (ఎక్సర్సైజు నోట్‌బుక్ పేజీకి రెండు రెట్లు) పేజీలకు మించరాదు

4 కవరుమీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టిస్ట్రీట్, మద్రాసు—1'కి పంపాలి.

5 పోటీ గడువు తేదీ 30—8—69 ఆ తర్వాత మా కార్యాలయానికి చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6 పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా' వెలువడే 7—11—69 తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.

7 పోటీ తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకుడిదే ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యం కాదు పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలా బిళ్ళలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంపనవసరం లేదు.

9 పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.

దాహం

పిక్కి—ఇదే కావాలి. గాలి లేకుండా బ్రతకొచ్చు కానీ ఇది లేకపోతే బ్రతకలేము. ఒక్కసారి తాగావంటే నువ్వా వదలవు— అబ్బా — అబ్దుల్—దాహం — దాహం!' అంటూ కేకలేశాడా యువకుడు.

ఆ గదిని అనుకున్న మరో చిన్న గది లోంచి అబ్దుల్ వచ్చాడు వస్తూనే అక్కడే ఉన్న చిన్న అలమారా తెరిచి ఓ పెద్ద సీసాను బయటకు తీశాడు.

బిచ్చగాడు గదంతా పరిశీలనగా చూస్తున్నాడు ఎక్కడైనా మంచినీళ్ళు కూజా గానీ ఏదైనా కనిపిస్తుం దేమోనని ఇంతలోనే అబ్దుల్ హుంకరించాడు 'ఏమిట్రా — ఆ దొంగచూపులూ — బద్మాష్— త్వరగా బయటికి పో!'

ఆ వాతావరణానికి ఇందాక ట్నుంచి బెదురుగా ఉన్న బిచ్చగాడు తన చేతిలోని గ్లాసును క్రిందపెట్టేసి — తొందరగా బయటకు వెళ్ళిపోయాడు.

'తొందరగా —దాహం అబ్దుల్!'

అబ్దుల్ అందించిన ద్రవాన్ని ఆనందంగా ఆస్వాదిస్తున్నాడా యువకుడు ఆ ద్రవం తన దాహాన్ని పెంచడం తప్పితే తగ్గించ లేదని అతనికి తెలియదు తెలుసుకోలేడు కూడా. వ్యసనమే ఒక దాహం. ఆ దాహం తీర్చేది మృత్యువుమాత్రమే తను తన దురలవాటుని వదిలితేగానీ తనదాహం తీర దని ఆ యువకుడికి తెలియదు తెలియ జెప్పినా వినిపించుకోడు

బిచ్చగాడికి దాహం దంచేస్తోంది. ప్రాణం పోతుందేమో ననిపిస్తోంది కూడా. అడుగు తీసి అడుగువేయడం కష్టంగా వుంది. అయినా అలాగే ముందడుగువేస్తూ హేయమైన వృత్తికి దిగిన తన్ను తనే నిందించుకున్నాడు

ఆఖరికి ఒక యింటిముందుకు వచ్చేసరికి ఇక ముందుకు ఒక్క అడుగు కూడా వేయాలేననిపించింది బిచ్చగాడికి. నెమ్మదిగా ఆ ఇంటి అరుగుమీద కూర్చుని అలా అలా గోడవారకూ జరిగి సొమ్మసిల్లినట్లుగా పడిపోయాడు.

ప్రాణంపోయేలా ఉందిగానీ ప్రాణంపోదు. ఆ బాధ అనుభవించేవాడికేగానీ అర్థం కాదు.

'ష్! ఇంకా చీకటైనా పడిందో లేదో— ఏమిటది!' ఎవరో స్త్రీ మధురంగా మందలిస్తోంది బిచ్చగాడు ఉలిక్కిపడ్డాడు.

ఆ మాటలు నెమ్మదిగా గోడకవతలగా ఇంటిలోపల్నుంచి వస్తున్నాయి.

'దాహం— రాణీ — దాహం!' పురుష కంఠం.

వాలాగే లోపలకూడా ఎవడో దాహంలో బాధపడుతున్నాడు కాబోలు అనుకొన్నాడు

'ఇవిగో మంచినీళ్లు!' స్త్రీ కంఠం కొంటెగా నవ్వుతోంది

'చాల్లె సరసానికి సంతోషించాం— దాహమంటే వెధవ మంచినీళ్లిస్తావా?'

ఏ మంచినీళ్ల కోసమైతే తన ప్రాణం హాతహాలాడిపోతోందో వాటిని వెధవ ంంచినీళ్లని తిట్టినందుకు బిచ్చగాడికి పమూ, బాధా, అసూయా కలిగింది పం వాటిని తిట్టినందుకు, బాధ అవి నకు లేవే అనీ, అసూయ తనకు అవసర ట్టనవి వాడికి వద్దన్నా దొరుకుతున్నాయి వా అనీ ఇంతకీ ఆయన తాగేదేమిటో? రాయా?

'మరి!' కొంటెగా నవ్వుతోంది ఆమె

'అధరామృతం కావాలి!'

కిలకిలమని నవ్వు వినిపించింది. కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

'రాణీ— రాణీ — నువ్వు చాలా అందగత్తెవు!'

'అది ఈవేళ గ్రహించేరా ?'

'లేదు — ఎప్పుడో గ్రహించేను!'

'ఏం లాభం — పెళ్లయిన వాళ్లకు లైసెన్సు లేదు మరి నే వస్తాను!'

సంభాషణ బిచ్చగాడికి అంత స్పష్టంగా వినిపించడంలేదు. అందులోనూ అతనికి ఆభాష అట్టే అర్థంకాక వినడానికి అంత ఉత్సాహ కరంగానూ లేదు ఇప్పుడిప్పుడే అతనికి దాహంతోపాటు ఆకలి కూడా ప్రారంభమయింది.

'ఎందుకు వెళ్లిపోవడంరాణీ! మా ఆవిడ వచ్చేదాకా మనమిక్కడే హాయిగా గడపవచ్చు—'

'తర్వాతయినా వెళ్లిపోవలసిన దాన్నేగా?'

'అప్పుడు నేనే నీ దగ్గరకు వస్తాను!'

'ఎంతమంచి వారండీ మీరు —'

'అది మంచితనంకాదు రాణీ—స్వార్థం! మండుటెండలో విపరీతమైన దాహంతో బాధపడుతూ తిరిగే నాపాలిటి చల్లని జలాశయానివి నువ్వు. అందుకే—'

'కవిత్వం చాలా బాగుంది చాలా కష్ట

వడిపోయారు. ఈ మంచినీళ్ళు తాగండి ముందుమీరు -' ఆకంఠంలో చిలిపితనం.

'నీకు తెలియదా రాణీ — వాటితో నా దాహం తీరదని !'

ఇంక బిచ్చగాడిలో ఓర్పు నశించింది. మంచినీళ్ల పేరెత్తితే అతనికి వెర్రెత్తిపోతోంది దాహంతో ప్రాణంపోయేలా ఉందేమో — ఏమనుకుంటే అయిందని లేచి నుంచుని శక్తినంతా కూడగట్టుకుని— 'నా దాహం తీరుస్తుంది అవి నాకివ్వండి దాహంలో చస్తున్నాను.' అని అరిచాడు

లోపల సంభాషణ ఆగిపోయింది ఏవో చిన్న చిన్న గుసగుసలు వినిపించిన అనంతరం కొన్నిక్షణాలు నిశ్శబ్దం తర్వాత వీధితలుపు తెరుచుకుని ఓ ముప్పైయిదేళ్ల వ్యక్తి అరుగుమీదకువచ్చి — 'ఎవరది ?' అన్నాడు

'దాహంతో ప్రాణంపోతోంది కాసిని మంచినీళ్లిప్పించి పుణ్యం కట్టుకో బాబూ !' అన్నాడు బిచ్చగాడు. దీనంగా వాడికి ఏడుపుకూడా వస్తోంది.

ఆ వ్యక్తి బిచ్చగాడివంక అసహ్యంగా చూశాడు. క్షణంలోనే ఆ అసహ్యం కోపంగా మారిపోయింది. 'మా యింటి అరుగుమీద నీకేంపనిరా దొంగరాస్కెల్ ! మంచినీళ్ల వంకపెట్టి లోపల మాటలూ అవీ వింటూ సమయంచూసి లోపలికొచ్చి అందినదెగరేసుకు పోదామనేగా నీ ఎత్తు — వెళ్ళు వెళ్ళు !' అన్నాడు.

అయినా బిచ్చగాడి ఆశ తీరక—'దాహం బాబయ్యా!' అన్నాడు మరోసారి.

'ముష్టి వెధవలకూడా దాహమే !' తన భాషలో దాహాన్ని తల్చుకుంటూ అతను బిచ్చగాణ్ణి బయటకు గెంటేసి లోపలకువెళ్లి తలుపేసుకున్నాడు.

అవునుమరి — అతనిదాహం అతనిది — తీరేదాకా స్థిమితం ఉండదు తీరేక తీరినట్లుండదు పరస్త్రీ వాంఛాదాహం. ఒక స్త్రీతో తనివి తీరుతుందా ? అంతు తెలియని తన దాహాన్నే తీర్చుకోలేని అతను ఇతరుల దాహాన్నిమాత్రం ఏం తీర్చగలడు ?

బిచ్చగాడిని నీరసమూ, నిస్త్రాణా ఆవహించాయి. ఇంత విశాలమైన నగరంలో తనకు గుక్కెడు నీళ్లు కరువయ్యాయి. గాలీ, నీరూ, భూమీ, భగవంతుడు మనుషులందరికీ సమంగా పంచుకోమని ఇచ్చాడు. భూమి ఎలాగా కొందరికే దక్కింది. ఇప్పుడు నీరుకూడా అందరికీ లేదు. (ఈ విషయం నగరాలకు మాత్రమే వర్తిస్తుందేమో) ఇంకా కొన్నాళ్ళుపోతే గాలికికూడా ముష్టెత్తవలసి వస్తుందేమో ?

బిచ్చగాడు రెండిళ్లు నడిచి — ఓ ఇంటి గుమ్మందగ్గర చతికిల బడిపోయి ఆఖరి ప్రయత్నంగా — 'అమ్మా ! అన్నపూర్ణమ్మ తల్లీ ! కాసిని మంచినీళ్లు ఇప్పించు — దాహంతో ప్రాణం పోతోంది !' అంటూ అరిచేడు.

అది ఆక్రందన !

మింగడానికి వచ్చే పామును చూసినప్పుడు పక్షి పిల్లలుచేసే ఆక్రందన ! చుట్టూ మంటలు అలముకుంటే వెలికి రాలేక నిస్సహాయుడై మనిషి చేసే ఆక్రందన ! !

గుక్కెడు మంచినీళ్లకోసం ఒక బిచ్చగాడి ఆక్రందన ! ! !

సొమ్మసిలి కూర్చుండిపోయిన బిచ్చగాడి కళ్లు గుమ్మంలోకి నిశితంగా చూస్తూనే ఉన్నాయి. మనస్సు ఆశపెడుతూనే ఉంది.

చేతిలో మంచినీటి చెంబుతో ప్రత్యక్షమైన స్త్రీనిచూసి—'వెయ్యేళ్లు సుఖంగా జీవించు తల్లీ !' అంటూ మనస్సులోనే దీవించి దోసిలిపట్టాడు అతను.

దోసిలిలో పడుతున్నవి మంచినీళ్లు కాదు - అమృతబిందువులు — ఆత్రంగా ఆ చెంబెడు మంచినీళ్లూ తాగి—'పోతున్న ప్రాణాన్ని ఆపేవు తల్లీ ! నీ ఇంట కలకాలం సిరి నిలుస్తుంది !' అన్నాడు.


ఆవిడ జాలిగా అతనివంక చూసి — 'మంచి నీళ్లకేముంది నాయనా — పాపం, బాగా ఆకలితో ఉన్నట్లున్నావు కొద్దిగా చద్ది ఉంది పట్టుకుపోయి తిందువుగాని !' అంటూ లోపలికి వెళ్లింది

ఆ క్షణంలో బిచ్చగాడి ఆనందం వర్ణనాతీతం. తనకోసం భగవంతుడుపంపించిన దేవతాస్త్రీ అయుండాలి ఆమె ? లేకపోతే తనకోసం ఆమాత్రం దయను దాచి ఉంచిన మనిషి ప్రపంచంలో ఉంటుందా?

చిన్న ఆకులో ఆవిడ ఇచ్చిన అన్నం తీసుకుని హుషారుగా ముందుకి నడుస్తున్నాడు బిచ్చగాడు. కొంతదూరం నడిచి ఒక వీధి కుళాయిదగ్గర ఆగాడు. కుళాయి వస్తోంది. అన్నం తినేసి-మంచినీళ్లు తాగి — ఆ కుళాయిపక్కనే ఓ గుడ్డ పరుచుకుని పడుకున్నాడు బిచ్చగాడు అతనికి కొద్దిసేపట్లోనే నిద్రపట్టేసింది.

అతని ఆకలి తీరింది. అతని దాహం తీరింది. ఇప్పుడతనికి తృప్తిగా ఉంది.

కానీ మంచినీళ్లతో దాహం తీరక, తృప్తి లేక, నిద్రరాక అవస్థపడుతున్న అనేక మందితో ఆరోజు బిచ్చగాడికి పరిచయమైన వ్యక్తులు ముగ్గురున్నారు. ●



1234567...

ఒక్క వారంలో నా ముఖం ఎంతో స్వచ్ఛంగా, మృదువుగా అందంగా అయింది!

పాండ్స్ 7-రోజుల చారుచర్య

అమోఘంగా మార్చింది నా ఛాయను

వాడిపోయి కాంతిహీనంగావుండే నా ముఖాన్ని చూసుకొని నాకే విసుపుట్టింది ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభంలేదనిపించింది-సునీల్ నాకిచ్చే విందుకు 8 రోజులే గడువు నిరాశచేసుకున్నాను! ఇంతలో పాండ్స్ 7 రోజుల చారుచర్య ఎంత అమోఘంగా పనిచేసిందో అనిసునీత చెప్తూనవచ్చే విషయం అకస్మాత్తుగా జ్ఞాపకంవచ్చింది— ఒకసారి వాడిచూద్దామని నిశ్చయించుకున్నాను.


చారుచర్య-దాని ప్రత్యేకత

ఒక్క వారంరోజులపాటు, ప్రతిరోజూ రాత్రిపూట నా ముఖానికి పాండ్స్ కోల్డ్‌క్రీమ్ రెండేసిసార్లు పట్టించాను, మొదటిసారి ముఖంమీద చేరిన దుమ్ము మేక్-అప్‌ను తొలగించడానికి పట్టించాను.

[illegible]
సౌందర్య రహస్యము

నా ముఖానికి రెండవసారి క్రీము పట్టించాను—ఇదే సౌందర్యానికి కీలకం! క్రీము చర్మములోకి లోతుగా ప్రవేశించి సబ్బు నీరు శుభ్రపరచలేని నురుగుపడివున్న మురికిని తొలగిస్తుంది. నా ముఖంలాగే మీది అతి సుకుమారంగా మృదువుగా జీవకళ ఉట్టిపడుతూవుంటుంది!

నిజంగా ఆనాటి ప్రత్యేకవిందు దిగ్విజయమే నా ముఖం అంతకళగా అందంగా ఎప్పుడూ చూడలేదని సునీల్ అంది! నాటినుంచి ప్రతీరోజూ రాత్రిపూట పాండ్స్ కోల్డ్‌క్రీమ్ రెండుసార్లు రాసుకోటం అభ్యాసం చేసుకున్నాను. ఈ రాత్రే మొదలు పెట్టండి పాండ్స్ 7-రోజుల చారుచర్య మీ ముఖం కూడా మృదువుగా అందంగా అవుతుంది!





పాండ్స్ కోల్డ్‌క్రీమ్ ప్రపంచంలో బాగా అమ్ముడుపోతున్న చర్మాన్ని శుభ్రపరచే క్రీమ్

P-4953

చెస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమిత బాధ్యత, అమెరికా యు.ఎస్.ఏ. లో స్థాపితము)

వెలుగు నీడలు



యలమంచిలి ఝాన్సీలక్ష్మి

సీరియల్

జరిగిన కథ

రాజశేఖరంగారి ఒకే ఒక కూతురు అనుపమ. ఆయన మిత్రుని కుమారుడైన మధుని ఆదుకుని తన ఇంటిలోనే ఆశ్రయమిస్తారు. మధుమూర్తి అనుపమ అభిమానాన్ని పొందుతాడు. రాధా మాధవీయం నృత్యనాటికతో వారి అనుబంధం మరింత దృఢం అవుతుంది. విదేశాలనించి వచ్చిన అనుపమ బావ విజయకుమార్ వీరి అభిమానాన్ని సహించలేడు. మద్రాసు వెళ్ళిన మధుమూర్తి గురించి విజయకుమార్ చెప్పిన సంగతి విన్న అనుపమ ఊహలు తలక్రిందులవుతాయి. మధుమూర్తికి శశికళకి గల సంబంధం ఆమె ఊహించలేకపోతుంది. అపార్థం చేసుకుంటుంది. విజయకుమార్ ప్రవర్తన రాజశేఖరంగారికికూడా అసహ్యం కలిగిస్తోంది.

14

మధుమూర్తిని దూరంగా నెట్టివేసి మరో మూర్ఖుణ్ణి ఆహ్వానించినట్లు తోస్తోంది అనుపమకు.

కానీ ఆ విచిత్ర ప్రణయగాథ అలా మధ్యలో నిశ్శబ్దంలో విలీనమై పోయినా హృదయాంతరాళాల్లో అంత అగ్నిగుండం రాజుకోవడం లేదు. జీవిత సహచరుడిగా ఎంచుకున్న ఓ వ్యక్తి మరీ యింత హృదయంలేని వాడని వూహించలేదామె.

అతనితో తన జీవితం నరకమవుతుందేమో అన్నదే హృదయాన్ని అన్నిటి కన్నా ఎక్కువగా బాధించసాగింది.

ఆమెనిర్ణయం ఆమెనే జ్వాలలాగ వ్యథపెట్ట సాగింది.

ఏ వ్యక్తిపైన అపరాధాన్ని వూహించి. నిజమని విశ్వసించి, అనురాగామృతాన్ని అందించగలనని నమ్మించి, ఒక్కసారిగా పాతాళలోకానికి అణగద్రోసిందో అతడు ఏనాడూ యీ విధంగా హృదయాన్ని వ్యథతో నలిపివేయలేదు.

అంత విషాన్ని నిశ్శబ్దంగానే స్వీకరించి దూరంగా వెళ్ళిపోయాడు.

ఆ అనురాగమూర్తి మనసున మెదలగానే ఆమె అధరాలు కంపించిపోయాయి. కనులలో అశ్రుబిందువులు నిండుకొచ్చాయి.

కానీ 'శశికళ' గుర్తుకురాగానే చింతాగ్రస్తమైన ఆమె హృదయం మళ్ళీ యీర్ష్యాద్వేషాలతో మండిపోసాగింది.

ఆ స్మృతులతో ఆమెలోని రసబిందువు శుష్కించిపోయింది. అభిమానం మేల్కొంది ఆకస్మికంగా.

అదే ఆలోచనలతో, తర్క వితర్కాలతో సతమతమౌతూండగా నౌకరు 'అమ్మగారూ! మధుమూర్తి బాబుగారు వచ్చారు! రమ్మంటారేమో లోపలికి, అని అడగమన్నారు' అన్నాడు.

అనుపమ విస్తుపోయింది.

ఎవరిరాకతో తన మనస్సున ఆనందం వెన్నెలలా నిండిపోయేదో అతడు రాగానే ఆ మనస్సే ప్రతుళ్ళిపడింది. హృదయ కుహరంలోకి అనుజ్ఞలేకుండానే నడిచిరాగల వ్యక్తి ఈరోజున 'రావచ్చునా?' అని ప్రశ్నించాడనగానే ఆమె కళ్ళనిండుగా అశ్రుబిందువులు మెరిశాయి.

మౌనంగా తలవూపింది.

కానీ తలెత్తి చూడాలంటేనే ఏదో భావం నిలువెల్లా జరజరా ప్రాకిపోతోంది.

మధుమూర్తి సోఫాలో కూర్చున్నాడు వచ్చి.

ఆత్మీయత ధ్వనించే స్వరంతో అన్నాడు.

'నావలన ఎంతో బాధకలిగిందనుకుంటాను అనూ! కానీ పరిస్థితుల్ని జయించడానికి కొంత వ్యవధి కావలసి వస్తుంది ఏమనిషికైనా'—

అని ఆమెవంకే చూస్తూ ఓ క్షణం ఆగిపోయాడు.

తలెత్తిందామె అప్రయత్నంగానే—

ఇరువురి కన్నుల్లోనూ కన్నీరు కెరటాలై పరుగులు పెడుతోంది.

విస్మితులయ్యారు ఎవరికి వారే. అనురాగ బంధంతో పెనవేసుకుపోయిన ఆ హృదయాల్లోని వేదన కంతులేకుండా పోయింది.

కన్నెత్తి కూడా చూడగూడదనుకున్న ఆమె కఠిన నిశ్చయం, మధురాను రాగ

బంధం అడ్డుపడగానే ఎగిరిపోయింది.

కంఠం సవరించుకున్నాడతడు. అల్లు తూన్న 'స్వెట్టరు' వంకే చూస్తూండి పోయిందామె

కానీ చెవులుమాత్రం ఆతని నోటి నుంచి వచ్చే మధుధ్వనికోసం నిరీక్షించు తున్నాయి

అనురాగంతో నిండిపోయిందామె హృదయం.

'నేను రావడం నీకు యిష్టంవుండదు. కాని తప్పలేదు......నీ జీవిత నౌక సుఖంగా ఒడ్డుచేరాలని వాంఛించేవాళ్ళలో నేనొకణ్ణి, స్నేహితుడిగా నిన్ను ఆజ్ఞాపించలేకపోయినా, ఒకనాటి మాష్టారిగా సలహా యివ్వాలను కుంటున్నాను'—

విస్మయిత నిండుకొచ్చిందామె నేత్రాల్లో అతడు చెప్పుతున్నది దేనికి వుపోద్ఘాతమో అర్థం గావటంలేదు. అయినప్పటికి మౌనంగానే వుండిపోయింది.

'జరిగిందేదో జరిగిపోయింది. ఎవరివలన మనం దూరమైపోవలసి వచ్చిందో ఆవ్యక్తికి నేనే నాడూ ఏ అపకారమూ చేయలేదు. కానీ నా ఆశల్ని మసిజేయడంతోనే శాంతించ లేనావ్యక్తి. నిన్ను కూడా అంధకారంలోకి తోసివేయాలని నిశ్చయించుకున్నాడు.

అందుకే మనస్సును శాంతింపజేయలేక పోయారీ మాష్టారు. మీ వివాహాన్ని పది రోజులు వాయిదా వేయగలవా?'

తలెత్తిందామె వెంటనే. పెదవులు కదల్చక తప్పలేదు.

'ఎందుకూ?!'

'అందువలవ నాకొరిగేదేమీ లేదు. నిశుబంకోరే అడుగుతున్నాను, ఇందులో నువ్వొకతివు చిక్కుకున్నది—మరొకరుకూడా వుండిపోయారు. ఒక్కసారే యిద్దరి జీవితాలు నాశనమౌతున్నాయనే యింతగా బాధపడడం!' అన్నాడతడు.

ఆమెకంతా అయోమయంగా వుంది.

'నాన్నగారి నడగాలి! నష్టపోతున్నది— నాశనమౌతున్నదీ మీరుగారు. అయినప్పు డెందుకింత బాధ మీకు?' అన్నదామె. కటువుగా.

'విడమరిచి చెప్పగలను. కానీ అందు వలన మహానష్టం తప్ప మరేమీ మిగలదు. ఆవేశంతో వున్న నిజాన్ని నిరూపించబోయి వురికంబానికి ఎక్కినట్లవుతుంది. నిన్ను నేనేనాడూ ఏదీ కోరలేదు—నాన్నగారు నీమాట కాదనరు—ఒక్క పది రోజులు వాయిదా వేయించు ముహూర్తాన్ని—'

మాష్టారి యీ ఒక్కమాటా మన్నించు.

నిరాకరించ లేకపోయిందామె. మౌనంగా తలవూపింది. సందేహాలు మనస్సున పొరాడు తున్నా, నిజాన్ని తెలుసుకోవాలన్న ఆతురత కొండలా పెరిగిపోతున్నా, ఏదోభావం మరో ప్రశ్న వేయలేకపోయింది.

'నీ యీ వుపకారాన్ని నే మరిచిపోలేను ఎప్పటికీ!' కృతజ్ఞత వెల్లివిరిసిందతని



వెలుగునీడలు

ప్రయత్నాన.

వెంటనే సెలవుదీసికొని వెళ్ళిపోయాడు.

కలలోమాదిరిగా వుందామెకు జరిగిన విషయమంతా. 'అతడెందుకు వచ్చాడో, ఏం సాధించాడోగానీ ఆమె హృదయాన్నిమాత్రం వూపి వెళ్ళిపోయాడు.

ఎంత కఠినంగా వుందామనుకున్నదో. అంత కోమలంగా మారిపోయింది. ఎంతటి చిన్నదైనా యివ్వ నిరాకరించాలని దృఢంగా నిశ్చయించుకుందో అంతకన్నా పెద్దదాన్నే మనస్ఫూర్తిగా యివ్వగలనని మాట యిచ్చింది.

ఇంద్రజాలంలావుంది అంతా. కనుల ముందర ఏదో మంత్రం మాయను సృజించినట్లుంది, ఎంతోసేపు అలాగే కూర్చుండిపోయిందామె.

తండ్రివచ్చి లైటువేసినా కదలలేదు.

'ఏమ్మా, దీపం లేకుండానే కూర్చుండిపోయావే?' అన్నారాయన.

తెచ్చి పెట్టుకున్న నవ్వుతోలేచి ఎదురుగా వెళ్ళింది. కానీ తండ్రితో ఏవిధంగా ఆ విషయాన్ని గురించి చర్చించాలో ఆలోచించుతూనేవుంది ఆమె మనస్సు.

భోజనాలు పూర్తయాక ఏదో చదువుకుంటూన్న తండ్రి గదిలోకి వెళ్ళింది. కుమార్తె రాగానే పుస్తకం మూసి అవతల వుంచి అన్నారాయన వాత్సల్యం నిండిన స్వరంతో.

'రామ్మా! రా! ఇంకా నిద్రపోలేదా?'

తండ్రి చదువుతూన్న పుస్తకం తిరగవేస్తూండిపోయింది రెండు మూడు నిమిషాల వరకూ.

సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియకుండాపోయింది. చివరికి ప్రారంభించింది. పుస్తకంలోకి చూస్తూ అన్నది.

'మధుమూర్తి మాష్టారొచ్చివెళ్ళారు' ఆ స్వరంలో ఏ మాత్రం మాధుర్యమూ లేదు. ఆత్మీయతా ధ్వనించలేదు.

'లాగ!' అని వూరుకున్నారాయన మరో మాట మాట్లాడకుండా, కుమార్తె చెబుతుంది అన్న భావంతో.

'పెళ్ళి వాయిదా వేయించమంటున్నాడు! కారణం మాత్రం యిప్పుడు చెప్పడం మంచిదికాదట కానీ దానివల్ల మనకే లాభమట. అదీగాక మరొకర్ని కూడా ఒడ్డెక్కించినట్లవుతుందట' పాఠం వప్పజెప్పినట్లు గడగడా చెప్పివేసింది. అంతటితో ఆగిపోయి ఏమనుకున్నదో తండ్రి ముఖంలోకి చూసింది.

ఆ వైపునుంచి ఏ విధమైన జవాబు రాకపోయేటప్పటికి మళ్ళీ తానే అన్నది.

'నాన్నగారినడిగి చెబుతానన్నాను కానీ యిందులో ఏదో ఒక పెద్ద అగాధం వున్నదనిపించుతోంది నాకు. బావ ఏదో నాటకం ఆడుతున్నాడనుకుంటాను.' కొంచెం మనస్సు విప్పింది.

'అదే అనుకుంటున్నానమ్మా నేను కూడా! ఎక్కడో ఏదో అపశ్రుతి వుంది బావ విషయంలో. సరే! కానివ్వు! మధుమూర్తి సామాన్యంగా మాట యివ్వమని ఎవర్నీ అడగడు. అతనివలన ఎవరైనా మంచినే పొందుతారు గనీ, చెడును గ్రహించరు—

బావతో నేనే చెబుతాను. నాకు బొంబాయి వెళ్ళవలసిన పనుంది. పైనెలలోకి మార్పించుదాం ముహూర్తాన్ని అని' అన్నారాయన.

తండ్రి అంత తేలిగ్గా, తొందరగా తన మాటను విన్నందుకు అనుపమ మనస్సు తృప్తిగా విశ్వసించింది.

కానీ మధుమూర్తి వాగ్దానంలో వున్న రహస్యం ఆమెనింకా వేధించుతూనేవుంది

విజయ్ కుమార్ తల్లిమాత్రం ముహూర్తం మార్చడానికి సుముఖంగాలేదు. కొడుకుకూడా యిష్టం లేనట్లే మాట్లాడాడు. కానీ రాజశేఖరంగారి గంభీరత ముందు తమ అయిష్టతని విప్పిచెప్పలేకపోయారు తల్లీకొడుకు లిద్దరూ.

అనుపమ కందులో ఆనందమూ లభించలేదు. నిరాశా ఎదురవ్వలేదు. నిర్వికారంగా వుండిపోయింది.

ఆ తర్వాత వారం రోజులు గడిచిపోయాయి. కానీ మధుమూర్తినుంచి ఏ కబురూ లేదు. అసలతడు కబురు చేస్తానని చెప్పనూ లేదు కానీ అలాఅని వూహించింది అనుపమ.

'ఇదో అంతర్నాటకం కాదుగదా!' అనుకుంది లోలోన.

చీకట్లు అలుముకోలేదింకా. అప్పుడే శశికళ "అనుపమ అక్కయ్యా!" అంటూ లోనికి వచ్చింది.

అనుపమ వదనంమీద ఆశ్చర్యరేఖలు పరుగులెత్తాయి. ఆత్మీయత నిండివున్న ఆ సంబోధన చెవుల కింపుగా విన్పించింది. ఆ సమయాన అమెరాకకూడా సంతోషాన్నే కలిగించింది.

స్నేహపూర్ణ స్వరంతో లోనికి ఆహ్వానించింది.

కుశల ప్రశ్నాదులయిన తర్వాత శశికళ అన్నది—

'బావ మద్రాసు వెళ్ళాడు. నిన్ననే అక్కడినుంచి వుత్తరం వచ్చింది. తనకు జ్వరం వస్తోందట. హాస్పిటల్లో జాయినయ్యాడట. వెళ్ళేముందు ఓ వందరూపాయలు నాకిచ్చి వెళ్ళాడు 'వుంచు, అవసరం వస్తుందేమో' నీ'కంటూ వద్దంటున్నా.

అత్తయ్య 'డబ్బు అవసరంగా వుంది' అని వ్రాస్తే పంపించివేశాను. ఇపుడేమో 'బావ' ఆ వందరూపాయలూ పంపించమని వ్రాశాడు. నాకేం చేయడానికీ పాలుపోలేదు—

లేదు! అనివ్రాస్తే తాను మందులు వాడడంకూడా మానివేసేంత మొండితనం వుంది బావలో. అందుకే నిన్నడిగి పంపించుదామని వచ్చానక్కయ్యా!'

ఆమాట వినగానే అనుపమ అనురాగపూర్ణహృదయం వ్యాకులత చెందింది. ఎంతటి అస్వస్థతకోగానీ మధుమూర్తి మందులు తినడు. ఎలావున్నారో!' అని ఆందోళన పడింది.

మనసున రగులుతూన్న ఈర్ష్యాద్వేషాలు అనురాగ బంధంముందు ఓడిపోయాయి. వెంటనే లేచివెళ్ళి వంద రూపాయలు తెచ్చి 'శశికళ' చేతిలో వుంచుతూ అన్నది.

'నేనిచ్చినట్లు మాష్టారికి తెలియపరచవద్దు!' అని.

శశికళ వెళ్ళబోతూండగా తానే అడిగింది మళ్ళీ కుతూహలం వినదించుతూన్న స్వరాన్ని తగ్గించి—

'వివాహం ఎప్పుడు?!'

శశికళముఖాన మందహాస రేఖలు వెల్లివిరిశాయి ఆమాట వినగానే అనుపమ వంక నవ్వుమొహంతో చూస్తూ అన్నది.

'దగ్గర పడిందిలే! కానీ నువ్వు లేకుండా మాబావ పెళ్ళిలా జరుగుతుందక్కయ్యా! చూస్తావుగా! నువ్వు రాకపోతే పెళ్ళే చేసికోడట బావ!' ఆ పరిహాసం అనుపమను ఆశ్చర్యపరచింతెంతగానో. ఏదో అంతరార్థం వున్నట్లు గోచరించుతోందా పరిహాసాన.

'శశీ! నువ్వంటున్నదేమిటో నాకర్థం గావడం లేదసలు! కూర్చో! ముహూర్తాలు పెట్టుకున్నారా? మాష్టారి అమ్మగారు ఎలావున్నారు?'

అంటూ శశికళను కూర్చోబెట్టింది.

ఇంకా నవ్వుతూనే వున్నాయామె నేత్రాలు. బుంగమూతి పెట్టి అన్నదిలా.

'నీ ఆవేగం ఎందుకో నాకు తెలుసులే! ఇదిగో! అక్కా!—' అంటూ ఆమెకు దగ్గరగా జరిగింది మరి కొంచెంగా.

'బావ మనస్సు ఆశపడనే పడదు. ఆశించిందా అందేవరకూ వదలడు. అందుకే బావ అంటే ఎంతో గౌరవం నాకు' అన్నదామె స్నిగ్ధ దృష్టితో అనుపమవంక చూస్తూ.

ఆమెకేం మాట్లాడాలో స్ఫురించకుండా పోయింది.

'అదృష్టవంతురాలివి శశీ!' అన్నది లోలోన నిట్టూరుస్తూ అస్పష్టస్వరంతో.

'నీ దీవెన ఫలించాలనే నా ఆశా! బావను చూసుకునే జీవితాన ఆశలు అల్లుకుంటున్నానక్కా! ఎంతటి విషాదాన్నైనా భరించి హాయిని పంచిపెట్టగల మధురమూర్తి.'

అనుపమ మౌనంగా వింటూ కూర్చుంది. తానేదో పోగొట్టుకోరానిదీ, అమూల్యమైనదీ అయిన వస్తువును పోగొట్టుకున్నట్లు బాధపడ సాగిందామె హృదయం. శశికళపట్ల క్షణమాత్రం ఈర్ష్య జనించింది. కానీ వెంటనే ఆలోచనలు మరోదారిన మళ్ళాయి.

'మధుమూర్తి దగ్గరనుంచి జాబు రాగానే తెలియబరచుతానని'చెప్పి సెలవు తీసికొంది శశికళ. ఉత్సాహంనిండిన మనస్సుతో ఆహ్వానించిందిగానీ సాగనంపేసరికామె సంతోషం చల్లారిపోయింది పాలపొంగులా.

ఏది ఏమైనా అతడని మాత్రం హృదయ ఫలకంనుంచి తుడిచివేయాలని దృఢంగా నిశ్చయించుకుందా రాత్రి.

మరొకరి జీవితాన అడుగుబెట్టబోతూన్న అతడు తనకు ఏమీగాడన్న విరక్తితో బాధపడింది మొదట.

కానీ శశికళ అదృష్టాన్ని తలచుకుని అసూయపడకుండా వుండలేకపోతోంది.

'అయినా బావకేం తక్కువ? చదువూ, సంస్కారం వున్నాయి. అన్నిటినిమించి నాన్నగారి మనస్సుకు నచ్చినవాడు.' విరక్తితో సమాధాన పరచుకుంది.

* * *

తర్వాత నాలుగురోజులవరకూ ఏ సమాచారమూ లేదు. శశికళకూడా రాలేదు.

అనుపమ స్తబ్ధభావంతో కిటికీ ప్రక్కనే కూర్చుని చూస్తోంది.

ఎండ అంత తీవ్రంగా లేదు. కానీ ఆ తీవ్రతకే జనం పల్చబడిపోయారు.

దూరాన ఓ వ్యక్తి రిక్షాలోంచి దిగి నడిచి వస్తూండటం కన్పించింది

అనుపమ కన్నార్పకుండా చూసింది.

'అతడు మధుమూర్తి!

ఎందుకావేళలో వస్తున్నాడో అర్థం గాలేదామెకు. దగ్గరకు వస్తున్నకొద్దీ నడకవేగాన్ని హెచ్చించాడతడు

అస్వస్థతనుంచి యింకా పూర్తిగా కోలుకున్నట్లు కన్పించడంలేదు. సగమైపోయాడు మనిషి. అనుపమ మనస్సున వ్యాకులత అలా లేచింది. విరక్తి పెంచుకున్న అతనిపై ఒక్కసారిగా అనురాగం ప్రవాహోల్లై విరుచుకుపడింది.


అతడాయింటిని దాటి వెళ్ళిపోయాడు. తనకోసమే వస్తాడనుకున్న ఆమెకు ఆశాభంగం కలిగింది.

అంతలో 'విజయ్‌కుమార్' ప్రత్యక్షమయ్యాడు వస్తూనే అతడు ఓ చిన్నపెట్టె ఒకటి తెరిచి అనుపమ ముందుంచాడు.

'ఈ రెండు నెక్లెసుల్లో నీకేది బావుంటుందో చూడు అనూ! బొంబాయినుంచి తెప్పించాను ప్రత్యేకంగా నీకోసమని'

అనుపమ వాటివైపు కన్నెత్తి కూడా చూడలేదు

'నాన్నగారి కిలాంటి నగలపై మోజు



వెలుగునీడలు

తక్కువ! అందుకే నా జోలికే పోను' నిర్లక్ష్యత ప్రస్ఫుటంగా ధ్వనించిందామె కంఠాన

'ఏమైంది అనూ! మళ్ళీ ఆ మాష్టారు గుర్తుకు వచ్చాడా? అతనే వళ్ళించాడేమోలే నీముందు నగలు పనికి రానివని' హేళన ధ్వనించింది.

'మరీ అంత పసిపిల్లనుగాదు బావా! నాకూ యిష్టాయిష్టాలుంటాయి అయినా వద్దన్నది నేను దీనికి ఎక్కడో వున్న వాళ్ళను విమర్శించడం తెలివితక్కువని'.

కోపం మండిపోతున్నా తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అన్నాడా డాక్టరు—

'సారీ! అనూ! నీ మనస్సు నొప్పించినందుకు క్షమించు! కొన్ని అభిరుచులు నాకు సరిపడనివి వుంటాయి. సరుకు పోవాలి ఒమ్మ అన్నట్లు!'

ఆ కంఠాన ధ్వనించిన మృదుత్వంలో జీవమేలేదు.

అనుపమ మలినిండుగా ఆశ్చర్యం నింపుకుని అతనివంక చూసింది. క్షణంలోనే యింత ప్రసన్నంగా మారిన ఆయన కుని మనస్తత్వానికి విస్తుపోతూ.

'ఆ! మొన్న 'శశికళ' వచ్చిందటగా! ఓ వందరూపాయలు కూడా యిచ్చావని చెప్పిందే! అలాంటివాళ్ళను నమ్మకూడదు అనూ!'

ఆకస్మికంగా సంభాషణ మరో మలుపు తిరిగింది

అనుపమ మౌనం వహించింది కావాలనే.

'ఆ 'శశికళ' వుంది చూశావ్! ఉత్త మాటకారి! భలే చమత్కారంగా టోపీ వేస్తుందిలే మనుష్యుల్ని—'

అతనిమాట పూర్తికాలేదింకా. మధ్యలోనే అన్నదామె—

'ఏం? నీక్కూడా ఏమైనా టోపీ తగిలించిందా? బావా!'

'ఎవరికీ! నాకా! ఛా! ఛా! అలాంటి వాళ్ళ జోలికే పోనే నేను!'

కాలరు సర్దుకున్నాడతడు సగర్వంగా.

'ఏమో! మరి నా కలాంటి మనిషిగా కన్పించలేదే! అయినా ఆమెపై అంతకోపం ఎందుకు బావా?! నీ నుంచి ఒక్క పైసా కూడా తీసుకోలేదన్నావుగా?!'

'నీకు తెలియదు అనూ! ఆ అమ్మాయి సంగతి!'

'నీకూ తెలియదన్నావేమో ఇంతకు ముందే! అసలు అలాంటివాళ్ళ జోలికే పోనన్నావుగా?' వ్యంగ్యం దూసుకువచ్చింది.

'పోనివ్వు! ఆ గొడవ ఎందుగ్గానీ!' విసుగు నటించాడతడు.

లోలోన నవ్వుకుంది అనుపమ, అతని కప్పదాటు మనస్తత్వానికి.

అంతలో రాజశేఖరంగారొచ్చారు, విజయ్‌ను చూసి అన్నారు

'ఏమోయ్! హాస్పిటల్‌కి వెళ్ళడం లేదుట! మీ స్నేహితుడు గోలజేస్తున్నాడు. అతను ఫోనుకి వెళ్ళినా పట్టించుకోలేదుట!'

'అమ్మే వద్దంటోంది మామయ్యా!'

'అహా! అదా సంగతి! కొత్త పెళ్ళికొడుకువనా?' నవ్వారాయన మృదువుగా.

అనుపమ అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది.

తరువాత అతడు శుభలేఖలు అచ్చు వేయించినట్లు చెప్పాడు. రాజశేఖరంగారు మాట్లాడకుండా వూరుకున్నారు

బట్టలవీ తెచ్చుకోడానికి 'అనుపమ'ను మద్రాసు తీసుకెళ్తానన్నాడతడు.

'ఎందుకోయ్! విజయ్! అంత దూరం! ఆర్భాటాలూ, ఆడంబరాలూ ఎక్కువౌతుంటే మనసుల్లోని సహజకోమలత్వం కరిగిపోతుంది

అయినా యింత పట్నం వదిలి ఎక్కడో దూరపుకొండల్లో వెదికితే మాత్రం వచ్చేదేముందంటావ్? పెరట్లో పెరుగుతూన్న అరటిచెట్టును కాదనిపోయే మూర్ఖత్వం యింకా మానలేదోయ్!' మృదువుగా మందలించారాయన.

'విజయ్' మాట్లాడలేక పోయాడు ఆపైన. అనుపమ అంతలో తండ్రికి 'ఫోను' వచ్చిందని తెలియజేసింది. విజయ్ కుమార్ వస్తానని సెలవు తీసుకొన్నాడు. చేతిలోవున్న నగలపెట్టెను చూసి రాజశేఖరంగారు లీలగా గ్రహించగల్గారు ఆ యిరువురి మధ్యా వాగ్యుద్ధం చెలరేగి వుంటుందనుకున్నారు. కానీ ఒక్క మాట కూడా పైకి అనదలచుకోలేదాయన.

(ఇంకావుంది)

ఆత్మసంతృప్తి



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య


ఐహికాలయిన విషయాలను బట్టి చూస్తే మానవులకు తృప్తి అనేది వుండడం అసాధ్యం. ఏదో ఒక చిన్న కోరిక నెరవేరితే దానిపైని మరొక కోరిక కలుగుతూనే వుంటుంది. చిన్న వ్యాపారాలలో కొంచెం లాభాలు సంపాదించ గలిగినవాడు లక్షాధికారి కాగోరుతాడు. లక్షలున్నవాడు కోటికి పడగ ఎత్తాలనుకుంటాడు. తాను సుఖంగానూ, క్షేమంగానూవుంటే తృప్తిపడక తనవారికోసం తాపత్రయ పడతాడు. ఇది మానవజాతికి సహజం. దీనివల్ల తృప్తికి అంతం అనేది కనబడకుండా పోతుంది. పారలౌకికదృష్టి వున్నప్పుడే తృప్తి కలుగుతుంది. ఆ విషయంలో ఇతరులకు అందరాని ఘనకార్యం సాధించినప్పుడు కలిగే ఆనందానికి మేరవుండదు.

సుదాముడు సాధారణమైన తోటమాలి. తోటలో పూలమొక్కలను పెంచి పువ్వులను అమ్మకోవడం అతనివృత్తి, అదే అతని జీవనాధారం. అతని తోటలో ఒక చిన్న కొలను ఉంది. అందులో అపూర్వమైన తామర తీగ వుంది. అది యెప్పుడోగాని పువ్వదు పూచితే ఒకేఒక పువ్వు, ఆ పువ్వు మంచి పరిమళంతోసహా ఎంతో ఆకర్షకంగా వుంటుంది.

ఒకప్పుడు ఆ తామర లత నుంచి ఆ పుష్పం వెలువడింది. దాన్ని చూచి దరిద్రుడైన ఆ తోటమాలి ఎంతో పొంగిపోయాడు. దాన్ని అంగడివీధికి తీసుకొనిపోయి అమ్మజూపితే అయిదు వరహాలయినా రాగలవని ఆశపడి దాన్ని తీసుకుని పట్నంలోకి వెళ్లాడు. దాన్నిచూచి, కొనాలని సంకల్పించిన ఒకవ్యక్తి 'దీనివెల ఎంత?' అని అడిగాడు. 'ఐదువరహా' లన్నాడు సుదాముడు. ఇంతలో మరి ఒకతను వచ్చి 'నేను పదివరహాలిస్తాను; నాకిచ్చెయ్యి' అన్నాడు, మరుక్షణంలోనే మరొకడు 'నేనిరవై యిస్తాను' అన్నాడు. ఈవిధంగా పోటీ పెరిగి దానివిలువ యాభై వరహాల వరకూ ఎక్కింది.

'దీనికోసం యింతపోటీ పడడం యెందుకు వచ్చింది? అని ఆ తోటమాలికి ఆలోచన కలిగింది. దగ్గరవున్నవాళ్లు ఆడుకుంటున్న మాటలనుబట్టి వాడు బుద్ధభగవానుడు ఆ వూరు వచ్చాడనీ, ఊరికి ప్రక్కవున్న తోటలో బసచేసి వున్నాడనీ, ఏ కానుకలనూ అంగీకరించని ఆ మహనీయునికి ఈ అపూర్వ పుష్పం సమర్పించి, ఆయన దీవనలంది తరించాలనే సంకల్పమే దీనికి కారణమనీ అతనికి తెలిసింది. 'అయితే—అట్టి మహాభాగ్యాన్ని నేనే ఎందుకు పొందకూడదూ?' అనే సంకల్పంతో 'నాయనలారా! దీనిని నేను అమ్మదలచుకోలేదు' అని అన్నాడు. పోటీదార్లు దిగ్భ్రాంతులైనారు.

ఇంతలో ఆ నగరపురాజు ఏనుగుపై వస్తూ ఈ జన సమూహాన్నిచూచి సేవకుల నడిగి వివరం తెలుసుకుని 'నేను నూరు వరహాలిస్తాను; నాకు ఇయ్యి' అన్నాడు. సుదాముడు విధేయతతో 'ప్రభూ! నా దారిద్ర్యం దీని అమ్మకంతో తీరేది కాదు. అనిత్యమైన ధనంకోసం ఆశపడక, నా ఆత్మను తరింపచేసుకోవాలని నిశ్చయించు కున్నాను. దీన్ని తథాగతుని పాదపద్మాలపైని వుంచి నా జీవితాన్ని చరితార్థం చేసుకుంటాను. ప్రభువులు క్షమించాలి. దీనిని నేను అమ్మలేను' అనిచెప్పి తిన్నగా బుద్ధభగవానుడు ఉన్న వనానికిపోయి ఆయన పాదాలపైని ఆ అపూర్వ కమలాన్ని వుంచి మోకరిల్లాడు. భగవానుడు సంగతిని గ్రహించి, అతనితలపై చేతిని ఉంచి దీవించాడు. సుదాముని కన్నులనుండి సంతృప్తిని వెల్లడిస్తూ ఆనందబాష్పాలురాలి భగవానుని పాదాలను అభిషేకించాయి.



మనసులు మారాలి!



అరిగె రామారావు

'ఎలాంటి పరిస్థితుల్లోనూ రేపు స్టేట్‌మెంట్ డిస్పాచ్ కావలసిందే, మిసెస్ శ్రీదేవి! స్టాఫ్ పని చేయటం లేదని కూర్చుంటే ఆఫీసు ఎలా ఫంక్షన్ అవుతుంది? యు మస్ట్ ఎక్స్‌ట్రాక్ట్ వర్క్ ఫ్రమ్ ది స్టాఫ్. స్లాక్‌నెస్ పనికిరాదు.'

'అలాగేసార్' అంది శ్రీదేవి. ఆఫీసరు యిక మీరు వెళ్ళవచ్చు అన్నట్టుగా తల వూపి మిగతా కాగితాలు చూడటం మొదలెట్టాడు.

శ్రీదేవి స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని బయటపడింది. చికాకుగా తన సీటులో కెళ్ళి కూర్చుని టేబిల్‌బెల్ గట్టిగా కొట్టింది. స్టాఫ్ అంతా ఒకసారి తలలు ఎత్తి ఆమెవంక చూశారు ఆశ్చర్యంగా. శ్రీదేవి అంత విసుగ్గా, విసురుగా బెల్ కొట్టటమంటూ యింతవరకూ జరుగలేదు ఎప్పుడూ. అందుకే—సౌమ్యతకూ, ప్రశాంతతకూ నిర్వచనం శ్రీదేవి అని అనుకునే స్టాఫ్‌కు ఈ రోజు అంత ఆశ్చర్యంవేసి అంతా ఒకసారి తలలు ఎత్తి ఆమెవంక చూశారు. ప్యూను పరిగెట్టుకుంటూ వచ్చాడు.

'ఒకగ్లాసు మంచినీళ్ళు తీసుకురా. అలాగే వారిని పిలు' అంది శ్రీదేవి విసుగ్గా.

'ఎవరినండీ ?'

తలఎత్తి అతనివంక ఒకక్షణం చూచి అంది 'ఎ—టూ శేఖరంగారిని'.

ప్యూను వెళ్ళి మంచినీళ్ళు పట్టుకొచ్చాడు. చల్లటి మంచినీళ్ళు త్రాగేసరికి కాస్త తేరుకుంది. ఇందాకటి విసుగు కాస్తకాస్త జారుకుంది. ప్రతి నెలా ఏడో తారీఖుకల్లా హెడ్డాఫీసుకు పంపవలసిన స్టేట్‌మెంట్ ఈ నెల పదిహేనవ తారీఖు వచ్చినా పంపలేదని ఆఫీసరుగారు కారాలు మిరియాలు నూరాడు. ముప్పావు గంటసేపు ఉపన్యాసం దంచాడు. స్టాఫ్‌ని కంట్రోల్ చేయలేకపోతున్నారు అన్నాడు. ఆడది ఆఫీసులో అకౌంటెంట్‌గా చేయాల్సివస్తే పనులు యిలాగే తగులడతాయని ఆఖరికి సారాంశం తేల్చాడు. తాను ఆఫీసు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నానన్న తృప్తి తనకుంది. కాని ఎటొచ్చి ఆ అకౌంట్స్ సెక్షన్‌లో— వర్క్ సరిగ్గా జరగటం లేదు. పంపవలసిన సమయానికి స్టేట్‌మెంటులు వెళ్ళటంలేదు—

మళ్ళీ ప్యూనును పిల్చింది. 'వారితో

చెప్పలేదా' అని అడిగింది.

'చెప్పానండి, వస్తా, పదమన్నారు' భయంభయంగా చెప్పాడు ప్యూను.

అతని తప్పేమీలేదు పాపం. ఇందాక ఆమె చెప్పగానే అక్కౌంట్స్ సెక్షన్‌కెళ్ళాడు. శేఖరం దగ్గరకెళ్లి 'అకౌంటెంటుగారు రమ్మంటున్నారండి' అని చెప్పాడు.

'ఎందుకట' అనడిగాడు శేఖరం.

'ఏమో తెలీదుసార్' అన్నాడు.

'వస్తాలే, పో' అన్నాడు శేఖరం విసుగ్గా.

ప్యూను మళ్లీ వెళ్లి చెప్పాడు. శేఖరం విసురుగాలేచి పెద్ద గాలిదుమారంలాగా అకౌంటెంట్ శ్రీదేవి సీటు దగ్గరకొచ్చి పడ్డాడు. బల్ల ముందున్న కుర్చీని బర్‌మని లాగి కూర్చున్నాడు.

'నీ కెన్నిసార్లు చెప్పాను నన్ను నీ బల్లదగ్గరకు పిలిపించవద్దని' అన్నాడు.

శ్రీదేవి తల ఎత్తి సౌమ్యంగా అతని వంక చూచింది. మళ్లీ తల దించుకుని నిదానంగా అంది—'అవసరమైన పని ఉండి పిలిపించాను. నేనే మీ సీట్ దగ్గరకు వద్దామంటే సెక్షన్‌లో మిగతా వాళ్ళంటారుగా. అందుకని మిమ్మల్నే యిక్కడికి రమ్మని పిలిపించాను.

'ఇప్పుడేం మునిగిపోయిందో' దబాయింపుగా అడిగాడు.

శ్రీదేవి కొన్ని క్షణాలు ఏమీ మాటాడలేదు. ఒకసారి ఆఫీసులో స్టాఫ్‌వైపు కలయచూచింది. ఆమె చూడటం గమనించి మిగతా స్టాఫ్ తలలు దించుకుని రాసుకోవటం మొదలు పెట్టారు. శేఖరంవైపు చూచి ఎంతో సౌమ్యంగానే 'ఆ అకౌంట్స్ స్టేట్‌మెంట్ యింకా పంపలేదు'—అన్నది.

'అవును పంపలేదు' — శేఖరం నిర్లక్ష్యంగా, శ్రీదేవి సీటుప్రక్కన ఉన్న కిటికీలోగుండా కనిపించే ఆకాశానికిచ్చిన జవాబు.

'పంపవలసినతేదీ ఎప్పుడు?'—అకౌంటెంట్‌గారి ప్రశ్న.

'ఏమో తెలీదు'—ఆకాశానికే జవాబు.

అతని పెడసరపు సమాధానానికి కొన్ని క్షణాలు ఏమీ మాటాడలేక పోయింది శ్రీదేవి. మళ్లీ అంది—'సరే, నేనే చెప్తున్నాను. ఏడోతారీఖు. యివాళ పదిహేనో తారీఖు. ఆ స్టేట్‌మెంట్ యింతవరకూ మనం పంపలేదు. ఈరోజు హెడ్డాఫీసు నుండి రిమైండరు వచ్చింది. ఇందాక ఆఫీసరు నన్ను లోపలకు పిలిచి మొగం వాచేట్లు చీవాట్లు పెట్టాడు. మీరు నా పరిస్థితి కూడా చూడాలి. నేను అవతల ఆఫీసరుకు సమాధానం చెప్పుకోవాలిగా.'

'అయితే నన్నేం చేయమంటావ్'

'దయచేసి రేపు ఆ స్టేట్‌మెంట్ డిస్పాచ్ అయ్యేట్లు చూడండి.'

'అవదు'

'ఎందుకని?'

'కాష్‌బుక్‌నుండి యింకా పోస్టింగ్స్ జరగలేదు.'

'ఎలాగయినా రేపటికి ఆ పని పూర్తి చేయండి ప్లీజ్—'

శేఖరం ఏమీ సమాధానం చెప్పకుండా దురుసుగా లేచి చరచర తన సెక్షన్‌లోకి వెళ్లాడు. శ్రీదేవి వెళ్తున్న అతనివంక చూచి బరువుగా నిట్టూర్చి తలపట్టుకుని కూర్చుండి.

శేఖరం 'అవ్వాలట అవ్వాలి, ఎలా అవుతుందో' అని గొణుక్కుంటూ ధుమ ధుమలాడుతూ తనసీట్లోకి వచ్చి కూర్చుని బల్లమీదున్న ఫైళ్ళు కోపంగా అటూ యిటూ పడేశాడు. ప్రక్కసీట్లోనే కూర్చున్న అతని ఆప్తమిత్రుడు అనంతు ధుమధుమలాడుతూన్న శేఖరాన్నిచూచి 'ఏంటి గురూ! ఏం జరిగింది?' అని మెల్లగా అడిగాడు.

'ఏముంది అక్కౌంట్స్ స్టేట్‌మెంట్ పంపలేదేమని అయ్యగారు అడిగారు. ఏమైనాసరే రేపటికి పంపాలి అని అమ్మగారు హుకుం జారీ చేశారు.

అనంతు స్నేహ పూరితంగా శేఖరం భుజాన్ని తట్టుతూ 'దీనికింత హంగామా చేస్తావేరా. బాధ్యతగల అకౌంటెంట్‌గా అడిగింది. అవతల ఆ ఆఫీసరు చండశాసనుడాయె ఇందులో ఆమెతప్పు ఏముంది?' అన్నాడు అనునయ పూర్వకంగా.

'అబ్బే ఆమెగారితప్పు ఏముంది? తప్పంతా నాదే ఆమెగారి మొగుడ్ని అవటం నాదే పెద్దతప్పు!' అన్నాడు కసిగా.

*　　*　　*

తప్పంతా నాదే ఈపాడు ప్రమోషను అంగీకరించటం అకౌంటెంటు అవటం నాదే తప్పు—అనుకుంది శ్రీదేవి నుదురు నొక్కుకుంటూ ఈయన ఎందుకిలా తన మీద కక్ష సాగిస్తున్నారో తనకెంత ఆలోచించినా అర్థం కావటం లేదు. రెండు నెలల్రకితం తనకు ప్రమోషను వచ్చినప్పుడు ఎంత ఆనందించారో—ఎంత సంభ్రమపడ్డారో! నాకీ ప్రమోషనూ ఎద్దూ, పాడూ వద్దూ. మీరు పనిచేసే ఆఫీసులో, మీ మీద నేను సూపర్‌వైజరుగా ఉండటం, మీరు నా క్రింద పనిచేయటం నేను సహించలేను. నాకిలా క్లర్క్‌గా మీతోపాటు పనిచేయటమే బాగుంటుంది. ఈ ప్రమోషన్లూ, పదవులూ నాకొద్దు బాబు అంటె ఆమాట వినకుండా ఎన్నెన్ని కబుర్లు చెప్పారు—'ఆఫీసు జీవితంలో రోజుకు ఒక ఆరు గంటలు నీవు నాకు అధికారివి అయితే, బ్రతికినంత కాలం నేను నీ జీవితానికే అధికారిననే సంగతి మర్చిపోతున్నావు. నా పదవే గొప్పది. అసలు మనలో మనకీ తారతమ్యాలేమిటి? ఈ తారతమ్యాలయినా కేవలం అఫిషియల్ కాకపోయినా నేను అంత సంకుచితుడిని కానులే. ఏమైనాసరే, నీవు ఈ ప్రమోషను అంగీకరించి తీరవలసిందే'—అని పట్టుబట్టి నాచేత ఎస్ అనిపించారు యిప్పుడు యిలా ప్రవర్తిస్తున్నారు ఏమనుకోవాలి......

యింతలో గోడగడియారం ఒంటిగంట కొట్టింది. శ్రీదేవి ఉలిక్కిపడి తల ఎత్తి చూచింది. పన్నెండున్నర—లంచ్ టైం. పెన్‌కేప్ మూసేసి సీటులోంచి లేచి డైనింగు రూంలోనికి వెళ్లింది. ప్యూనువచ్చి స్టీల్ టిఫిన్ కారియర్, కాఫీఫ్లాస్కు యిందు పెట్టాడు. రెండు గ్లాసుల నిండా నీళ్లు పెట్టాడు. కారియరు మూత తీసి పూరీలు రెండు ప్లేట్లలో సర్ది పెట్టి, శేఖరం కోసం ఎదురు చూస్తూ కూర్చుంది శేఖరం ఎంతసేపటికీ రాడు. రోజూ పన్నెండున్నర అయేసరికి వచ్చేవారు. ఈరోజు యింతవరకూ రాలేదు

'వెళ్లి అయ్యగార్ని పిల్చుకునిరా' అని ప్యూనుని పంపించి, కుర్చీలో జేరగిలబడి కూర్చుంది

ప్యూను వచ్చి మెల్లగా 'అయ్యగారు కాంటీను కెళ్ళుతున్నారండి. మీరు

మనసులు మారాలి!

లమ్మన్నారని చెప్పితే కసురుకున్నారండీ' అని చెప్పి చల్లగా బయటికి తప్పుకున్నాడు.

శ్రీదేవి మ్రాన్పడిపోయింది. రోజూ కలిసి లంచ్ తీసుకునే ఆయన ఈ రోజు కాంటీన్‌కు ఎందుకు వెళ్ళినట్టు. నేనేం పాపం చేశానని ఆయన నన్నిలా సాధిస్తున్నారు. సీటు దగ్గరకు పిలిపించి స్టేట్‌మెంట్ యివ్వమని చెప్పినందుకా యింత కక్ష సాధిస్తున్నారు.

కొన్నిక్షణాలు ప్లేటులో పూరీలవంకే చూచి, బరువుగా నిట్టూర్చి మళ్ళీ వాటిని కారియర్‌లో పెట్టి సర్దేసింది. ఎదురుగా ఉన్న రెండుగ్లాసుల మంచినీళ్ళూ గడగడా త్రాగేసి కడుపు నింపుకుని మళ్ళీ తన సీటులోనికి వెళ్ళి కూర్చుంది.

* * *

శ్రీదేవి ఆఫీసునుండి యింటికి వచ్చేసరికి సాయంత్రం ఆరుగంటలు అయింది అప్పటికే బాబు, పాప స్కూలునుండి వచ్చి ఆటలు ఆడుకుంటున్నారు. వాళ్ళకు గబగబా నీళ్ళుపోసి వంటపనిలోనికి దిగింది. వంట పూర్తయ్యేసరికి ఏడుగంటలయింది. రేడియో టేబిల్ దగ్గర అలమరులో పాత న్యూస్‌పేపర్లు, పత్రికలు చిందరవందరగా పడి గందరగోళంగా ఉంది. వాటిని తీసి వరుసగా తేదీలవారీగా పెట్టి, వంటింట్లో పెట్టింది. అలమర అరల్లో దుమ్ము దులిపి, పాతన్యూస్ పేపర్లువేసి సామానులు అన్నీ చక్కగా సర్దింది, టేబిల్‌క్లాత్ మార్చి, టేబిల్‌మీద ఉన్న రాధాకృష్ణుల విగ్రహం, ఫ్లవర్‌వేజ్ అన్నీ సర్ది పెట్టింది. గంట ఏడున్నరయింది. అయినా శేఖరం యింకా యింటికి రాలేదు అతను వచ్చేటైం యింకా కాలేదు ఎనిమిది దాటితేగానీ, రాడు. ఆఫీసులోంచి మాత్రం టంచనుగా నాలుగు కొట్టేసరికి వెళ్ళిపోతాడు. ఆఫీసులో చాలామంది మూడున్నరయేసరికి పని చేయటం ఆపేసి, బాత్‌రూంలోకెళ్ళి మొహాలు కడుక్కోవటం, తలలు దువ్వుకోవటం మొదలుపెట్టుతారు. టాయిలెట్ అయింతర్వాత, సీట్లు సర్దేసి, ఆఫీసు గడియారంవంక చూస్తూ కూర్చుంటారు. ఆ 'చాలామంది'లో శేఖరంకూడా ఒకడు— గట్టిగా చెప్పాలంటే ప్రథముడు కూడా.

శ్రీదేవి మాత్రం అర్జంటు లెటర్సు చూస్తూ ఆఫీసరు వెళ్ళిపోయేవరకూ ఉంటుంది. ఆమె ఆఫీసునుండి బయల్దేరేసరికి రోజూ ఆరుగంటలకు తక్కువకాదు. ఆరుగంటలకు శ్రీదేవి యింటికివెళ్ళి వంటపని ముగించి భర్త రాకకోసం ఎదురు చూస్తూ కూర్చుంటుంది నాలుగయ్యేసరికి ఆఫీసునుండి బయటపడే శేఖరం యింటికి వచ్చేసరికి రోజూ ఎనిమిది దాటవలసిందే

కానీ, ఈరోజు తొమ్మిది అవవస్తున్నా యింటికి రాలేదు. శ్రీదేవి స్నానంచేసి ఉతికినచీర కట్టుకుంది. ఆఫీసునుండి వస్తూ తెచ్చిన మల్లెపూలు మాల కట్టుకుని ముడిచుట్టూ పెట్టుకుంది. సన్నగా రేడియో పెట్టి, వారపత్రిక తిరగేస్తూ, భర్తకోసం ఎదురు తెన్నులు సారిస్తూ కూచుంది. పిల్లలు కాస్సేపు చదువుకున్నారు 'అమ్మా, నాన్న యింకా రాలేదేం' అని అడిగి మెల్లగా పక్కల మీదకు జేరి నిద్రలుకూడా పోతున్నారు గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. శేఖరం యింకా రాలేదు పత్రిక చదువ బుద్ధి కాలేదు అవతల పడేసింది. వెళ్ళి మంచంమీద కాస్సేపు పడుకుందామనుకుంది. మళ్ళీ మల్లెపూలు నలిగిపోతాయని ఊరుకుంది. దిండు గలీబులు మాసివున్నాయి. వాటిని తీసేసీ, వేరే యిస్త్రీ గలీబులు తొడుగుతూ కూర్చుంది—

ఆమె గుండెల్లో ఏదో అర్థం కాని బాధ సన్నటి పోటులాగా ప్రారంభమయింది. తన భర్త ఈ మధ్య, తనకు ప్రమోషను వచ్చినప్పటి నుండి 'యింటికి కూడా ఆలశ్యంగా వస్తున్నారు. నాలుగు గంటలకే ఆఫీసునుండి బయటపడే ఆయన రాత్రి తొమ్మిది గంటలయినా బయట ఎక్కడ తిరుగుతుంటారో అర్థం కాకుండా ఉంది. ఎంత తిరిగినా, ఎన్ని పెత్తనాలు చేసినా గంటా, గంటన్నర—మరీ యింత ఆలశ్యమా. అసలు ఈయనకు చక్కపెట్ట వల్సిన రాచకార్యాలేం ఉన్నాయ్. లోగడ తను ఆఫీసులో లేటుగా కూర్చుంటే 'యింటికి పోదాం పద— యివాళ్టికి ఆఫీసుపని కట్టిపెట్టు' అని ప్రక్కన కూర్చుని లేచేవరకూ గొడవ జేసేవారు. తనతోపాటు యింటికి వచ్చి పిల్లలతో ఆటలు ఆడుకుంటూ, తను వంటచేస్తుంటే ఎన్నో కబుర్లు చెప్పేవారు. అలాటిది ఈ మధ్య రాత్రి పిల్లలు నిద్రలు పోయినా యింటికి రావటంలేదు. చూడపోతుంటే ఈయన కావాలనే యింటికి ఆలశ్యంగా వస్తున్నట్లు ఉంది. ఈయన ఎందుకిలా మారిపోయారు? ఈయనలో ఈమార్పంతా తనకు ప్రమోషను వచ్చిన దగ్గర్నుండీ మొదలయింది. ఈ వెధవ ప్రమోషను ఎందుకొచ్చిందోగానీ తన సంసార జీవితంలోని ఆనందమంతా మెల్లి మెల్లిగా తుడిచిపెట్టుకు పోతోంది. అంతకుముందు ఆఫీసుకు యిద్దరూ కలసి ఒక రిక్షాలో కూర్చుని పోవటం, ఆఫీసు అయింతర్వాత యిద్దరూ చెట్లనీడన ప్రక్కప్రక్కనే నడుచుకుంటూ యింటికి పోవటం—అబ్బ, ఎంత మధుర సన్నివేశాలవి. అలా ఆయనతో కలసి నడవటం తనెంత గర్వంగా ఫీలయ్యేది యింటికి వచ్చినతర్వాత ఆయన చెప్పే అర్థం పర్థంలేని కబుర్లు వింటూ, పిల్లలతో ఆడుకుంటూ, హాయిగా ఆనందంగా ఒకగంట గడిపేసరికి పగలస్తమానం ఆరుగంటలసేపు ఆఫీసులో పడిన శ్రమంతా మర్చిపోయేది. మళ్ళీ కొత్త ఉత్సాహం, కొత్త ఊపిరి, రెట్టింపు బలం వచ్చేవి. ఈ ఉత్సాహానికి కావలసిన బలమంతా ఆయన తీయటి మాటల్లోంచి, అనురాగపు హృదయంలోంచి, చెట్టు పెద్దవేరు బలాన్ని భూమిలోంచి పీల్చుకున్నట్లు, పీల్చుకునేది. ఈ ఉత్సాహం వల్ల, ఆయన యిచ్చిన ప్రోత్సాహంవల్లే తాను రాత్రిళ్ళు ఎంతో ప్రొద్దుపోయేవరకూ మేల్కొని డిపార్టుమెంటు పరీక్షలకు చదివింది! మీరూ చదవండీ అంటే 'నేను చదవలేను శ్రీదేవి. కాకపోయినా నాకు నీకున్నంత ఓపికా, తెలివితేటలూ లేవు. నా బదులు నీవు చదువు. నీవు చదివితే చాలదూ. నీవు పరీక్షలు పాసయి ప్రమోషన్లు సంపాదిస్తే నేను సంపాదించినట్లు కాదా—' అనేవారు తనకు కావలసిన పుస్తకాలు దొరకకపోతే ఎంతో ప్రయత్నించి, సాధించి తెచ్చారు. ఆయన యిచ్చిన ప్రోత్సాహం, సహాయంవల్లనే

"ప్రతి
రీటా కుట్టు మెషీను...
ఎంతో ఖచ్చితముగా
తయారైనది !

జర్మనీలో శిక్షణపొందిన మా
పారిభాషిక నిపుణులు అవి ఖచ్చితమైనవిగా ఉండేలా చూస్తారు."

రీటా కుట్టు మెషీన్లు ఎంతో కఠినమైన అంతర్జాతీయ ప్రమాణములకు తగినట్లు తయారుచేయబడినవి—ఎంతో చిన్న భాగము సహా జర్మనీలో తర్ఫీదు పొందిన మా పారిభాషిక బృందము ప్రతి తయారీ పద్ధతిలోను వారి నైపుణ్యమును మరియు పారిభాషిక పరిజ్ఞానమును చూపిస్తారు అందువలననే, రీటా మెషీను ఎంతో సౌఖ్యముగా పనిచేస్తుంది. చాల కాలము సర్వీసు నిస్తుంది మరియు దానిని నిర్వహించుటకయ్యే ఖర్చు చాల తక్కువే.


ఇంట్లో ఉపయోగమునకు, వే. ప్రత్యేక పనులకు మరియు వివిధ రకముల కుట్టు పనులకు వీలుగా ఉండే రీటా మెషీన్లు చాల మోడలులలో లభిస్తున్నాయి. రీటా మెషీనుకు అమ్మకము తర్వాత సర్వీసును ఇచ్చుటకు చక్కని ఏర్పాట్లు కలవు.

రీటా
...కుట్టుపనిని లాఘవాటిగా, సరదాగా చేస్తుంది!

Rita

5 ఏళ్ల గ్యారంటీ

మెస్సర్స్ రీటా మెకానికల్ వర్క్స్
రీటా బిల్డింగ్స్, ఇండస్ట్రియల్ ఏరియా 'ఎ' లూధియానా



మనసులు మారాలి!

తను అన్ని పుస్తకాలు చదివి పరీక్షలురాసి పాసవగలిగింది. ఆ పరీక్షలకు కూర్చున్న వారందరిలో తనొక్కర్తే పాసయిందని తెలిసినరోజున తనకంటే ఆయనే ఎక్కువ సంతోషించారు. తనొక్కర్తే పాసవటం వల్ల చాలమందికి తను జూనియర్ అయినా, ఆడది అయినా, తనకే ప్రమోషను యిచ్చారు. ఏదో సరదాకు పరీక్షలు రాశాను, నాకు ప్రమోషను వద్దు అంటే వినకుండా ఆయన బలవంతంచేసి వప్పించారు మరి అలాంటి ఆయన ఎందుకిలా ఈ రెండుమూడు నెలలనుండీ మారిపోయారు ఆయనకంటే రెట్టింపు జీతాన్ని సంపాదిస్తున్నప్పటికి ఆయన్ని తనేం చిన్న చూపు చూడటం లేదే. ఆయనకు తనిస్తున్న గౌరవంలో ఎలాంటి లోపమూ లేదే? ఎంత సంపాదించినా, ఏ పదవిలో వున్నా తను ఆయన పాదదాసియేకదా. మరెందుకిలా మారిపోయారు. ఆఫీసులోకూడా పని చేయటంలేదు అన్నీ కావాలని లేటు చేస్తున్నారు—ఆఫీసరుచేత తనకు చివాట్లుపెట్టిస్తున్నారు. ఎందుకిలా ఆయన తనమీద కక్షగట్టి సాధిస్తున్నారో అర్థం గావటం లేదు.

సరిగ్గా అదేసమయానికి పార్కులో అదేప్రశ్నలు శేఖరం స్నేహితుడయిన అనంతు అడిగాడు. శేఖరం ఏమీ మాటాడలేదు. ఆ ప్రశ్నలకు అతనిదగ్గర సమాధానాలు లేవు శేఖరం ఏమీ మాటాడక పోవటం చూచి అనంతు 'బ్రదర్ నీవు ఏమీ అనుకోనంటే ఒకమాట అంటాను, నీవు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో బాధపడుతున్నావు. అవునా' అన్నాడు.

శేఖరంకు కోపం వచ్చింది. తానే విషయాన్నైతే 'కాదు, కాదు' అని మభ్యపెట్టుకుంటున్నాడో అదే విషయాన్ని అనంతు వేలు ఎత్తిచూపాడు. 'ఆల్‌రైట్ లెటజ్ డ్రాప్‌ది టాపిక్' అని లేచేడు.

అనంతు తనని యింతమాట అన్నాడేమిటి అని ఆలోచిస్తూ యింటివయిపు నడక సాగించాడు. నిజంగానే తనలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు ఉందా? మరీ అంత యిరుకా తన హృదయం. తనకెన్నో ఆదర్శాలున్నాయి. అవన్నీ నిజ జీవితంలో అనుభవంలో స్వార్థంగా, మానసిక బలహీనతలుగా మారిపోతున్నాయా? ఈ అభ్యుదయ యుగంలో ఆడవాళ్ళు అన్నిరంగాల్లో ముందుకు రావాలని కాంక్షించే వారిలో తనూ ఒకడు. అలాంటిది తనభార్య తనకంటే పైచేయిగా ఉందని తనే మానసిక బలహీనతకు లోనవుతున్నాడా? కాదు, కాదు. ఆమెని పరీక్షలకు కూర్చోమని ప్రోత్సహించింది తను. ఆమెకు ప్రమోషను వస్తే గర్వించింది తను. ప్రమోషను అంగీకరించమని బలవంతం చేసింది తను—మరి యిప్పుడు ఎందుకిలా సాధిస్తున్నాడు అనుకుని... కాదు, తనేం సాధించటం లేదు. ఆమెలో అహం తాండవిస్తుంది. తనేదో పెద్ద అకౌంటెంటుని అనుకుంటూంది. కాకపోతే తనని తన సీటుదగ్గరకు పిలిపించి స్టేట్‌మెంట్ వెళ్ళలేదేం అని అడుగుతుందా. చిటికిమాటికి ఆఫీసు దగ్గరకు పిలిపించటం దేనికి? ఓహో! నేను పెద్ద అకౌంటెంటును, నీవు నాక్రింద పనిచేసే క్లర్కుగాడివి అని ఎత్తి చూపటానికేగా. స్టేట్‌మెంటు పంపకపోతే సెక్షనుకు వచ్చి తనని అడగొచ్చుగా. సెక్షనులో మిగతావాళ్ళు ఉంటారు అనుకుంటే ఒక చిన్న చీటీముక్కరాసి పంపించవచ్చుగా. యిదంతా తను యిప్పుడు ఎక్కువ పదవిలో ఉన్నాననే గర్వంగాదా. ఆపదవి తనకి రావటానికి కారకుడెవరో విస్మరించటం కాదా......

ఈ విధంగా ఆలోచిస్తూ వుంటే యిందాక అనంతు తనలోని లోపం ఎత్తి చూపినప్పుడు చెల్లాచెదరయిన భావాలు యిప్పుడు మెల్లగా మనసుపొరకొయిముడుతూ, యిందులో తన తప్పేమీ లేదు. అంతా తన భార్యదే తప్పు అన్న భావం తనలో బలం పుంజుకుని తనకు ఎంతో ఉపశమనం కలిగిస్తూ వుంది.

గదిలోపలకు అడుగు పెట్టగానే అటు వయిపుగా తిరిగి కూర్చున్న భార్య, నల్లటి మఖమలు వెల్లని మల్లెపూలూ, లైటు కాంతిలో మెరిసిపోతున్న అందమైన మెడ కనిపించాయి. మామూలుగా అయితే యిలా ఆమెని చూడగానే దగ్గరకు లాక్కుని, పూలు వాసనచూసి, మెడమీద పెదాలు ఆనించటం అలవాటు. యిప్పుడు కూడా బలంగా ఆ కోర్కె తనలో లేచినా, ఆమెమీద ఉన్న కోపం బలమైన ఆ

కోర్కెను బలవంతంగా అణచి వేసింది.

తను వచ్చిన అలికిడి వినగానే శ్రీదేవి వెనక్కు తిరిగి చూచి లేచి నిలబడింది. ఆఫీసులో అధికారం చెలాయించటం, యింటికిరాగానే అతివినయం చూపించటం ఎంతకయినా తగిపోయింది అనుకున్నాడు. రుసరుసలాడుతూ బట్టలు విప్పుకుని లుంగీ కట్టుకున్నాడు.

'ఇంత లేటు చేశారే?'

'లేట్‌చేశారే, గీట్ చేశారే అని అడగటానికి యిదేం ఆఫీసుకాదు—యిల్లు. నా యిష్టం!' అని రకీమని సమాధానం యిచ్చాడు.

ఈమాట ఆమెకు తగలవల్సినచోటే తగిలింది. అదే అతని ఉద్దేశ్యం కూడా. ఎందుకీయన తనమీద యింత దెబ్బ తీస్తాడనుకుంది.

మెల్లగా అంది 'మీకోసం పిల్లలు చూచి నిద్దర్లు పోయారు. నేను మీకోసం ఎంతో సేపట్నుంచి ఎదురు చూస్తున్నాను. మీ యింటికి యిల్లాలుగా ఆలశ్యమయిందేం అని అడగకూడదా? మామూలుగా అడిగానని ఎందుకనుకోరు? ఆఫీసు విషయం ఎత్తి ఎందుకు దెప్పిపొడుస్తారు?'

శేఖరం ఏమీ మాటాడలేదు

కొద్దిసేపు అయిన తర్వాత బరువుగా నిట్టూర్చి శ్రీదేవే,

'సరే, లేవండి స్నానం చేద్దురుగానీ' అని అంది.

'చేయను'

'అయితే భోజనం వడ్డించనా?'

'అక్కర్లేదు'

'ఏం? భోంచేయరా?'

'అక్కర్లేదు'

'ఎందుకండీ నన్నిలా సాధిస్తారు?' శ్రీదేవి కంఠం రుద్ధమయింది.

'నన్ననవసరంగా విసిగించకు' మంచం మీద అటువయిపుగా తిరిగి పడుకున్నాడు.

'ఏవండీ!'

'నీక్కాదూ చెప్పేది నన్ననవసరంగా విసిగించవద్దని'

శ్రీదేవికి ఏడ్పు ముంచుకు వస్తోంది. గుడ్లనీళ్లు గుడ్లకుక్కుకుంది. కొన్ని నిమిషాలకు ఎలాగో స్థిమితపడి బరువుగా లేచి వంటిల్లు సర్ది తలుపులు వేసి వచ్చింది.

ఇలా అలిగి అన్నం తినకుండా పండుకోటం ఈ నెలలో అప్పుడే రెండోసారి. మొన్న శివరాత్రి రోజున యింటి దగ్గర ఆఫీసుకని బయలుదేరినవారు మధ్య దారిలో ఆఫీసుకు రాకుండానే సెలవుచీటీ పంపించి కోటప్పకొండ తిరణాలకు పోయి రెండో రోజున ఎప్పుడో వచ్చారు.

'ఎందుకండీ అనవసరంగా శలవలన్నీ వేస్టు చేసుకుంటారు యిది తిరణాళ్లకూ, జాతర్లకూ పోవల్సిన వయస్సేనా?' అని అడిగేసరికి—


'నీవు ఏ హోదాలో ఈ ప్రశ్న వేస్తున్నావు?' అని పెద్దరాద్ధాంతం చేసి ఆవేళ యిలాగే భోంచేయకుండా పస్తు పడుకున్నారు

ప్రతీ చిన్న విషయానికీ ఆఫీసులో ముడిపెట్టి పెద్దరాద్ధాంతం చేసి సంసారంలో ఆనందం లేకుండా ఒక నరకంగా చేస్తున్నారు. ఈ మనిషికేం పట్టిందనుకోవాలి?...

...దీనికి మహాగర్వం పట్టింది ఎంత గర్వం కాకపోతే వంటిల్లు సర్ది తలుపేసి వస్తుంది. లోగడంతా యిలాగే చేసిందా? లోగడ ఎన్నిసార్లు అలిగి అన్నం వద్దని పండుకోలేదు. అప్పుడు బ్రతిమాలి, కాళ్లావేళ్లాపడి, కంచంలో అన్నం కలుపుకొచ్చి ముద్దుచేస్తూ ముద్దలు తినిపించలేదా. యిప్పుడు అన్నం వద్దన్నాన్లే అనుకో—లోగడలాగా బ్రతిమాలకూడదా? ముద్దలు తినిపించకూడదా? అనటమే తడవుగా ఏకంగా వంటింటికి గొళ్లెమే పెట్టి వచ్చింది. తనొక అకౌంటెంట్‌ని, ఈ క్లర్కు మొగుడిగాడ్ని బ్రతిమాలాలేం అన్న గర్వం కాదా. ఎంత నంగనాచి, తుంగ మీను. ఆ ఫూల్, అనంతుగాడు, తప్పంతా నాది అంటాడు. ఈవిడగారి దగ్గరెంత శానాతనముందో వాడికేం తెలుసు...శేఖర్ లోని కోపం ఇలాటి ఆలోచనల్ని రేపింది.

శ్రీదేవి నిద్రపోతున్న పిల్లలకు దుప్పటి కప్పింది. అమాయకంగా నిద్రపోతున్న వాళ్లవంక కాస్సేపు కన్నార్పకుండా చూచింది. 'మీకోసం — మీ బంగారు భవిష్యత్తుకోసమే మీ అమ్మ ఈ పాడు ప్రమోషను అంగీకరించి, ఈ ఉద్యోగం వెలగబెట్టుతూంది. ఇలా నలిగిపోతున్నది మీకోసమే నేను నలిగిపోయినా, నాశనమైపోయినా మీరు బాగుండాలి. అందుకే నేను బ్రతుకుతున్నది—' అని అనుకుంది.

కూజాలోంచి నీళ్లు వంపుకుని రెండు గ్లాసులు నీళ్లు తాగి కడుపు నింపుకుంది. గదిలో ట్యూబలైటు తీసి, టేబిల్‌లైటు వెలిగించింది. సాయంత్రం ఆఫీసునుండి తీసుకొచ్చిన ఫైళ్లు ముందేసుకుని కూర్చుంది. ఆ ఫైలు శేఖరం పంప



వల్సిన స్టేట్‌మెంట్ పొగాకు ఫైలు. అతనిపని తను చేయటానికి యింటికి తీసుకొచ్చింది.

శేఖరం గురకను ఛేదిస్తూ గడియారం ఠంగుఠంగుమని పదకొండు గంటలు కొట్టింది.

* * *

రెండురోజుల తర్వాత శేఖరం ఏదో కాగితాలు సంతకాలు పెట్టించటానికి ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు. ఆఫీసరు సంతకాలు చేస్తూ ఫలానా స్టేట్‌మెంట్ చేసేది మీరేనా అడిగాడు. అవునని సమాధానం యిచ్చాడు శేఖరం.

'ఈసారి పంపిన స్టేట్‌మెంట్ చాలా బాగుంది. ఫుట్‌నోట్స్ అవీ బాగా యిచ్చారు. ఐయామ్ వెరిమచ్ ప్లీజ్డ్. బాగుంది. 'ప్లీజ్ కీపిట్ దిస్' అన్నాడు ఆఫీసరు.

శేఖరంకు మతిపోయినట్టనిపించింది. ఆ స్టేట్‌మెంట్ యింకా పంపలేదు — పంపుదామనుకుంటున్నాడు. ఈ లోపలే శ్రీదేవి పంపి ఉంటుంది. ఆ రాత్రి రెండు గంటలవరకూ యింటిదగ్గర పనిచేసింది దీన్నిగురించే అయివుంటుందనుకున్నాడు. బెరడులు కట్టిన శేఖరం మనస్సు కాస్త మెత్తపడింది.

ఆఫీసరు గదినుండి బయటికి వస్తూ శ్రీదేవి సీట్‌వంక చూశాడు. ఆమె పెద్ద

మనసులు మారాలి!

చాటంత రిజిష్టర్లు ముందేసుకుని వాటితో కుస్తీ పడుతూంది. ఆ దృశ్యం చూచేసరికి అతనిమనస్సు యింకాస్త మెత్తపడింది. ఆమె ఎవరికోసమిలా కష్టపడి పనిచేస్తున్నది? నాకోసం, పిల్లలకోసం సంసారం కోసం కాదా. క్లర్క్‌గా ఉంటే యింతపని ఉంటుందా. మిగతా వాళ్ళలాగా రిజిష్టర్ల క్రింద వారపత్రికలు పెట్టుకుని సీరియల్స్ చదువుకోలేకనా, ఈ శ్రమంతా దేనికి? తనే మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడా అనిపించిందతనికి.

ఆరోజు లంచ్‌టైంలో భార్యతో మనసు విప్పి ఎన్నెన్నో విషయాలు మాటాడాడు. మనసారా నవ్వాడు ఆమెని నవ్వించాడు — మళ్ళీ మునుపటి శేఖరం అయ్యాడు.

'మీరిలాగే ఉండాలి జీవితాంతం యిలాగే నన్ను నవ్విస్తూ ఉండాలి. నా అవసాన దశలోకూడా యిలాగే నవ్వుతూ మీ చేతుల్లో ప్రాణాలు వదులుతాను. నాకు కావల్సిందదే' అని అనుకుంది మనసులో శ్రీదేవి. ఆమెకెంతో బలం, ఉత్సాహం వచ్చింది. ఈయన్లో ఈనవ్వు యిలాగే నిలుస్తుందా అన్న శంక మళ్ళీ మనసులో ఏదో మూల కదిలింది.

ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలకు శేఖరం ప్యూను చేత ఒక చీటీ పంపించాడు — ఈ రోజు మొదటాటకు 'మూగనోము' సినిమాకు పోదాం. పని తొందరగా తెముల్చుకుని నాలుగు గంటలకే నీ దుకాణం కట్టెయ్' — అని.


అబ్బ, యిద్దరం కలిసి సినిమాకెళ్ళి ఎన్నిరోజులో అయింది. ఇవాళ సినిమా కెళ్ళవల్సిందే అనుకుంది. సినిమాకెళ్ళాలన్న హుషారులో ముందున్న ఫైళ్ళను చకచక చూసి సంతకాలు పెట్టింది. నాలుగయ్యేసరికి శేఖరం ఆమె దగ్గరికి వచ్చి

'నీవు తొందరగా యింటికెళ్ళి పిల్లల్ని రెడీ చేస్తూవుండు. నేనిప్పుడే అనంతు యింటికెళ్ళి వస్తాను' అని చెప్పి హడావుడిగా వెళ్ళిపోయాడు.

పిల్లల్ని తయారుచేసి తను జడవేసుకుంటూండగా శేఖరం చెమటల్లు కక్కుకుంటూ సుడిగాలిలా వచ్చిపడ్డాడు.

'మీరంతా రెడీయేనా, ఏదీ. నేను కూడా స్నానం చేసివస్తాను' అని బాత్‌రూంలో కెళ్ళాడు.

శ్రీదేవి జడవేసుకోవటం పూర్తిచేసి, పౌడరు రాసుకుని, బొట్టు పెట్టుకుంటూండగా ఒక ఆలోచన వచ్చింది — నెలాఖరు రోజుల్లో సినిమాకని బయలుదేరదీశారు, యింతకీ ఈయన దగ్గర డబ్బు ఉందా అని. బొట్టు పెట్టుకుని భర్త పాంటుజేబులో చూచింది. అంతా కలిసి రూపాయి పదిపైసలు వుంది. జేబులో రూపాయి పదిపైసలు పెట్టుకుని సినిమాకు పోదామంటున్నారు, ఏమిటీయన — సినిమా టికెట్లకూ, రిక్షాలకూ ఎంత లేదన్నా 7, 8 రూపాయలు కావాలి. అంత డబ్బు తన దగ్గర లేదే. ఈ మూడు నాల్గురోజులకు యింటి ఖర్చులకు తన దగ్గర నాల్గయిదు రూపాయలున్నాయి. యిప్పుడు సినిమా కెళ్ళకపోతే కొంపేమి మునిగిపోయింది. జీతం వచ్చిన తర్వాత పోకూడదా. యిదేమాట ఆయనతో అంటే పెద్ద రాద్ధాంతం చేస్తారు. ఈ రోజే కాస్త మనసు విప్పి మాటాడారు. మళ్ళీ గొడవ అవుతుంది. ఎలా? యిక పిల్లల డబ్బులోంచి తీయవల్సిందే — పిల్లల కోసం ప్రతినెలా కొంత డబ్బు తీసి దాచిపెట్టుతూ ఉంటుంది. ఎంతో అత్యవసరమైన పరిస్థితి వస్తేగాని ఆ



డబ్బు కదిలించదు. అందులోంచి పది రూపాయల కాగితం తీసి భర్త పాంటు జేబులో పెట్టింది.

రిక్షాలో కూర్చుని సినిమాకు పోతూండగా మధ్యలో శేఖరం సిగరెట్టు పెట్టె కోసం జేబులో చేయి పెట్టాడు. శ్రీదేవి పెట్టిన పదిరూపాయల కాగితం చేతికి తగిలింది. బయటికి తీసి ఆశ్చర్యంగా 'ఇదెక్కడి డబ్బు' అని అన్నాడు

శ్రీదేవి మెల్లగా 'యిందాక వేట్టాను' అంది.

'ఎందుకు?'

'సినిమా టికెట్ల కోసం'

శేఖరం మొహం జేవురించింది —'నా దగ్గర డబ్బు లేదనుకున్నావా?'

'మీ జేబులో చూశాను, రూపాయి పదిపైసలు వుంది. అందుకని నేనే పెట్టాను.'

'అంటే, నా దగ్గర డబ్బు లేకుండానే సినిమాకు బయలుదేర దీశాననుకున్నావా? అసలు నీకా అనుమానం ఎందుకొచ్చింది. అసలు నీవు నా జేబులో చేయి ఎందుకు పెట్టావు?'

'ఇప్పుడేమయిందండీ—'

'ఏమయిందా ? యిది నన్ను ఇన్‌సల్టు చేయటం కాదా. ఎంత గుమాస్తా వెధవనయినా నా పెళ్లాం బిడ్డల్ని సరదాగా సినిమాకు తీసికెళ్లే తాహతు లేదనుకున్నావా? అసలు నాదగ్గర డబ్బులేవని ఎలా అనుకున్నావు ? యిదేమిటి ?' అని బర్‌మని చొక్కా చేతి మడతలాగి పది రూపాయల కాగితం బయటికితీసి శ్రీదేవి మొహంమీద పెట్టి గద్దించి అడిగాడు.


శ్రీదేవి తలవంచుకుంది.

'సంసారమంతా నీ సంపాదనమీద, నీ డబ్బుమీద జరుగుతూందని నాకెత్తి చూపటానికి, నన్ను అవమానించటానికేగా నీవీ పనిజేసింది.'

'ఎందుకండీ, నేను అననివన్నీ ఊహించుకుని మాట్లాడతారు'

'నోటితో అంటే ఒకటేనా, చేతితో చేస్తే మరొహాటేనా ? నీ కుచ్ఛితబుద్ధి అంతా తెలుస్తూనే ఉంది'

ఇంతలో రిక్షా హాలుముందుకొచ్చి ఆగింది. శేఖరం రిక్షాలోంచి ఒక దూకు దూకాడు రిక్షాకు డబ్బులు యిచ్చి బుకింగ్



దగ్గర కెళ్ళాడు. తిరిగివచ్చి శ్రీదేవి చేతిలో మూడు టిక్కెట్లు పెడుతూ 'మీరెళ్ళండి' అన్నాడు.

'మీరు?'

'నేను రాను. మీరెళ్ళండి'

శ్రీదేవి యింకేదో చెప్పబోయే లోపలే శేఖరం విసురుగా దూసుకు పోయాడు.

అక్కడికీ 'ఏమండీ' అని పిలిచింది కూడా.

వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు. శ్రీదేవి కొన్ని నిముషాలు ప్రాన్పడి అలాగే నిలబడిపోయింది. పిల్లలు 'అమ్మా, సినిమా మొదలుపెట్టుతారు. లోపలికి పోదాం పదమ్మా' అని గొడవ చేయటం మొదలుపెట్టారు

'లేదు పాపా ఇవాళ కరెంటు పోయింది. అందుకని సినిమా లేదు యింటికి పోదాం పదండి' అంది శ్రీదేవి.

'అబద్ధాలు చెప్పుతావెందుకమ్మా' అని పాప అంది.

'అనవసరంగా విసిగించకుండా నోరు మూసుకుని పదండి' అని పిల్లల్ని గదమాయించి సినిమా టికెట్లు ఎవరికో యిచ్చేసి యింటికి బయల్దేరింది శ్రీదేవి పిల్లల్ని తీసుకుని.

బయట గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టిన తర్వాతగానీ యింటి తాళం చేతులు భర్త దగ్గరే వుండిపోయిన విషయం గుర్తుకు రాలేదు. ఆయన ఎప్పటికి వస్తారో. ఆయన వచ్చేదాక ఎక్కడికి పోతుంది పిల్లల్ని తీసుకుని. అరుగుమీద కూలబడింది.

కొబ్బరిచెట్ల ఆకుల సందుల్లో ఇరుక్కుని గిజగిజలాడి పోతున్నాడు విదియ చంద్రుడు. మబ్బులమాటున చుక్కల చిన్నారి హృదయాలు స్పందిస్తున్నాయి. శ్రీదేవి గోడకి జేరగిలబడి కూర్చుంది.

'అమ్మా ఏదయినా కథ చెప్పమ్మా' అని పాప అడిగింది

'చెప్పమ్మా' అని బాబు అన్నాడు.

ఏదో పిచ్చికథ చెప్పింది. కథ పూర్తయ్యే సరికి పిల్లలిద్దరూ తన ఒళ్లో పడుకుని నిద్రపోయారు.

మాదాకవళం లడుక్కునే అమ్మి తన మీద దయి జూపమని వెంకటేశ్వరస్వామి మీద ఏదో పాట పాడుతూంది. శ్రీదేవికి

మనసులు మారాలి!

దుఃఖం ఉబికి ఉబికి వస్తూంది. అంతూ పొంతూ లేని భావాలతో మనస్సంతా చిక్కులుపడ్డ దారంబంతిలాగా గజిబిజిగా ఉంది.

భర్తతో, పిల్లలతో సర్దాగా సినిమా చూస్తూ గడపాలనుకున్న ఈరోజు ఆఖరికి ఇలా పరిణమించింది. ఈయన ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? సుఖంగా సాగిపోవల్సిన సంసారాన్ని ఎందుకిలా దుర్భరంగా తయారు చేస్తున్నారు. ఇందులో తన తప్పెంత వరకు? తనపాత్ర ఏమిటి? అంతకుముందు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఈ వెధవ ప్రమోషను వచ్చిన దగ్గర్నుండీ యిలా మారిపోయారు. ఆనాటినుండి తన సంసారానికి ముప్పు మొదలయింది. ఆనాటి నుండే తన ఆనందం తుడిచిపెట్టుకు పోవటం ప్రారంభమయింది. ఆనాటినుండే యిద్దరిమధ్యా అగాధాలు ఏర్పడ్డాయి. ఈయన మనస్తత్వం ఎంత ఆలోచించినా అంతుపట్టకుండా ఉంది ఆయన్ని నేనేదో చులకనచేస్తూ చిన్నచూపు చూస్తున్నట్లుగా లేనివన్నీ ఊహించుకుంటూ ఆయన బాధపడుతూ నన్ను బాధ పెడుతున్నారు. ఆయన్ని తను చులకనగా చూడటమేమిటి? అప్పుడయితే యిక తను బ్రతికి ఎందుకు?

ఆడది అకౌంటెంటు ఏమిటని అందరూ అనుకుంటున్నా, యిరవై మంది మగాళ్లమీద అధికారం చెలాయించ వల్సి వచ్చినా, ఎద్దుచాకిరీ చేయవల్సి వచ్చినా — అన్నిటికీ సహించి ఎందుకి అకౌంటెంటు ఉద్యోగం వెలగబెట్టుతూంది. తన సంసారంకోసం, తన పిల్లల భవిష్యత్తుకోసం కదూ. ఈ ప్రమోషను రావటంవల్ల అదనంగా నెలకు దాదాపు వందరూపాయలు జీతం వస్తుంది. ఆరోజు నాయన ప్రమోషనుకు వప్పుకోమని కోరి నప్పుడు తను డబ్బుపరంగా ఆలోచించి ఎక్కువజీతం వస్తుంది, తన పిల్లలు, తాను, తనభర్త హాయిగా దర్జాగా బ్రతక వచ్చునుగదా అని అంగీకరించింది. అంతకు ముందు చాలీచాలని జీతంలో, ప్రతినెలా అప్పులుచేస్తూ ఎన్నో యిబ్బందులు పడ్డారు. యిప్పుడిప్పుడు ఈ ప్రమోషను మూలంగా అప్పులు లేకుండా నెలకు పదో వరకో వెనకేయగలుగుతున్నారు. యిలా ప్రతి నెలా కొంత దాచిపెట్టితే రేపు పాప పెళ్లి పేరంటాలకు పనికివస్తుంది కదా అనుకుంది. కాని సంసారం కోసం, పిల్లల భవిష్యత్తుకోసం ఏ ప్రమోషను అంగీకరించిందో ఆ దే ప్రమోషను తన సంసారిక జీవితానికి గొడ్డలి పెట్టు అవుతుందని ఊహించలేదు. ఏ డబ్బుతో పిల్లల బంగారు భవిష్యత్తుకు మెట్లు కట్టాలనుకుందో ఆ డబ్బే పిల్లలకు తండ్రిప్రేమని దూరం జేస్తుందని ఆలోచించలేదు. రేపటికోసం ఈ రోజును నరకం చేసుకోలేను యిక—రోజు రోజుకూ పెరిగిపోతున్న ఈ అగాధాలను, గుండెకోతలను యిక భరించేశక్తి తనలోలేదు. తనసంసారం లోని ఆనందాన్ని పణంగా పెట్టుకుని తను ఈ పదవుల కోసం ప్రాకులాడలేదు. పోనీయ్— అసలు ప్రమోషనే రాలేదను కుంటే సరి. ఏదో చదువుకున్నది కాబట్టి, ఈ ఉద్యోగం దొరికింది కాబట్టి, సరిపోయింది. అసలు తనకు ఉద్యోగమే లేక పోతే, ఆయన రెక్కల కష్టం మీద, ఆయన సంపాదనమీదే ఆధారపడి వుండ వల్సిందేగా. ఈ దేశంలో ఆడవాళ్లంతా ఉద్యోగాలే చేస్తున్నారా! జీతం చాలక పోతే వచ్చేజీతాన్ని పొదుపుగా వాడుకుంటాం, అనవసరమైన ఖర్చులు తగ్గిస్తాం, అవసరమైతే పస్తులు పడుకుంటాం. అంతే గానీ, ఈ నరకాన్ని యిక భరించలేను ... నా సంసారానికి నీళ్లు వదులుకోలేను...

యిలా ఆలోచిస్తూ ఎప్పుడు కన్ను మూసిందో మూసింది. తొమ్మిది గంటలకు శేఖరంవచ్చి తలుపుతాళం తీస్తూండగా మెలకువ వచ్చింది.

అరుగుమీద కూర్చుని నిద్రపోతున్న భార్యనీ, పిల్లలనీ చూడగానే — వాళ్ళు సినిమాకెళ్లకుండా తిరిగివచ్చి సాయంత్రం నుండీ అలాగే అరుగుమీద కూర్చున్నారన్న విషయం తెలుసుకోగానే శేఖరం మనస్సుకు కట్టిన బెరడ్లు ఒక్కొక్కటే విడిపోయింది. పెద్ద నేరం చేసినట్లు ఫీలయ్యాడు.

భోంచేసి, మంచం మీద పండుకుని సిగరెట్టు త్రాగుతూ కిటికీలోంచి కనిపించే కాస్తంత ఆకాశాన్నీ, మబ్బు తునకల్నీ, వాటిమీద పొదిగిన నక్షత్రాల్నీ

అతి సున్నితమైన
వాయిల్ యొక్క సొగసు—

ముగ్ధులను చేసే మనోహరత్వము గలవి. అందాన్నిచ్చి, లావణ్యమును ఇనుమడింపచేసేవి. ఉత్తమమైన తెల్ల బట్టలమీద ఆకర్షణీయమైన పువ్వుల డిజైనులతో లభిస్తాయి. దావణగెరె కాటన్ మిల్స్ వారి ఈ సున్నితమైన చీరను మీరు కొని, ఆనందాన్ని పొందండి.

ది దావణగెరె కాటన్ మిల్స్ వారి

'ప్రియదర్శిని' వాయిల్‌లు



ASP-DCM-1 TEL

ది దావణగెరె కాటన్ మిల్స్ లిమిటెడ్, దావణగెరె.

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరింపబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతుల తిప్పిపంపబడవు వ్రాత ప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు

ప్రచురణకి స్వీకరింపబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరింపబడని నవలల వ్రాత ప్రతులు మేమే తిప్పి పంపిస్తాము వ్రాత ప్రతులతో స్వంత చిరునామాకల, తగు మాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 ఆరరావు పేజీల పయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

కార్టూన్లు

ప్రచురణకి స్వీకరింపబడని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులనీ, కార్టూన్లనీ వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయములో ఎటువంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

మనసులు మారాలి!

చూస్తూ ఉన్నాడు. చిన్న కిటికీలోంచి చూస్తే చిన్నదిగా, పెద్ద కిటికీలోంచి చూస్తే పెద్దదిగా కనిపించే ఆకాశంలాగా స్త్రీ హృదయంకూడా చూచే సాధనాన్ని బట్టి, వ్యక్తి దృష్టినిబట్టి కనిపిస్తుందేమో! అవును, నిజంగా యిన్నాళ్లూగా తను ఇరుకు కంతలోంచి చూస్తున్నాడు. జరిగిన సంఘటనలన్నిటినీ ఒకదాని ప్రక్క నొకటి పెట్టుకుని నిదానంగా ఆలోచిస్తే అనంతు అన్నట్లుగా నిజంగా తనలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు ఉందనిపిస్తోంది. ఉంది కాబట్టే యిరుకు కంతలోంచి చూస్తూ, యిరుకుగా ఆలోచిస్తూ తను బాధపడుతూ, భార్యని బాధపెట్టుతున్నాడు, అన్నెం పున్నెం ఎరుగని పిల్లల్నికూడా చీటికీమాటికి కసురుకుంటూ వాళ్లకు తండ్రి ప్రేమను కరువుచేస్తున్నాడు. ఇదంతా ఏమిటి? ఇందాక పార్కులో అనంతు అన్న మాటలు గుర్తువచ్చాయి—

'ఇదంతా ఏమిటి? నీ మానసిక బలహీనతోయ్! ఏం, సినిమా టికెట్లకోసమని ఆమె నీ జేబులో పదిరూపాయలు పెట్టిందనుకో అందులో నామోషి ఏమిటి? ఇదివరకెప్పుడు, నీదగ్గర డబ్బులేనప్పుడు ఆమెను అల్లించి బెల్లించి ఆమెపెట్టెలో చీరమడతల్లో దాచుకున్న డబ్బు తీయించి యిద్దరూ కలిసి సినిమాకు పోలేదా? అప్పుడెందుకని ఈ నామోషి ఫీలవలేదు యిప్పుడు కూడా అలాగే స్పోర్టివ్‌గా ఎందుకు తీసుకోకూడదు? నీవు ఏమనుకోనంటె నీ మొహాన కొట్టినట్లు సూటిగా ఒక ప్రశ్న అడగమంటావా? నీవు నామోషి ఫీలవటమంటూ వస్తే అసలు మొదట నీ భార్యచేత ఉద్యోగం చేయిస్తూ ఆవిడ సంపాదన తింటూ, నీబరువు బాధ్యతల్ని కొంతవరకు తగ్గించుకున్నందుకు నీకు నామోషి లేదా?...అసలు భార్యాభర్తల మధ్య నామోషీలూ, సోమాసీలూ ఏమిటోయ్? ఓరి పిచ్చితండ్రి యిదంతా నీ మానసిక బలహీనత. నీ బుద్ధిలోని; నీ ఆలోచనల్లోని వక్రత. భార్యాభర్తల మధ్య ఎంత అవగాహన ఉండాలి. యిలాంటి సమస్యలు సమస్యలేకావు టకాటకీ మాట్లాడుకుని అన్నీ క్లియర్ చేసుకోవల్సిందిపోయి అనవసరమైన అపోహలూ అపార్థాలూ పెంచుకుని బాధపడుతూ పార్కులవెంట తిరగటమెందుకు?

నిజంగానే తనబుద్ధి వక్రించింది లేకపోతే ఇలా ప్రతి చిన్నవిషయానికీ ఇంత పెద్ద రాద్ధాంతం చేస్తాడా? రేపు శ్రీదేవి అసలు నేను ఉద్యోగం చేయనంటే తనగతి ఏమిటి? తన బోడిజీతంతో ఈ సంసారాన్ని లాక్కురాగలడా? అనంతు అన్నట్లు భార్యాభర్తలు కాడెద్దులలాంటి వాళ్లు. ఏ ఎద్దు ఎంతబరువు మోస్తుందన్న సమస్యకాదు. బండి సాఫీగా తాపీగా నడుస్తున్నదా లేదా అన్నదే ముఖ్యం...

చేతివేళ్లను చురచుర లాడించిన సిగరెట్టు పీకను బయటకు గిరాటేసి ఇటు వయిపు తిరిగాడు. శ్రీదేవి పిల్లల మధ్య చిన్నపిల్లలాగా పాపను కరచుకుని నిద్రపోతోంది.

'పూర్ శ్రీ' అనుకున్నాడు. ఆమెవంక జాలిగా, ప్రేమగా చూస్తూ మంచినీళ్లు త్రాగి మళ్లీ పండుకున్నాడు.

శ్రీదేవికి ఎక్కువ జీతంతోపాటు, ఎక్కువ బాధ్యతలు, రెట్టింపయిన పని బరువు నెత్తినపడి సతమత మవుతూంటే, ఆమెకు తన చేతనయినంత సహాయం చేయవల్సింది పోయి, తన పనికూడా ఆమెచేత చేయిస్తూ, యింకా పైగా సాధిస్తున్నాడు నిజంగా తను ఉత్త ఫూల్!

తన తక్కువతనం తను ఫీలవకుండా వుండాలంటే తనుకూడా తన భార్యలాగా అకౌంటెంటు అవ్వాలి. అవ్వాలంటే డిపార్టుమెంటు పరీక్షలకు చదివి పాసు కావాలి. అనవసరంగా యింతవరకూ కాలమంతా స్నేహితులతో షికార్లుతిరిగి, సినిమాలు చూచి 'బేఫర్వా'గా గడిపేశాడు. ఇకనుంచి అన్నిటికీ స్వస్తిచెప్పి బుద్ధిగా పరీక్షలకు చదవాలి, పాసవ్వాలి, అకౌంటెంట్ అవ్వాలి. అప్పుడు భార్యాభర్తలిద్దరూ అకౌంటెంట్సే ... నిజంగా రోజెంత ఆనందంగా వుంటుంది! ●


బ్లూ సీల్ టాల్క్
హెక్సక్లోరోఫీన్ కూడినది
సాధారణ టాల్క్
ఇవ్వలేని
హాయిని ఇస్తుంది...
Blue Seal
TALC
శరీరానికి చెమటవాసనను
రానీయక రోజంతా
నవనవలాడించే రక్ష
Blue Seal
TALC
Blue Seal
రక్షణ దీంట్లో చేరిన అమోఘమైన హెక్సక్లోరోఫీన్, చెమటతో సూక్ష్మజీవుల విశ్లేషణం వల్లకల్గే శరీర దుర్గంధాన్ని నివారించి చర్మానికి రక్షనిస్తుంది..
హాయి. చర్మాన్ని పట్టులా మృదువుగా మన్నగా వుంచి మనోహరమైన సువాసనతో పరిమళింపచేస్తూ హాయినిస్తుంది!
గమనించండి, బ్లూ సీల్ టాల్క్—మే యితర టాల్క్ ఇవ్వని చర్మ రక్షణ నిచ్చి మనస్ఫూర్తిగా హాయినిస్తుందే—అనే మాటను నిలబెట్టుకుంటుంది!
హెక్సక్లోరోఫీన్ చేరిన
బ్లూ సీల్ టాల్క్
చీస్‌బ్రో-పాండ్స్ వారి మరో విశిష్టమైన తయారి
చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్
(పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఎ.లో స్థాపించబడినది)
P-4959

సీరియల్



బ్రతుకు బాట

పి. సత్యవతి

జరిగిన కథ

మాధవరావు, విమల, రఘుపతి, సుమిత్ర అన్న పూర్ణమ్మగారి సంతానం. తండ్రి చనిపోవడంతో కుటుంబభారమంతా మాధవరావుమీద పడుతుంది. మాధవరావు భార్య ఇందుమతి. కొడుకు విశ్వనాథం సంసారాన్ని ఈదుకుంటూనే తమ్ముడు రఘుపతి, చెల్లెలు సుమిత్రల పెళ్ళిళ్ళ చెయ్యాలని సంబంధాలు చూస్తాడు. కాని, దూరంగా వుండి ఉద్యోగం చేసుకుంటున్న రఘుపతి కులాంతర వివాహం చేసుకుంటున్నట్టు రాస్తాడు దాంతో మాధవరావు కృంగిపోతాడు. మాధవరావు అంగీకారంతో సుమిత్ర కాలేజీలో చేరుతుంది. అక్కడే ఆమెకు కుముదినితో, పరిచయమవుతుంది. అనుకోకుండా మాధవరావుకు సుబ్బలక్ష్మి తటస్థపడుతుంది. ఆమెకు సాయం చేయాలనిపిస్తుంది. తమ ఇంట్లో ఒక పోర్షను ఖాళీచేసి ఆమెకిస్తారు. సుమిత్ర కుముదిని సహాయంతో ఉద్యోగం సంపాదించుకుంటుంది ఆమెకి బసవరాజుతో పరిచయమవుతుంది సంసారం చక్కదిద్దుకోవడం గురించి సుమిత్ర చెప్పగా విమలకి కష్టం కలుగుతుంది.

8

వేకువ ఝామున ఇంటికివచ్చి మంచం మీద వాలాడు విమల భర్త. అతనికది అలవాటే కాబోలు. అతను లోపలికి వస్తూంటే చవకబారు సెంటువాసన గుప్పుమంది. అప్పుడే మెలకువ వచ్చిన సుమిత్రకి కడుపులో తిప్పి వాంతి వచ్చినంతపనైంది.

పిల్లలు స్కూలుకి వెళ్ళిన తరువాత తొమ్మిదిన్నరకి నిద్రలేచిన సత్యానందం, 'ఏయ్ విమలా కాఫీ!' అని కేకపెట్టడం, విమల స్ట్రాంగ్ డికాక్షన్ అతనికోసం ప్రత్యేకంగా తీసి చిక్కని పాలుకలిపి ఎక్కువ పంచదారవేసి శ్రద్ధగా తీసుకుని వెళ్ళడం గమనించింది సుమిత్ర.

'ఏమిటి మీ మంతనాలు!' అన్నాడు సత్యానంధం కాఫీ గ్లాసు అందుకుని.

'మంతనాలేం లేవు బావగారూ! మీరు రాత్రి ఎక్కడికి వెళ్ళారని అడిగాను!' అన్నది సుమిత్ర గదిలోకి వచ్చి.

'నువ్వలా అడక్కూడదు—' అన్నాడు సత్యానందం నవ్వుకుంటూ.

ఆ నవ్వు సుమిత్రకి కంపరం కలిగించింది.

'మరే! అడగడం తప్పే! మీరు వెళ్ళడమూ తప్పే! ఇవాళ నేను చుట్టాన్ని వచ్చానుగా! ఇంట్లో వుండండి! సరదాగా పేకాడుకుందాం!' అన్నది ధైర్యం చేసి.

'కాలక్షేపం పేక నేను ఛస్తే ఆడను! ఉద్యోగస్థురాలివి కదా! స్టేక్ ఎంతో చెప్పు!' అన్నాడు సత్యానందం సిగరెట్టు ముట్టించుకుంటూ.

అంత ఖరీదైన సిగరెట్టు అతను వెలిగించుకుంటూ వుంటే, అవతలగదిలో చిరిగిన ప్యాంట్ తొడుక్కోవలసి వచ్చినందుకు విసుక్కుంటున్నాడు అతని పెద్ద కొడుకు!

'ఏమిటక్కా! వాడి గొడవ!' అన్నది సుమిత్ర అటు తిరిగి—

'కాలేజిలో చదివే వెధవాయెనూ! మంచి బట్టలే లేవు' అన్నది విమల.

'అదేం బావగారు అలా చేశారూ? పెద్ద కొడుకును ఈ ఏడు కాలేజీ చదువు మాన్పించేశారు! పైగా వాడికి చిరిగిన బట్టలేమిటి ఖర్మ! జమీందార్ల వంశానికి చెందిన వారసుడు!' అన్నది సుమిత్ర హేళన చేస్తున్నట్టుగా.

'వాడికి బట్టలు లేవని నాకేం తెలుసు! మీ అక్కయ్య చెబితేగా! రేపు నేను గుంటూరు వెళ్ళే పనుంది. అప్పుడు పట్టుకొస్తాలే! కొంచెం డబ్బుకి ఇబ్బందై ఈ ఏడు వాడిచదువు ఆపాల్సి వచ్చింది. ఈ ఏడు చేరుస్తాలే బి.ఏ.లో!'

'చాలా కేర్‌లెస్‌గా మాట్లాడతారు బావగారు! కొంచెం సంసారం బాగోగులు పట్టించుకోండి. ఎందుకైనా మంచిది!'

గంభీరంగా అన్నమరదలుకేసి ఆశ్చర్యంగా చూస్తూ అక్కడినుంచి లేచిపోయాడు సత్యానందం.

'ఆయనతో నీకెందుకే గొడవా!' అన్నది విమల.

'ధైర్యం లేనివాళ్ళకి అన్నీ గొడవలుగానే వుంటాయి. చెత్త పోగుచేసి తగలబెట్టడం మనకి సరదా! ఇల్లంతా ఇలా పనికిరాని బూజుతో నిండివుండడం నాకు యిష్టం వుండదు. నీకెందుకు మీ ఆయన తలలో బూజుదులిపి, చిత్తు కాగితాలు తగలబెట్టి, ఆయన మెదడుకి సున్నం వేసి ఎలక్ట్రిక్‌బల్బు వెలిగించే ధైర్యం వుండాలి నీకు. అప్పుడే బాగుపడుతుంది మీ సంసారం—ప్రయత్నించు—' అన్నది సుమిత్ర.

*   *   *

'చాలా రోజులున్నారు—' అన్నాడు బసవరాజు పబ్లిక్‌గార్డెన్‌లో లాన్‌మీద కూర్చుని సుమిత్రకేసి గారంగా చూస్తూ.

'ఇంకా వుండాలనే అనుకున్నా—లాస్ ఆఫ్ పే మీద సెలవిచ్చారు — ఇంతలో బాంక్‌నుంచి ఇంటర్వ్యూ ఒకటి వచ్చింది.' అన్నది సుమిత్ర.

'ఇంటర్వ్యూలో బాగా చేశారా? ఉద్యోగం తప్పకుండా వస్తుందా? అన్న

జరిగితే ఎంత బావుండునూ!' అన్నాడు బసవరాజు మళ్లీ—

'మీకేం! అన్నీ బాగానే వుంటాయి— విమలక్క వూరెళ్లి వాళ్లనేదో బాగు చేద్దామనుకునే సరికి వాళ్లబ్బాయిని చదివించమని నావెంట తరిమారు! నాకు ఎంతమంచి ఉద్యోగం వచ్చినా దానికి తగ్గ ఖర్చు వుంటూనే వుంటుంది!' అన్నది సుమిత్ర.

'ఫరవాలేదు లెద్దురూ! ఖర్చు లేకపోతే మీ ఆడవాళ్లు మరీ షాపుల్లో పౌడర్లూ క్రీములూ, స్నోలూ చీరెలూ బ్రతకనివ్వరు!'

'మీ జోకులకి నవ్వే ఓపిక నాకిప్పుడు లేదు కానీ, నాకు సాయం చేసి పెట్టండి'

'మీరు అడగడం నేను కాదనడమూనా! చెప్పండి—'

'నాకో గది కావాలి వుండడానికి— మా అక్కకొడుకూ, నేనూ వుండడానికి చాలినంతది. ఎంత త్వరగా చూసిపెడితే అంత మంచిది—ఇంక నే వెడతాను—'అని లేచింది సుమిత్ర

'మీ ఆడవాళ్లొట్టి స్వార్ధపరులు. మీరు చెప్పదలుచుకున్నదంతా చెప్పి వెళ్లిపోతారు గానీ మేం చెప్పేది వినరు—'

'చెప్పండి—ఎందుకు వినం?'

'మీకు నేను చూసిపెట్టిన రూంలో గాలీ వెలుతురూ రాకపోతే నన్ను తిట్టకూడదు—నీళ్లు రాకపోతే నామీద ఫిర్యాదు చెయ్యకూడదు—ఇంటివాళ్లు మీతో పోట్లాడితే మీరు నామీద పోట్లాడకూడదు — వాళ్లు పొమ్మంటే నామీద కోప్పడకూడదు'

'కానివ్వండి—తప్పుతుందా!'

'అన్నట్లు బ్యాంక్‌లో ఉద్యోగంవస్తే రోజూ కనిపిస్తారన్నమాట!'

'ఇప్పుడు కనపడుతూనే ఉన్నానుగా!' మెత్తగా నవ్వింది సుమిత్ర.

'మీ సెక్షన్ వేరు—నాది వేరు—అయితేనేం లెండి — మూసేసే వేళకి నేను సెక్షన్‌లోనుంచే నడిచిపోతాను బయటికి!'

'బావుంది మీ వరస! నా రూం సంగతి మర్చిపోకండేం!' అని బస్సుకోసం బయలుదేరింది సుమిత్ర.

ఆమె వెళ్లిపోయాక అర్జెంటుగా స్నేహితుణ్ణి కలుసుకుని సైకిలేసుకుని చిక్కడపల్లి అంతా గాలించి వెంకటేశ్వరస్వామి కోవెల దగ్గర వసతులన్నీ వున్న ఒక గది



బ్రతుకు బాట

కనిపెట్టి ఇంటివాళ్ళతో మాట్లాడి, తాళంవేసి హాయిగా నిద్రపోయాడు బసవరాజు.

'ఇంత త్వరలో ఎలా దొరికింది ఇల్లు!' అని ఆశ్చర్యపోయింది సుమిత్ర.

'శ్రద్ధ అలాంటిది!' అని కామెంట్ చేసింది కుముదిని.

'ఇంత శ్రద్ధతో నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తే భరించలేను—' అన్నది సుమిత్ర, అతనికి కాఫీ యిచ్చి.

'మిమ్మల్ని ఎడ్మైర్ చేసే హక్కు నాకు లేదా ఏం?' అన్నాడు బసవరాజు, సుమిత్రతో సమానంగా ఇల్లంతా సర్ది పెట్టి.

పిన్నితో అంత చనువుగా మసలుతూ ఇల్లంతా తనదేనన్నట్లు తిరిగే. అతనివంక ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నాడు కృష్ణమూర్తి.

'ఈయన నా శ్రేయోభిలాషి. స్నేహితులు—చాలా మంచివారు—' అని పరిచయం చేసింది సుమిత్ర.

'మా దగ్గరనుంచీ వెళ్ళిపోవడానికి ఈ పిల్లాడిని తెచ్చావు కాబోలు!' అని దెప్పి పొడిచిన కుముదిని ఆ సాయంత్రమే చెల్లెళ్ళని తీసుకుని సుమిత్ర గదికి వచ్చేసింది.

'హాయిగా ఉద్యోగం చేసుకుంటూ బ్రతికేదానికి ఈ హంగామా అంతా ఏమిటే, వంట చెయ్యడం నీకెక్కడ కుదురుతుందనీ!' అని జాలిగా చూసింది గదిలో నాలుమూలలవంక.

'ఇద్దరం హోటల్లో తింటే చాలాడబ్బు ఖర్చవుతుంది కుముదినీ—నేను విశ్వానికి డబ్బు పంపాలి—వీణ్ణి చదివించాలి. వీటన్నిటికీ-ఎలా వస్తుంది డబ్బు! అందుకే వంట చెయ్యడానికి పూనుకున్నాను—'

'నీదంతా వట్టి జాలిగుండె. విశ్వానికి మళ్ళీనే, ఇతనిక్కూడా డబ్బు పంపితే సరిపోయేదిగా—ఇక్కడికెందుకు తెచ్చావు—' అని విసుక్కుంది కుముదిని—

'అక్క ఎంతో దీనంగా అడిగింది కుముదినీ— తీసుకురాక తప్పిందికాదు—నాకు మటుకు ఎవరున్నారు తినడానికి! పిల్లాడు కదా!'

'పిల్లమిటి సుమిత్రా! నువ్వు పెళ్ళి చేసుకుంటే నీ జీవితం నీకేర్పడదా!'.

'ఏమో! నేనదంతా ఆలోచించలేదు—అక్కయ్య బ్రతిమిలాడింది. తీసుకొచ్చాను. అంతే—నాకప్పుడే పెళ్ళెక్కడ కుదిరింది!' అని నవ్వుకుంటూ వెళ్ళిపోయిన సుమిత్రని చూస్తూ అల్లాగే కూర్చుంది కుముదిని. బ్యాంకులో ఉద్యోగం రావడం వల్లన సుమిత్రకి జీతం అరవై రూపాయలదాకా పెరిగింది. అక్కడ పనికూడా కొంచెం కష్టమే, సాయంత్రాలికల్లా తలనొప్పి రావడం సాగించింది. అన్నీ కూడికలూ, హెచ్చవేతలూ చేస్తూ సతమతమవుతున్న సుమిత్రకి ఓ రోజు ఫోన్‌కాల్ వచ్చింది.

'మీ ట్యూషన్ ధర్మమా అని అమ్మాయిలిద్దరూ ప్యాస్ అయ్యారు. సెకండ్‌ర్యాంక్ వచ్చింది. దయచేసి ఈ ఏడుకూడా చెప్పండి. జీతం కావాలంటే పెంచుతాం—సాయంత్రం ఓమాటు రండి. అమ్మాయిలు మీకు టీపార్టీ యివ్వాలని ఆత్రపడుతున్నారు—' అన్నది మిసెస్ అగర్వాలా వచ్చీరాని ఇంగ్లీషులో.

'ఈ ఉద్యోగమే తలనొప్పి—అదీకాక ట్యూషన్ కూడా ఎందుకు! వద్దు వెళ్ళకండి! ఆరోగ్యం చెడిపోతుంది' అన్నాడు బసవరాజు.

'సారీ బసవరాజూ! ఎన్నాళ్ళనుంచో ఎం. ఏ. చదవాలనే కోర్కె వుండిపోయింది. బెనారస్ వెళ్ళడానికి బోలెడు డబ్బుకావాలి—నా జీతంలో మిగలదు—ఉద్యోగము చెయ్యాలి—ట్యూషనూ చెప్పాలి—తప్పదు—లేకపోతే—ఎప్పుడైనా మీతో అలా ఐస్ క్రీమ్ తినడానికైనా పర్సులో పైసా వుండదు' అనేసింది సుమిత్ర.

'ఇంత అందమైన సాయంత్రాలన్నీ అగర్వాలాగారి ముద్దుపాపలకి నీతులు బోధిస్తూ గడపండి' అన్నాడు బసవరాజు కసిగా.

'ఒక్కొక్క నిమిషం ఖరీదు లక్ష రూపాయ లిప్పుడు—నాకు చదువేం వస్తుంది!' అని విరక్తిగా అనుకుంది సుమిత్ర ఒకరోజు కుముదిని ఇంట్లో కూర్చుని. ప్రొద్దున వంట; తరువాత ఆఫీసు, మళ్ళీ ట్యూషనూ; వంట, ఇక అప్పుడు చదువుకోడం! కొంచెం తల

స్వయంగా నిద్రపోత త్వంగా మలకువరాదు— త్వరగా నిద్రలేవకపోతే పనికాదు. ఆఫీసులో లేటువూర్కు. తొమ్మిది గంటలకల్లా కృష్ణుడికి భోజనంపెట్టి పంపాలి.

'నువ్వే ఇల్లా అనుకుంటే, ఫైనల్ యియర్ స్టూడెంట్ని నేనెలా అనుకోవాలి!' అన్నది కుముదిని.

'నీకు చదువు ఒక్కటే లోకం. నాకు అలా కాదు. ఎన్నో పన్ల మధ్య చదు వొక్కటే ఆశాదీపం' అంటుంది సుమిత్ర.

'ఒక పని చేద్దాం సుమిత్రా! మా ప్రొఫెసర్‌గారు చాలా మంచివారు. ఇంటి దగ్గర ఏదైనా అడిగితే చెప్పకుండా వుండరు. ఆయన దగ్గర చాలా రిఫరెన్స్ బుక్స్ వుంటాయి. నీకు హెల్ప్ చేస్తారు. ఆయన్ని పరిచయం చేస్తాను—నాతో ఒక రోజు రాకూడదూ?' అన్నది కుముదిని.

మహా ప్రవాహంలో కొట్టుకుపోయే వాడిని నావ వెతుక్కుంటూ వచ్చినప్పుడు కలిగే సంతోషం కలిగింది సుమిత్రకి.

'కష్టపడి చదువుకునే ఆడపిల్లలంటే ఆయనకి చాలా యిష్టం—ఆయన పిల్లలంతా మంచి చదువుల్లో వున్నారు.' అన్నది కుముదిని.

ఆమె అన్నట్లు ప్రొఫెసర్ కరుణాకరం చాలా మంచివాడు. వయస్సుతో పాటు హృదయాన్ని విశాలమూ, మెదడును విజ్ఞాన సుసంపన్నమూ చేసుకున్న జ్ఞానవృద్ధుండు. పేరుకు తగ్గ ప్రవర్తన.

'కుముదం చాలా మంచిపిల్ల. మీరు కూడా కూడా నాకెంతో నచ్చారు!' అన్నాడాయన.

'రోజుకి రెండు మూడుగంటలు ఏకాగ్రతతో చదవండి. తప్పకుండా పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటారు. బెనారస్‌లో మా స్నేహితులు చాలామంది వున్నారు. నేను ఉత్తరం వ్రాసిస్తాను వాళ్లు మీకు అక్కడ ఏర్పాట్లన్నీ చూస్తారు— తప్పకుండా చదవండి.' అని ప్రోత్సహించాడు ఆయన.

సుమిత్ర ఉత్సాహం రెట్టింపైంది. ఏది ఏమైనా చదివి తీరాలని నిర్ణయించుకుంది.

ప్రివియస్ క్లాసులో తను వ్రాసుకున్న నోట్సులూ, కొనుక్కున్న పుస్తకాలు సుమిత్రకిచ్చింది కుముదిని.

'ప్రొఫెసర్‌గారి దగ్గరకు ఎక్కువగా వెడుతూ వుండు సుమిత్రా! ఆయనేమీ అనుకోరు — నీకే పుస్తకం కావాలన్నా యిస్తారు' అని మరీ మరీ చెప్పింది సుమిత్రకి... సుమిత్ర అక్కడికి వెళ్ళినప్పుడల్లా కుముదినీ వచ్చేది. కానీ త్వరగా అక్కడనుంచి బయలుదేరేది కాదు. వాకిట్లో నీలంరంగు కారు ఆగడం ప్రొఫెసర్ పెద్దకొడుకు డాక్టర్ శివరాం లోపలికి రావడం, కుముదినిని పలకరించడం జరిగితేనే కానీ కుముదిని కదిలేది కాదు. అతనితో మాట్లాడేటప్పుడు ఆమె ముఖంలో వెలిగే కళాకాంతులను పరిశీలిస్తూ కూర్చునేది సుమిత్ర!

'డాక్టర్ శివరాం గురించి నీ ఉద్దేశ్యం ఏమిటి!' అనడిగేసింది ఓరోజు స్నేహితురాలిని.

'ఆయనంటే నాకు చాలా యిష్టం. ఆయనకీ నేను నచ్చాను. ఫైనల్ పరీక్షలయ్యాక మేము వివాహం చేసుకుంటాం— ఎలాంటి పరిస్థితు లెదురైనాసరే! కొడుకు మాట ప్రొఫెసర్ కాదనరు.' అన్నది కుముదిని వెంటనే.

'ఇన్నాళ్లూ చెప్పావుకాదే! గడుసు దానివి!'

'ఇన్నాళ్లూ అతనిపై నాకుగల యిష్టానికి కారణమూ, అర్థమూ తెలుసుకునే ప్రయత్నం నేను చెయ్యలేదు. ఈ మధ్యనే ఈ నిర్ణయానికి వచ్చాం—'

'మరి మీ బావమాటో! అతన్ని చేసుకోనంటే నాన్నగారు బాధపడరా?'

'ఈ రోజుల్లో బోలెడు కట్నం పోయనిదే ఆడపిల్లలకి పెళ్ళిళ్లు కావడం లేదు. బావకిచ్చిన డబ్బు నా పెళ్ళికి కట్నం యిచ్చినట్లు సమాధానం చెప్పుకునే శక్తి నాన్నగారికుంది సుమిత్రా! ఒక యువకుడికి విద్యాదానం చేశాననే సంతృప్తి అయినా ఆయనకి మిగులుతుంది. ఈ విషయం గురించి ఇప్పుడు మేమెవరమూ విచారించడం లేదు.' అనేసింది కుముదిని. అల్లా అన్నప్పుడు ఆ అమ్మాయి ముఖంలో గాంభీర్యం తప్ప మరే భావమూ లేదు —

'ఇన్నాళ్లకి నీ సమస్యకి పరిష్కారం దొరికింది. చాలా సంతోషం కుముదినీ!' అన్నది సుమిత్ర.

'ధైర్యమూ, చొరవాలేని వాళ్లెవరూ జీవితంలో సుఖపడరు అనే సత్యం తెలుసు



ఇప్పుడు నమ్మకం కుదిరిందిసార్ మీరు టికెట్టు కొన్నారని. ఇంక శ్రమపడకండి దాన్ని వెతకడం కోసం

కున్నాను సుమిత్రా! ప్రొఫెసర్‌గారి భార్య ఎవరో నీకు తెలుసా? ఆవిడ ముస్లింస్త్రీ! ఆ కాలంలో బంధువులనూ, స్నేహితులనూ అందరినీ ధిక్కరించి ఆమెని చేపట్టారు ఆయన. అందువలన ఆయన గౌరవం తగ్గిందా! అందుకే దేనికైనా ధైర్యం వుండాలి. చొరవ వుండాలి. పదివేల డబ్బు కోసం జీవితం అంతా దుఃఖపడగలమా?' అన్నది కుముదిని.

'మా చిన్నన్నయ్యది కూడా ఇదే సిద్ధాంతం. అందుకే వాడి జీవితం పూలబాట అయింది. నువ్వూ అలాగే వుంటావు కుముదినీ!' అన్నది సుమిత్ర స్నేహితురాలి భుజం తట్టి.

'నీకూ నేనొక సలహా చెబుతాను విను—ఎందుకొచ్చిన బాధ్యతలన్నీ నెత్తిన వేసుకుంటావు— హాయిగా ఎవరినైనా పెళ్లి చేసుకుని నీడపట్టున వుండకూడదూ?'

'బావుంది — ఇందులో ఏ బాధ్యతా ఏరికోరి నేను భుజాన వేసుకోలేదు. వాటంతటవే వచ్చి నామీద పడుతున్నాయి. కానీలెమ్మని మోస్తున్నాను — పెళ్లి చేసుకుంటే నన్నెవ్వరూ వద్దనరు— కానీ, ఎం. ఏ. ప్యాసయ్యేదాకా పెళ్లిచేసుకోడం నాకిష్టం లేదు కుముదినీ— ఈ ఉద్యోగం నేను చెయ్యలేకుండా వున్నాను. లెక్చరర్‌గా చేరిపోతే హాయిగా వుంటుంది. జీవితంలో సెటిల్ అయినట్లే లెక్క — వీలున్నంత వరకూ సంపాదించడం మానుకోను గదా పెళ్ళైనా!' అన్నది సుమిత్ర దూరంగా చూస్తూ, ఆలోచన నిండిన కళ్లతో.

'నీ కోర్కెలన్నీ నెరవేరేసరికి ముసలిదానివై పోతావు!' అని నవ్వింది కుముదిని.

'పోనిద్దూ — నా కోసం వేచివుండే వాళ్లూ—నాతో పాటే వృద్ధులౌతారుగా!' అన్నది సుమిత్ర. అప్పుడే ఆకాశంలో మొలిచిన నక్షత్రాలను చూసి నవ్వుకుంటూ.

*   *   *

ఆదివారం అంటే ఊపిరి తీసుకునే రోజు అనే నిర్వచనం చెబుతారు ఉద్యోగినులు.

తలంటు పోసుకున్న జుత్తు ఆరబెట్టుకుంటూ కొలీగ్ కల్యాణితో మాట్లాడుతూ కూర్చుంది సుమిత్ర.

అక్క కొడుకు కృష్ణమూర్తి స్నేహితుడి గదికి వెళ్లాడు చదువుకోడానికి.



బసవరాజు ఇంటికి భోజనానికి వస్తానని మాట యిచ్చిన సుమిత్ర వంటచెయ్యకుండానే కల్యాణితో కబుర్లు చెబుతూ కూర్చుంది.

కిటికీలోనుంచి సున్నితమైన తెల్లని ఎండ లోపలికి వస్తుంది.

పది కావస్తూన్నా కల్యాణి కదలక పోవడం చూసి ఆశ్చర్యపడింది.

'మీ ఆయన ఊళ్లో లేరా ఏం?' అన్నది.

'ఉన్నారు. ఆయన ప్రపంచం ఆయనది—ఆయన స్నేహితులతో మార్నింగ్ షోకి వెడతారు. ఎవరైనా బలవంతం చేస్తే అక్కడే ఏ హోటల్లోనో భోంచేస్తారు— ఎప్పటికో ఇంటికి చేరుకుంటారు—' నీరసంగా చెప్పింది కల్యాణి.

'బావుంది మీ వరస — అయితే మీ వక్కరికోసం వండుకోరన్నమాట— ఇల్లా వస్తుండి. ఉద్యోగం చెయ్యడం దేనికి కల్యాణీ— ఆస్తి వుంది — మీవారికి మంచి ఉద్యోగమూ వుంది—' అన్నది సుమిత్ర.

'కాలం ఎలా గడవాలి సుమిత్రా! ఒక్కదాన్ని ఇంటిదగ్గర కూర్చుని ఏం చెయ్యను? ఆఫీసు వున్నరోజున నాకు హాయిగా వుంటుంది— నాదంతా ఒక గొడవ —చెబితే తీరేదికాదు— అదంతా చెప్పి విసిగించడం ఎందుకు?'

'విసుగేం లేదు కల్యాణి! పూరికే అన్నాను. రండి కాఫీ చేసుకుందాం. నన్ను భోజనానికి పిలిచివుండకపోతే ఇవాళ మిమ్మల్ని భోజనానికి వుండమనేదాన్ని—' అన్నది సుమిత్ర.

'ఇంటిదగ్గర ఒక్కదాన్ని ఎంతసేపు కూర్చున్నా కాలం తరగదు— ఆప్యాయంగా పిలిచి పలకరించేవాళ్లంటే నాకు ఇష్టం' అన్నది కల్యాణి.

'అవును మనసులోమాట చెప్పుకోడానికి మన సుఖసంతోషాలు పంచుకోడానికి కష్టాలు తెలుసుకోడానికి స్నేహితులుండాలంటారు—అందుకే'

'స్నేహితులంటే నాకు చాలా యిష్టం— ఆపద సమయంలో మనకి చల్లని మాటలతో ఓదార్చే శక్తి వాళ్లొక్కరికే వుంటుంది.' అన్నది మళ్లీ కల్యాణి.

'ఆపదలనేవి కొన్ని నిజంగా వుంటాయి

కొన్ని మానం కల్పించుకోడాన్ని అట్టి పుట్టాయి. తినడానికింత తిండి, కట్టు కోడానికి బట్ట, వుండడానికొక ఇల్లూ లేక నిత్య జీవితం పెద్ద సమస్యగా పీడిస్తున్న వాళ్ళే ఆపదలను లెక్క చెయ్యక జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొంటున్నప్పుడు, పైవన్నీ వున్న మనం చిన్న చిన్న సమస్యలకి ఆపదలనే పెద్దపేర్లు అంటగట్టడం హాస్యాస్పదంగా వుంటుంది.' అన్నది సుమిత్ర, కల్యాణి చేతికి కాఫీ కప్పు ఇస్తూ.

'ఎవరి సమస్యలు వాళ్ళకి క్లిష్టంగానే కనపడతాయి కదా!' అన్నది కల్యాణి.

'కనపడతాయి. అలాంటప్పుడు మనకన్నా ఎక్కువ సమస్యలతో సతమతమయ్యే వాళ్ళని చూసి మనం సంతోషపడాలి—'

'మీరు చెప్పేది నాకు అన్వయించదు లెండి' అనేసి మౌనం దాల్చింది కల్యాణి.

సుమిత్ర నవ్వుకుంది.

'మావారు ఒక్కొక్కరోజు ఫ్రెండ్స్‌తో కలిసి బార్‌కి వెడతారు. అక్కడ నుంచి హోటల్‌కి వెళ్ళి మాంసాహారం తింటారు. నృత్య సంగీతాలు చూస్తారు. రాత్రి పన్నెండింటికి ఇంటికి వచ్చి తెగనిద్ర పోతారు. ఉదయం పేపరు చూసేదాకా లేవరు. నిజం చెప్పండి. ఇది మీరు భరించగలరా?!' అన్నది కల్యాణి మరి కాసేపాగి.

'ఎవరికైనా అలాంటి స్థితి భరించడం కష్టమే కల్యాణీ కాదనను—కానీ అటువంటి పరిస్థితి ఏర్పడితే మనని మనం ఓదార్చుకుంటూ, సానుభూతి ప్రదర్శించుకుంటూ వుండేకన్నా, దాన్ని మార్చడానికెందుకు ప్రయత్నించ కూడదూ అని నా వాదన!' అన్నది సుమిత్ర. వాకిట్లో రిక్షా ఆగిన చప్పుడుకి వులిక్కిపడి అటు తిరిగింది కల్యాణి.

తరువాత సుమిత్ర వంక ప్రశ్నార్థకంగా చూసింది.

నీలం చీరెకి వెండి జరీ అంచు కొంగు!

ఆవిడ బసవరాజు వెళ్ళాలూ కాదు, కుముదిని అంతకన్నా కాదు!

గుమ్మందగ్గరికి వచ్చి చూసింది! ఆశ్చర్యంతో కళ్ళు నులుముకుని మరీ చూసింది!

ఆవిడ సాక్షాత్తూ ఇందుమతిదేవి. ప్రక్కన సావిత్రి. పెట్టె, బెడ్డింగూ.

'అదేమిటోదినా! ఉత్తరం వ్రాస్తే సమతి రాదూ?' ఆశ్చర్యపోతూ ఎదురువెళ్ళి చేతిలో పెట్టె అందుకుంది సుమిత్ర.

'రాయలేకపోయాము సుమిత్రా! ఇల్లు కనుక్కోడం ఏమంత కష్టం కాలేదులే— అనుకోకుండా బయలుదేరాం!' అంటూ లోపలికి వచ్చింది ఇందుమతి.

సావిత్రి ముఖం నీరసంగా, పాలిపోయి నట్టు వుంది.

'రా! సావిత్రీ, అలా బిడియపడతా వెందుకూ? మంచినీళ్ళు త్రాగు!' అని మేనకోడలివైపు కుర్చీ జరిపింది సుమిత్ర.

మంచినీళ్ళగ్లాసు అందుకుంటున్నప్పుడు ఆ అమ్మాయి కళ్ళనిండా నీళ్ళు తిరగడం గమనించింది సుమిత్ర!

ఎప్పుడూ ఉత్సాహంగా మిలమిల మెరిసే సావిత్రి కళ్ళు వాలిపోయి వున్నాయి. వదిన కూడా తలవంచుకుని కూర్చుంది.

'చిట్టిని తీసుకు రాలేదేం వదినా!' అన్నది సుమిత్ర, వదిన భుజంమీద చెయ్యి వేసి ఆప్యాయంగా.

'దీన్ని తీసుకువచ్చాముగా!' అన్నది ఆవిడ విరక్తిగా.

ఎదుటవున్న పరాయి వ్యక్తి మూలంగా ఏదో చెప్పడానికి ఆవిడ సంశయిస్తున్నదని గ్రహించింది సుమిత్ర.

'ఇవ్వాళ నా ప్రోగ్రాం కాన్సిల్ అయింది కనుక మీరు మా ఇంట భోజనానికి వుండండి కల్యాణీ—ప్లీజ్—!' అని కల్యాణిని బతిమిలాడింది సుమిత్ర.

అటువంటి ఆహ్వానం కోసం ఎదురు చూస్తున్న కల్యాణి వెంటనే ఒప్పుకుంది.

ప్లేట్లు రెండూ వెతికించి వాటిమీద అన్నం, కూర వడ్డించి—

'ఇప్పుడే వస్తాను ఇంటివాళ్ళదగ్గర ఫోను చేసొస్తా. ఫ్రెండుతో అర్జంటుగా మాట్లాడాలి' అని వెళ్ళింది సుమిత్ర.

'మా దొడ్డ సావిత్రి. ఉన్న ఒక్క గడిపి వింత పొందికగా సర్దుకుంటో ఏ అత్తయ్యా! మనిషి చూస్తే ఎంత తీరుగా వుంటుందో! పూర్వ జన్మ సంస్కారం అంటే ఇదే!' అన్నది ఇందుమతి వంటి దగ్గర కూర్చుని సావిత్రితో.

'ఆవిడ ఆఫీసులో కూడా చాలా కష్టంగా పని చేస్తారు. ఎవరితోనైనా వినయంగా మాట్లాడతారు. కానీ ఒక్కొక్కసారి చెప్పరాని కోపం వస్తుంది. వెంటనే తగ్గిపోతుంది' అన్నది కల్యాణి.

'అవును— మా సుమిత్ర చాలా బుద్ధిమంతురాలు' అని ఇందుమతి అంగీకరించింది.


'ఏమోదినా ఇంత బుద్ధిమంతురాలా?' అంటూ గదిలోకి వచ్చింది సుమిత్ర...

'పాపం! మీ ఫ్రెండుకి కోసం వచ్చింది వాళ్ళు సరిగా!' అన్నది కల్యాణి.

'అంత కోపం వస్తే మనిషి కాదు కింద చప్పుడికి సంవత్సరంనుంచీ వాళ్ళింటికి రమ్మని పిలుస్తున్నారు. ఇవ్వాళ తప్పించుకోడానికి వీల్లేకపోయింది. ఇంతలో మీరు వచ్చారు — ఏం వదినా? ఏమిటి విశేషం? ఉగాది పండుగకి నన్ను పిలుద్దామనుకున్నారా?' అని ఎదురు ప్రశ్నవేసి కూర్చుంది సుమిత్ర.

'ఏమిటో! సుమిత్రా! మమ్మల్ని ఇది చేసి ఎవరూ రక్షించాలి—' అని సుమిత్ర చెయ్యి పట్టుకుంది ఇందుమతి.

ఆ తర్వాత ఏం చేయాలో తెలియక కల్యాణి కదలలేదు. 'ఇంటిదగ్గర పంటనిద్దుర చూసి వచ్చాను ఇది కాదుగా పాపం!' అనుకుంది సుమిత్ర తనలోనే. (ఇంకావుంది)



లిట్ క్విజ్ నెం 52 — 18 క్లూలు

1. ద్వేషం, భీతి, ఆశ, (లోభం) పగ మరియు తదితర చెడుమనోభావనలు, తమ అదీనులైన వారిని అంధులుగా / విభాజకులుగా జేయును.

2. శరవేగ పోకడలతోనున్న మరియు అమిత సాంకేతిక క్రమ పూర్ణమై యున్న మన ప్రపంచంలో మనము మానవతను కోల్పోవుచున్నాము / టక్కు చేయుచున్నాము.

3. మానవ అస్తిత్వ మరియు సమాజిక జీవనంలో పరివర్తన / బలవంతం సహజక్రమం ఆయివున్నది అది దైవికం అనబడుతుంది. వింత లేక ఆశ్చర్యజనక ఉద్వేగత కాదు.

4. మనిషి, స్పష్టంగా, విఫలతలు మరియు సుగుణములతో గూడిన మానవుడుగా పరిగణింపబడ్డాడు మరియు వేర్వేరు దశలలో సామర్థ్యమును / విశ్వాసమును కలిగియున్నాడు.

5. ఎక్కువ తెలివైన వ్యక్తి అవశ్యం ఎక్కువ నిపుణుడైన / సృజనశీలుడైన వాడుగా వుండునుట కేవలం సత్యంకాదు.

6. ప్రతిఒక్కరూ అహం మరియు భ్రమ / కామ కారాగారము బంధింపబడియున్నప్పుడు సామాజిక, రాజనీతిక స్వాతంత్ర్యం కోసం పోరాడుటవల్ల ఏమి ప్రయోజనం ?

7. మానవుని ఆదుర్దా వృధా విశ్రాంతి లేక విద్య లేక అధికారంకంటే సన్మానం / సుసంగతి, సౌందర్యం, సత్యం మరియు ఉద్దేశ్యం కోసం మించి అన్వేషణలో మునిగిపోతుంది.

8. మానవున్ని అతని అతిగాఢ మనోభావనలు / విశ్వాసములనుండి మరల్చుటకంటే లుబ్దున్ని అతని సంగ్రహిత ధనమునుండి మరల్చుట అతిసులభం.

9. మానవరూపంలో శ్రేష్టత / అస్తిత్వ సంస్కృతి యున్నది.

10. జీవితానందం ముక్తి / జ్ఞానము యందు ప్రవహిస్తుంటుంది.

11. ఆనందం / శిష్టత మనం సమర్పించుటను బట్టి మనకు లభ్యమవుతుంది.

12. బౌద్ధిక / మౌలిక జనులు స్థాయీ అదుపుకు లోనగుట తక్కువ, ఏకాకీయ జన సమూహ మనోభావాలను సులువుగా అనుసరించరు కాబట్టి.

13. మానవుడు తన స్వభావ / ఆవశ్యకతలతో మేళవించే జీవన పద్ధతిని కల్పించుకొనుటకు ఎడతెగక పెనుగులాడుచున్నట్లు తోస్తుంది.

14. శీలత యంతటికి అసలైన పునాది, ధార్మికత / పవిత్రతయై వున్నది.

15. మానవుడు సృష్టించబడిన క్షణమందే ద్రోహం / ధర్మం జనించింది.

16. విజ్ఞాన / సేవా క్షేత్రం అపారం కొద్దిమంది వస్తాతే నిపుణులుకాగలరు నిపుణుడు కానుంకించువాడు విఫలుడగును.

17. గర్వము / వైవిధ్యత ప్రకృతియొక్క గొప్ప భ్రమ అనురూప ప్రాతినిధ్యం.

18. మూర్ఖుమానవుడు మూర్ఖంగాను, వివేకి వివేకంగానుమరియు నీతిమంతుడు / ద్రష్ట సౌందర్యంగాను, అధముడునీచంగానుసృజించును.

No. 52: 18 CLUES

(1) Hate, fear, greed, bitterness and other dark emotions Blind / Break those whom they dominate

(2) In our world of hectic hurry, and over-organised technocracy, we are Ceasing / Feigning to be human.

(3) Change / Compulsion is so much the natural order of human existence and social life that it comes to be taken for granted to excite no curiosity or surprise.

(4) Man, it is apparent, is recognised as human, with failings and virtues, and equipped with varying degrees of Competence / Confidence

(5) It just is not true that the more intelligent person is necessarily the more Competent / Creative one

(6) What is the use of fighting for social and political freedom when everybody is locked up in the jail of ego and Delution / Passion?

(7) Man's yearning extends beyond mere comfort or knowledge or power—to seek Dignity / Unity, beauty, truth and purpose in life.

(8) It is easier to wean a miser from his hoard than a man from his deeper Emotions / Opinions

(9) Culture is the human form of Excellence / Existence.

(10) Delight the flows forth in Freedom / Wisdom.

(11) We get Happiness / Politeness by giving it

(12) Intellectual / Original people are less amenable to lasting control, do not easily develop a homogeneous mob mentality and therefore form bad party supporters.

(13) Man, it seems, has been constantly struggling to evolve a way of life as would be in harmony with his Nature / Needs.

(14) Piety / Purity is the cornerstone, the very foundation of all character

(15) Rebellion / Religion was born the moment man was created.

(16) The field of Science / Service is immense. Few can become master and he fails who seeks to become master

(17) Vanity / Variety represents the great illusion of nature.

(18) A foolish person builds foolishly, and a wise one sensibly; a Virtuous / Visionary one beautifully; and a vicious one basely.

గమనిక: పై క్లూలు ప్రసిద్ధ గ్రంథకర్తల పుస్తకములనుండి తీసుకొనబడినవి. అవి పూర్తి వాక్యముల మరియు వేరువేరుగా పూర్తి అర్థవంతమైనవి. గ్రంథకర్తలు, వారి పుస్తకముల పేర్లు అఫిషియల్ సొల్యూషన్ తో పాటు లిట్ క్విజ్ వీక్లీలో ప్రచురించబడును.

డాక్టర్ డి. ఎస్. రావు

'యునైటెడ్ స్టేట్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, మద్రాసు రీజియనల్ ఆఫీసర్ డాక్టర్ డి. ఎస్. రావు ఆగస్టు మొదటి వారంలో ఢిల్లీ వెళ్ళనున్నారు. న్యూఢిల్లీలో కొత్తగా ఇటీవల స్థాపించిన శాస్త్రి ఇండో కెనెడియన్ ఇన్‌స్టిట్యూట్‌కి మొదటి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా డా. డి. ఎస్. రావు పదవీ స్వీకారం చేస్తారు. డా. రావు, వారి శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి గార్లు సాంస్కృతిక కార్యకలాపాల్లో ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించి ఈ అయిదేళ్ళలో మద్రాసు ఆంధ్ర వర్గాలకు అత్యంత సన్నిహితులైనారు.

దక్షిణభారత చలనచిత్ర సాంకేతిక నిపుణుల సంఘం రజతోత్సవ కార్యక్రమం

దక్షిణ భారత చలనచిత్ర సాంకేతిక నిపుణుల సంఘం, మద్రాసు వారు తమ సంస్థ రజతోత్సవ సందర్భంగా శాశ్వత భవన నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. దానికి కావలసిన నిధులని ఈ ఏడు ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సేకరించడం జరుగుతుందని సంఘం గౌరవ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణస్వామి ఇటీవల ఒక పత్రికా గోష్ఠిలో వివరించారు. సాంస్కృతిక ప్రదర్శనల కార్యక్రమంలో మొట్ట మొదట ప్రఖ్యాత తమిళ నటుడు, శివాజీగణేశన్ వియట్నాం హౌస్' నాటకాన్ని ప్రదర్శిస్తారని తెలియజేశారు. తమిళంలో అనేకసార్లు ప్రదర్శింపబడి బహుజనాదరణపొందిన ఈ నాటకం స్థానిక మ్యూజిక్ అకాడమీహాల్ లో జూలై 26 న ప్రదర్శింపబడుతుంది.

సాంకేతిక, కళాత్మక విలువలకి ప్రాధాన్యత కలిగించే అనేక ప్రదర్శనలు ఈ సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక ఉత్తమ ఆశయం కోసం ఏర్పాటు చేయబడుతున్న ఈ కార్యక్రమాలని ప్రజలు ప్రోత్సహించి వాటిని జయప్రదం చేస్తారని తాము ఆశిస్తున్నామని, శ్రీ కృష్ణస్వామి అన్నారు.

ఒక సదాశయ నిర్వహణకోసం జరుగుతున్న ఈ కార్యక్రమాలని ప్రజలు, చలనచిత్ర పరిశ్రమలోని ఇతర ప్రముఖులు తమ ప్రోత్సాహ సహకారాలని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

—(ఒ. వి.)

* * *

జూలై 6 వ తేదీన బరోడా ఆంధ్ర సమితివారు తమ నూతన సంవత్సరంలో ప్రథమ కార్యక్రమం జరుపుకున్నారు. విరివిగా విరాళాలు పోగుచేసి పంపటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు, సమితి తరఫున ముందుగా సానుభూతి పూర్వకంగా రూ. 300/- పంపినట్లు తెలియజేశారు. (ఒ. వి.)

* * *

ఇటీవల నిత్యారు ఆర్ట్ లవర్స్ యూనియన్ వారు నిర్వహించిన నాటక పోటీలో శ్రీ రత్నశ్రీ ఫైన్ ఆర్ట్స్, మద్రాసు వారు శ్రీ మోదుకూరి సత్యం గారు రచించిన 'కనీసం కుండే' అను నాటకను ప్రదర్శించి బహుమతులు పొందారు.

మరల 65,000 రూపాయలు!

LitQuiz No 52

Rs 65000

FIRST PRIZE Rs 26000 | SECOND PRIZE Rs 10000 | THIRD PRIZE Rs 5000

4th & 5th PRIZES Rs 4,000

MINI B FIRST PRIZE Rs 10000

RUNNERS-UP (UPTO 3 ERRORS) Rs 5000

MINI A ALL CORRECT Rs 4,000

SUBSCRIBERS' PRIZE Rs. 1,000

— ! ముఖ్యాంశములు ! —

1. మొదటి బహుమతి మొత్తం పెంపు
2. 3వ బహుమతి రూ 5,000/—
3. మిని B లో మొదటి బహుమతి 5 అంకెల మొత్తం
4. మిని L లో 3 తప్పుల వరకు బహు[illegible]
5. [illegible]
6. చందాదారులకు క్రొత్త పథకం.

లిట్ క్విజ్ నెం. 52 అధికార ఎంట్రీ ఫారము

ఆఖరు ముగింపు తేది 30-7-69 బుధవారం

ADDRESS LITQUIZ No 52 ALANKAR BALARAM STREET BOMBAY-7 (W B)

గమనిక. 1) [illegible] (2) [illegible] (3) ఎంట్రీలు M O ద్వారా [illegible] M O [illegible] (4) I. P. O. [illegible] లిట్ క్విజ్ నం 52 [illegible]

Re. 1		1
1	BLIND	BREAK
2	CEASING	FEIGNING
3	CHANGE	COMPULSION
4	COMPETENCY	CONFIDENCE
5	COMPETENT	CREATIVE
6	DELUSION	PASSION
7	DIGNITY	UNITY
8	EMOTIONS	OPINIONS
9	EXCELLENCE	EXISTENCE
10	FREEDOM	WISDOM
11	HAPPINESS	POLITENESS
12	INTELLECTUAL	ORIGINAL
13	NATURE	NEEDS
14	PIETY	PURITY
15	REBELLION	RELIGION
16	SCIENCE	SERVICE
17	VANITY	VARIETY
18	VIRTUOUS	VISIONARY

Re. 1		2
1	BLIND	BREAK
2	CEASING	FEIGNING
3	CHANGE	COMPULSION
4	COMPETENCE	CONFIDENCE
5	COMPETENT	CREATIVE
6	DELUSION	PASSION
7	DIGNITY	UNITY
8	EMOTIONS	OPINIONS
9	EXCELLENCE	EXISTENCE
10	FREEDOM	WISDOM
11	HAPPINESS	POLITENESS
12	INTELLECTUAL	ORIGINAL
13	NATURE	NEEDS
14	PIETY	PURITY
15	REBELLION	RELIGION
16	SCIENCE	SERVICE
17	VANITY	VARIETY
18	VIRTUOUS	VISIONARY

Re. 1		3
1	BLIND	BREAK
2	CEASING	FEIGNING
3	CHANGE	COMPULSION
4	COMPETENCE	CONFIDENCE
5	COMPETENT	CREATIVE
6	DELUSION	PASSION
7	DIGNITY	UNITY
8	EMOTIONS	OPINIONS
9	EXCELLENCE	EXISTENCE
10	FREEDOM	WISDOM
11	HAPPINESS	POLITENESS
12	INTELLECTUAL	ORIGINAL
13	NATURE	NEEDS
14	PIETY	PURITY
15	REBELLION	RELIGION
16	SCIENCE	SERVICE
17	VANITY	VARIETY
18	VIRTUOUS	VISIONARY

Re. 1		4
1	BLIND	BREAK
2	CEASING	FEIGNING
3	CHANGE	COMPULSION
4	COMPETENCE	CONFIDENCE
5	COMPETENT	CREATIVE
6	DELUSION	PASSION
7	DIGNITY	UNITY
8	EMOTIONS	OPINIONS
9	EXCELLENCE	EXISTENCE
10	FREEDOM	WISDOM
11	HAPPINESS	POLITENESS
12	INTELLECTUAL	ORIGINAL
13	NATURE	NEEDS
14	PIETY	PURITY
15	REBELLION	RELIGION
16	SCIENCE	SERVICE
17	VANITY	VARIETY
18	VIRTUOUS	VISIONARY


FREE AFTER FIRST 2 COUPONS — Free — BOTH A & B FREE AFTER 4 COUPONS

MINI A

BLIND	BREAK	COMPETENCE	CONFIDENCE
CEASING	FEIGNING	COMPETENT	CREATIVE
CHANGE	COMPULSION	DELUSION	PASSION

3/6/ANNUAL SUB NO

NEW



MINI B

DIGNITY	UNITY	NATURE	NEEDS
EMOTIONS	OPINIONS	PIETY	PURITY
EXCELLENCE	EXISTENCE	REBELLION	RELIGION
FREEDOM	WISDOM	SCIENCE	SERVICE
HAPPINESS	POLITENESS	VANITY	VARIETY
INTELLECTUAL	ORIGINAL	VIRTUOUS	VISIONARY

52

ఈ క్విజ్ [illegible] నిర్ణయమును [illegible] మరియు [illegible] అంగీకరించుచున్నాను [illegible] రు 1/— [illegible] 4 — M. O. నెం/I.P.O./ [illegible] తేదీ [illegible]

52 (ASVP)

CAPITAL LETTERS

NAME ....

....

ADDRESS ....

....

....

— ఈ పూర్తి ఫారమును కత్తిరించి పంపవలెను —

ఆఖరు ముగింపు తేది 30—7—69.
ఫలితాలు ఆంధ్రప్రభ [illegible] 3-8-69
* ఫలితాలు పొందుటకు 10 పైసల స్టాంపు, స్వంత అడ్రసుగల కవరును వెంటనే పంపవలెను.

చందాదారుల బహుమతి రూ 1000/—
లిట్ క్విజ్ పత్రిక 3 నెం, 6 నెలల మరియు సంవత్సర చందాదారులలో మిని 'బి' లో ఆల్ కరెక్ట్ బహుమతి పొందువారు [illegible] రు 1000కూడ [illegible] మీ ఎంట్రీలతో రు 3, రు 6 లేక రు 12 వెంటనే పంపండి.

గమనికలు * లిట్ క్విజ్ పత్రిక ఉచిత కాపీకై వ్రాయండి.
* 50 పైసలు పంపిన 14 భాషలలోకి [illegible]
[illegible] * 10 పైసలు పంపి, నం. 1 నుండి 50 నంబరు గల 865 [illegible] కాపీ పొందండి.

భర్తను లొంగదీసుకోవడము ఎలా?

పరిమళా సోమేశ్వర్

సాధారణంగా మనం 'వరం' అనే పదానికి దేవతలు, మహావ్యక్తుల వల్ల ఫలించే పెద్ద కోరిక అనే అర్థంలో వాడుతుంటాం.

కాని నిజానికి భర్త వల్ల మనం తీర్చుకునే కోరికలు వరాలకన్న చాలా గొప్పవని నా ఉద్దేశ్యం.

ఎందుకంటె మొగుడనేవాడు (ముఖ్యంగా మన దేశంలో) దేవుడుకన్నా కూడా మొండివాడు, కఠిన హృదయుడూ అని మీ కందరికీ అనుభవం మీద తెలిసే ఉంటుంది. 'ఒకటికి పది కొబ్బరికాయలు కొడితే ఆ రాతి దేవుడన్నా ప్రత్యక్ష మౌతాడేమో కాని మీ శ్రీవారిని (కొన్ని విషయాల్లో) కదిలించటం చాలా కష్టం. నిజానికి భార్య భర్తనుండి ఆశించే వరాలు — చూట్టానికి చాలా స్వల్పంగానే ఉంటయ్; కాని అవి తీరాలంటే యించుమించు తలక్రిందులుగా తపస్సు చెయ్యాల్సిందే!

ఉదాహరణకి కోరుకున్నపుడల్లా కొత్త చీరలు కొనుక్కోవటం, సినిమాలు, షికార్లు మనసు పడినపుడల్లా లభించటం లాటివి సామాన్య గృహిణికి అందుబాటులో లేని వరాలు. భర్త సహకారం లేనిదే యిలాటి ముచ్చట్లు తీరటం అసాధ్యం.

కాబట్టి మీరు మీక్కావలసినవన్నీ మీ ఆయన కొనేట్లు చెయ్యాలి అనీ, మీ సరదాలన్నీ తీరాలి అని అనుకున్నట్లయితే, మీ కోరికలను మెల్లగా సమయం సందర్భం అన్నీ చూసుకుని శ్రీవారి ముందు విన్నవించుకోవాలి. అడిగే తీరు కూడా అందంగా, మీ ఆయనకు విసుగు కలిగించకుండా యిటు మీ ఆత్మగౌరవానికి భంగం కలగని ధోరణిలో అడగాలి.

ఆఫీసు పనితో అలసిపోయి భర్త యింటికి రాగానే 'ఏమండీ! అలా పబ్లిక్ గార్డెన్సుకి గానీ, సినిమాకి గాని పోదామా?' అంటే ఎలాటి మగాడైనా చెప్పుచ్చుకు కొట్టినంత పని చేస్తాడు. పగలల్లా ఆఫీసులో శ్రమించిన మగవాడు యింటికి రాగానే కాస్త నీడపట్టున విశ్రాంతి తీసుకోవాలని కోరుకుంటాడు కాని రోడ్ల వెంబడి షికార్లు తిరగాలన్న ధ్యాసే రాదు అతనికి. ఆ సంగతి భార్య గ్రహించాలి.

మీరు కనుక సినిమా చూడటం తప్పనిసరి అని భావించినట్లయితే ఒకరోజు ముందుగానే... చల్లని సాయంత్రం వేళ మీ ఆయన మీ ఒడిలో తలపెట్టుకు పడుకుని కులాసాగా కబుర్లు చెప్తున్న సమ

భర్త నుండి వరాలు పొందటం ఎలా?



యంలో 'అబ్బ నాకు యింట్లో కూర్చుని కూర్చుని 'బోర్' కొడ్తోందండీ, రేపు మధ్యాహ్నం మీ ఆఫీసర్ దగ్గర పర్మిషన్ తీసుకుని ఓ గంట ముందు రారాదూ? అప్పటికల్లా టిఫిన్ తయారు చేసి ఉంచుతాను. తిని ఏ సినిమాకో నౌబత్ పహాడ్‌కో పోదాం' అని గోముగా అడగాలి.

అలాటి సమయంలో ఆ ధోరణిలో మీరు కనుక మీ కోరిక వెలిబుచ్చేరంటే శ్రీవారు కాదనటమంటూ జరగదు. అంతే కాదు; పాపం తను లేని సమయంలో యింట్లో ఒంటరితనంతో మీరెంతగా బాధపడి పోతున్నారోనని సానుభూతిగా కూడా ఆలోచిస్తాడు. మర్నాడు ఆఫీసుకు వెళ్ళినప్పుడు మీ కోరికను గుర్తుంచుకుని ఒక గంట ముందుగా యింటికి వస్తాడు కూడాను.

ఎందుకంటే మధురమైన వేళలలో, ప్రశాంత సమయాల్లో భార్యకు చేసిన బాసలను ఏ పురుషుడూ మర్చిపోలేడు.

కనుక మీ కోరికలు యేమైనా ఉంటే మీవారు ఏ సమస్యలు, చికాకులు లేకుండా మీ గుండెలో ఒదిగిపోయే క్షణాలలో, మిమ్మల్ని గురించి నిష్పాక్షికంగా ఆలోచించ గలిగే స్థితిలో ఉండగానే అడగాలి. దీనికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే యిటు మీ కోరికలు తీరకపోగా మీ మాటకు విలువ పోగొట్టుకోవటం కూడా జరుగుతుంది.

అదీకాక అడిగే తీరును బట్టి కూడా మీవారి మనసు మారే అవకాశం ఉంది.

భార్యాభర్తల విషయమే కాదు; యీ లోకంలో సుఖజీవనానికి ముఖ్యమైన అవసరాలలో మాటతీరు కూడా ఒకటి. ఈ విషయాన్ని గూర్చి ఒక కథ కూడా ఉంది...

అనగనగా ఒక రాజుకి లేక లేక ఒక కొడుకు పుట్టేడట. పుత్రోదయంవల్ల కలిగిన ఆనందోత్సాహాలలో తేలిపోతున్న రాజాగారు దైవజ్ఞులుగా భావించబడుతున్న జ్యోతిష్కులిద్దరిని పిలిచి, తన కొడుకు జాతకం వ్రాసివ్వమన్నాడట.

యువ రాజాగారి జాతకాన్ని చూస్తూనే ఆ యిద్దరు ఉద్దండులూ కొయ్యబారిపోయేరు. ఎందుకంటే ఆపిల్లవాడు తండ్రి గండాన పుట్టేడు. అతనికి మూడు సంవ

త్సరాలకన్నా నిండకముందే రాజు చనిపోతాడని వారిరువురూ గ్రహించేరు.

ఐతే ఆ సంగతిని రాజుగారికి ఎలా చెప్పాలా అన్నది యిద్దరికీ పెద్ద సమస్య అయి కూర్చుంది. 'మరో మూడేళ్లు తిరక్కముందే నువ్వు చచ్చిపోతావు'అంటూ రాజుగారితో ఎలా చెప్పటం ?


ఐతే అందులో ఒక జ్యోతిష్కుడు పిక్కచ్చి మనిషి. ఉన్నదున్నట్టు కుండ బద్దలు కొట్టిన పద్ధతిలో చెప్పేరకం. అందువల్ల 'మూడు సంవత్సరాలలోపలే నువ్వు చచ్చిపోతావు. పసివాడికే పట్టాభిషేకం చేసి రాజ్యాధిపతిగా చెయ్య వలసిన అగత్యం పడుతుంది' అంటూ నిర్మొహమాటంగా చెప్పేసేడు.

కొడుకు పుట్టేడన్న సంతోషంలో ఉన్న రాజుగారికి 'నువ్వు చస్తావు' అన్న వాక్యం వినగానే ఆగ్రహం కలిగి వెంటనే ఆ జ్యోతిష్కుని జైల్లో పెట్టించమని ఆజ్ఞాపించేడు భటులను. రాజు తల్చుకుంటే ఇబ్బందులకు కొదువా ?

పోతే రెండవ జ్యోతిష్కుడు గట్టివాడు. మనిషి స్వభావాన్నిబట్టి మాట్లాడి పని జరుపుకునే తెలివితేటలు గలవాడు. అందువల్ల రాజుతో 'మీ పుత్రుని జాతకం చాలా బ్రహ్మాండంగా ఉంది. చరిత్రలో ఎక్కడా లేనంత గొప్ప రాజవుతాడు నీ కొడుకు. చాలా చిన్న వయసులోనే పట్టాభిషిక్తుడై రాజ్యాన్నేలుతాడు' అని చెప్పేడు. దానికి సంతోషించి రాజుగారు ఆ జ్యోతిష్కుడిని కానుకలతో సత్కరించి పంపివేస్తాడు.

మూడు సంవత్సరాలు దాటేసరికి రాజు చనిపోవటం ఆయన వారసుడైన మూడేళ్ల బాలుడికి పట్టాభిషేకం చేసి మహామంత్రిఅయిన ఆ పిల్లవాడి





మేనమామ రాచకార్యాలను నిర్వర్తించటం జరుగుతుంది.

అప్పుడు రెండవ జ్యోతిష్కుడు మొదటివాని దగ్గరకు వెళ్లి జ్యోతిషశాస్త్ర విజ్ఞానంలో మన మిద్దరం సమానమైన వాళ్లమే కాని మనకి తెలిసిన విషయాన్ని యితరులకు చెప్పటంలోనే మనిద్దరికీ భేదం ఉంది. మూడేళ్లలో రాజు చచ్చిపోతాడని మనిద్దరికీ తెలుసు. కాని నీలా నేను ఆ మాటను నగ్నంగా చెప్పి రాజుగారిని నొప్పించకుండా ఆ విషయాన్నే అందంగా మలచి చెప్పేను. అందువల్ల నాకు లభించినది కానుకలు, కట్నాలు. నిజంచెప్పిన నీకు కారాగారవాసం లభించింది. కనుక యిప్పుడైనా ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకో నువ్వు చెప్పేది నిజంగానీ అబద్ధంగానీ ఎదుటివాడి మనసెరిగి మంచిగా, అందంగా చెప్పాలి' అంటూ నీతిబోధ చేస్తాడు.

కాబట్టి మీరు కూడా మీ అసంతృప్తి కోరికలను, గొంతెమ్మ కోరికలను వెల్లడించేటప్పుడు రాష్‌గా మీవారిమీద రుద్దకుండా మెల్లిగా, అందంగా అడగాలి.

చీర కావాలని మోటుగా ఏ ఆడదీ భర్త నడగదు.

'మీరు పెళ్లయిన దగ్గరనుండి ఎన్ని చీరలు కొన్నారో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. నే నిప్పుడు కట్టుకుంటున్నవీ, దాపుడువీ అన్నీకూడా మా అమ్మవాళ్లు కొనిచ్చినవే, మీ చేతుల్తో మీరు ఆ జరీ అంచు వంగపండుచీర, ఎర్రంచు తెల్లచీరా, ఆ నాలుగు లాన్ జాకెట్లుగా పట్టించింది. అవైనా నేనాడిపోసుకొంటే కొన్నారే తప్ప మీ అంతట మీరు ఎప్పుడూ పండగకు నాకోసమంటూ ఒకచీర కొన్నారా ఎప్పుడైనా ?' అంటూ సాధిస్తారు చాలా మంది. ఇంకా చెప్పాలంటే కొందరు దెబ్బలాడతారు కూడాను.

అలా పెడసరంగా అడిగే కోరికలు న్యాయసమ్మతమైనవే అయినప్పటికీ, ఏ మగాడికీ వాటిని తీర్చాలనిపించదు. అంతకు ముందు నిజంగా భార్యకి రాబోయే పండగకు కొత్తచీర కొందామన్న ఉద్దేశ్యంతో ఉన్న మగాడికి ఆ ధోరణికి విసుగెత్తి ఆ ప్రయత్నాలను విరమించుకుంటాడు.

కనుక చాలా మృదువుగా, సరసంగా మాట్లాడాలి భర్త ద్వారా యేమైనా కోరికలు తీర్చుకోదల్చుకున్న స్త్రీ. 'చూడండి. ఈనెల మీకు పాతిక రూపాయలు యింక్రిమెంటు వస్తుందిగా. మరి నాకేం బహుమతి యిస్తారేమిటి? మాకూ్కడా ఎప్పుడూ చేసే చాకిరీయేగా, డబ్బు పెంచే అవసరమేముంది ? అంటారా ?' అంటే మీ చమత్కారానికి మురిసిపోయి 'ఓస్. దాందేముందే? ఆ పాతిక కాక మరో పది కూడా కలుపుకుని నీ క్కావలసింది కొనుక్కో. నేను వద్దన్నానా? నేను సంతోషంగా ఉన్న సమయంలో నా అర్ధాంగిని కూడా యధోచితంగా సత్కరించటం నా కర్తవ్యం' అంటాడు ఆదర్శ భర్తలా!

(పైవారం : భర్తని లొంగదీసుకోడానికి మరికొన్ని చిట్కాలు)





'జరిగినకథ'లో విజయలలిత, అల్లు రామలింగయ్య.

చిత్రసమీక్ష :

జరిగినకథ

అనుమానాలు అపార్థాల వల్ల ఇంటర్‌వల్ ముందు కథ మలుపు తిరిగి అది క్లయిమాక్సులో విడిపోవడం తెలుగు చిత్రాల ఆచారం. 'అపార్థం' కథా వస్తువుగా 'జరిగిన కథ' మన కళ్ళెదుట కనిపింపడం విజేతా (నాగావళి) ఫిలింస్‌వారి ప్రత్యేకత!

ప్రభాకరరెడ్డి, సంధ్యారాణికి మరో రెండు పాత్రలు అధికంగా సృష్టించడానికి తప్పితే ఈ చిత్రాన్ని 'జరిగిన కథ'గా చిత్రీకరించవలసిన అవసరం అంతగా కనిపించదు. కథని దుఃఖాంతం చేసి ప్రేక్షకులకి సంతోషం లేక కొంత రిలీఫ్ నిచ్చినట్టవుతుందని ఫ్లాష్‌బ్యాక్ చిత్రంగా నిర్మించి వుండొచ్చు!

కథని అలావుంచి సన్నివేశాలని పట్టి చూస్తే అవి దర్శకుని ప్రజ్ఞావిశేషాలకి దర్పణాలుగా కనిపిస్తాయి. తేలిగ్గా ఆరంభమై బరువుగా ముగిసే కథకి దర్శకుడు చేసిన బంగారు మలామా చిత్రాన్ని సర్వాంగ సుందరం చేసింది. చిత్రీకరణలో తీసుకున్న జాగ్రత్త—ప్రతిపాత్రనీ సజీవంచేస్తూ—ఆశించినమేరకు ఆయాపాత్రలు ప్రేక్షకుల సానుభూతిని దోచుకునేలా చేయగలిగింది. కొన్నిచోట్ల బలహీనమైన సంభాషణల్ని కూడా అధిగమిస్తూ—సన్నివేశాలు శక్తివంతంగావున్నాయంటే అందుకు చాతుర్యమైన చిత్రీకరణే కారణం.

రామలక్ష్మణుల్లాంటి ఇద్దరన్నదమ్ముల జీవితంలో ఒక అమ్మాయి ప్రవేశిస్తుంది. ఆమెను అన్నగారు ప్రేమిస్తాడు. తమ్ముడు పెళ్ళిచేసుకుంటాడు. ఒక పాప కలుగుతుంది. కిట్టనివారు ఆ కుటుంబంలో అశాంతి ప్రబలచేసి విచ్ఛిత్తికి కారకులవుతారు.

ఈ కథలో జగ్గయ్య నటన తారస్థాయినందుకుంది. తమ్ముడి ఆనందంకోసం తను ప్రేమించిన యువతిని త్యాగంచేసి పెళ్ళిచేయించినతర్వాతి అతని నటన, క్లయిమాక్సు సీను—ప్రేక్షకుల్లో చెరగని ముద్రవేస్తుంది. కాంచన మనోహరంగా నటించి ఉత్తమస్థాయి తారల్లో చేరుకున్నది. కృష్ణ పాత్రోచితమైన నటన చిత్రానికి నిండుతనం తెచ్చింది. కె. వి. చలం—వున్న కాస్త అవకాశంలోనూ విశేషమైన ప్రజ్ఞ కనపరచి మంచి వినోదం అందించాడు. నాగయ్య, రాజ్‌బాబు, అల్లు రామలింగయ్య, బాలకృష్ణ, రాజనాల, విజయలలిత, బేబీ రోజారమణి మొదలైనవారు తమ తమ పాత్రలని ప్రశంసనీయంగా పోషించారు.

ఘంటసాల సంగీతం ఒక 'హైలైట్'. నేపథ్యసంగీతంతో సహా మధురంగావుండి చిత్రానికి జీవంపోసింది. కథాంచన దర్శకత్వమూ నిర్వహించిన యువకుడు కె. బాబూరావు కృషిని అభినందించి తీరాలి. పదునైన సంభాషణలు రాసిన ఈ చిత్రానికి నిర్మాత కె. ఎ. ప్రభాకర.

—సిరాజ్ ●

సినిమా డైరీ

● శ్రీ పద్మనాభం దర్శకత్వం నిర్వహించే 'కథానాయిక మొల్ల' షూటింగు ప్రసాద్ స్టూడియోలో జూలై 9 న ప్రారంభమైంది. శ్రీ హరనాథ్, కుమారి వాణిశ్రీ నటించిన సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఈ చిత్రం లక్ష్మీ ఫిలింస్ ద్వారా విడుదలౌతుంది.

● గౌతమి పిక్చర్స్ 'అలీబాబా నలభై దొంగలు' షూటింగు జూలై 5 నుండి 12 వరకు జరిగింది. శ్రీ రామారావు, కుమారి జయలలితలు 5, 6 తేదుల్లో పాల్గొన్నారు. ఈ చిత్రానికి శ్రీ విఠలాచార్య దర్శకుడు.

● టి. సి. ఎస్. పిక్చర్స్ 'జన్మభూమి' షూటింగు గోల్డెన్‌లో జరిగింది. శ్రీయుతులు రాజనాల, బాలయ్య, జ్యోతిలక్ష్మి, సురేఖలు నటించిన దృశ్యాలను దర్శకుడు శ్రీ జి. విశ్వనాధం చిత్రీకరించారు.

● పూర్ణా ఆర్ట్సు పిక్చర్స్ 'మాతృదేవత' షూటింగులో శ్రీయుతులు శోభన్‌బాబు, చంద్రకళ, నాగభూషణం, బేబిరాణి మరియు శ్రీమతి సావిత్రి పాల్గొన్న ముఖ్యసన్నివేశాలను ప్రసాద్ స్టూడియోలో శ్రీమతి సావిత్రి డైరెక్టు చేసారు.

● రెడ్డి అండ్‌కో వారి 'ధర్మపత్ని' షూటింగు ప్రభా స్టూడియోలో జరిగింది. శ్రీయుతులు హరనాథ్, నాగభూషణం, రాజబాబు, అల్లురామలింగయ్య మరియు మంజుల పాల్గొన్న దృశ్యాలను శ్రీ బి. ఎ. సుబ్బరావు చిత్రీకరించారు.

● తుఫాను వరద బాధితులకు తెలుగు వలన చిత్రోత్సవము ద్వారా వసూలు కాబడిన రు. 35,000 లు ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డికి నవయుగా ఫిలింస్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ కాట్రగడ్డ శ్రీనివాసరావు చెక్కు రూపేణా అందచేశారు. ఇదిగాక మరో రు 5,000 లు ఖమ్మంమెట్టులో చిత్రోత్సవం ద్వారా రాగలదని అనుకుంటున్నారు.

● పల్లవీ పిక్చర్స్ వారి 'జగత్ కిలాడీలు' జూలై 25 వ తేదీన ఆంధ్రలో విడుదలవుతుంది.

తుఫాను బాధితులకు యన్. టి. రామారావు సహాయ కార్యక్రమం

తుఫాను, వరదలవల్ల ఆంధ్ర ప్రజలకు తీరని నష్టం సంభవించింది. ఈ నష్టంనుంచి ప్రజలు కోలుకోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. బాధితుల సహాయార్థం కొంత నిధిని సేకరించాలని నటరత్న శ్రీ యన్. టి. రామారావు నడుం కట్టారు.

అగ్రశ్రేణి నటీనటుల సాయంతో భారీఎత్తున తిరుపతి, అనంతపురం, బళ్ళారి, బెంగుళూరు పర్యటించి వినోద ప్రదర్శనల ద్వారా విరాళాలు సేకరించాలని ఒక కార్యక్రమాన్ని ఏర్పరచుకున్నారు.

జులై 14 న మద్రాసులో బయలుదేరి అదే రోజున చిత్తూరు వీధుల్లో తిరిగి సేకరణ కార్యక్రమం ఆరంభిస్తారు. తిరుపతిలో 15 ఉదయం పురవీధుల్లో తిరిగి విరాళాలు సేకరిస్తారు. ఆ సాయంత్రం వినోదకార్యక్రమం వుంటుంది. ఇలానే అనంతపురంలోను, బళ్ళారిలోను కార్యక్రమాలు జరుగుతాయి. వినోద ప్రదర్శనంలో శ్రీ రామారావు శ్రీ కృష్ణుడుగా నటించే 'శ్రీ కృష్ణ తులాభారం' విశేషాంశమై వుంటుంది. 'దంత వేదాంతం' నాటిక కూడా ప్రదర్శనల్లో ఒకటి. మరికొన్ని చిన్న చిన్న వినోద కార్యక్రమాలుంటాయి.

కాంతారావు, రేలంగి, సావిత్రి, దేవిక, ఛాయాదేవి, ధూళిపాళ, ప్రభాకరరెడ్డి, మిక్కిలినేని చంద్రమోహన్, రాజసులోచన, ఘంటసాల మొదలైనవారు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 20 వ తేదీన బెంగుళూరులో ప్రదర్శనకి మైసూరు ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్రపాటిల్ అధ్యక్షత వహించగా శ్రీ యమ్. జి. రామచంద్రన్ ముఖ్య అతిథిగా వుంటారు. రాజకుమార్, ఉదయకుమార్, జయంతి నరసింహరాజు, యస్. బాలకృష్ణ మొదలైనవారు కన్నడ పరిశ్రమ తరపున, నాగేష్ బృందం, జయలలిత, యమ్. యస్. విశ్వనాథం మొదలైనవారు తమిళ పరిశ్రమ తరపున ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

26 వ తేదీన మద్రాసులో ప్రదర్శనకి ముఖ్యమంత్రి శ్రీ యమ్. కరుణానిధి అధ్యక్షత వహిస్తారు. శ్రీ యమ్. జి ఆర్. కార్యక్రమాన్ని ఆరంభిస్తారు. 'శ్రీ కృష్ణ తులాభారం' తెలుగు నాటకంతో పాటు నాగేష్ బృందం, చో, మనోరమ, మనోహర్, కె వి. మహాదేవన్, రాజసులోచన, జయలలిత మొదలైనవారు ఈ కార్యక్రమంలో పాల్గొని యన్. టి. ఆర్. నిర్వహించిన నిధి సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తారు. హిందీ, మలయాళ పరిశ్రమలకు చెందినవారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.



నటరత్న యన్. టి. రామారావు

పత్రికా విలేఖరుల సమావేశంలో శ్రీ యన్. టి. రామారావు తమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల సహాయ సహకారాలను అర్థించారు. తుఫాను బాధితులకు నిధిని సేకరించ పూనుకున్నట్లు తెలియగానే మద్రాసునగరం నుంచి వూహాతీతమైన ప్రోత్సాహం లభించిందనీ, అప్పుడే రెండున్నరలక్షల రూపాయలు (అరాటికి) వసూలయ్యాయని చెప్పారు. ఒక రాష్ట్రం దెబ్బతిన్నప్పుడు మరో రాష్ట్రం సానుభూతి చూపించడానికి ఇది చక్కని అవకాశమనీ— మద్రాసు, మైసూరు రాష్ట్రాలు తమ ప్రయత్నాన్ని సాదరంగా ఆహ్వానించాయనీ ఆయన ఆనందం ప్రకటించారు.

పోలీసు కుటుంబ సహాయనిధి, జాతీయ రక్షణ నిధి మొదలైనవాటికి శక్తివంచన లేకుండా దోహదం చేసిన శ్రీ యన్.టి. రామారావు తుఫాను బాధితుల సహాయార్థం చేసే కృషిని అభినందించాలి.

—సితరాజు ●

సినిమా

విజయలలిత వయ్యారానికి ప్రభాకరరెడ్డి దాసోహం!

ప్రసాద్‌నుండి విక్రంకు వెళ్ళాను. అది ఒక వుద్యానవనం. ఆ వనంలో పాలరాతి మండపం; మండపానికి సమీపాన రతీ మన్మధుల శిలావిగ్రహం! ఆ విగ్రహానికి కాస్త దూరంలో వంపుల వనరాణి విజయలలిత వయ్యారంగా నాట్యం చేస్తూ సింగారాన్నంతా ఒలకబోస్తూంది. ఆమె క్రీగంటి చూపులకు శ్రీ ప్రభాకరరెడ్డి దాసోహమన్నాడు. ఆమెను వెంబడించాడు! విజయలలిత దూరదూరంగా వుంటూ, తన అవయవ సౌందర్యాన్ని,

'ఇదిగో ..గో. గో.
వలపుల వలలో చిక్కుకోరా
నీసొంతం చేసుకోరా
కొనవీడి పాలగువ్వ
కోటలోన వచ్చిందిరా' అంటూ

హుషారెక్కించింది; విజయలలిత తోటలోకి యెందుకొచ్చింది? అనేది సందేహం తీరాలంటే నవభారత్ కంబైన్స్ 'ఉక్కుపిడుగు' చిత్రం చూడండి. శ్రీ జి. విశ్వనాథం దర్శకత్వాన నిర్మిస్తున్న యీ జానపద చిత్రాన్ని పూర్ణా పిక్చర్స్ విడుదల చేస్తారు. శ్రీ ప్రకాశంపు మరియు శ్రీ సుధాకరరెడ్డి నిర్మిస్తున్న యీ చిత్రం యొక్క షూటింగు దాదాపు పూర్తయింది. శ్రీ వీటూరి మాట పాటలను, కోదండపాణి సంగీతాన్ని, మధు ఛాయాగ్రహణాన్ని గొడగాంకర్ కళాదర్శకత్వాన్ని నిర్వహిస్తున్న యీ చిత్రంలోని ప్రధాన పాత్రలను శ్రీయుతులు కాంతారావు, రాజనాల, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రాజబాబు, మోదుకూరి సత్యం, రాజశ్రీ, విజయలలిత విజయశ్రీ, శ్రీరంజని, మీనాకుమారి పోషిస్తున్నారు.

పగటివేషాలు కంటూ గాలిమేడలు కడుతున్న నాగేశ్వరరావు

శ్రీ నాగేశ్వరరావు పసిపాటా లేకుండా హైలా పచ్చిసుగా పవార్లు చేసే జల్సా మనిషి. ఆయన్నందరూ 'జాతకాల పిచ్చి రాయుడా' అని పరిహసిస్తున్నట్లు, కుమారి

విజయలలిత శ్రీ అక్కినేనితో చెప్పింది: ఏవరేమనుకున్నా ఫర్వాలేదు. జోస్యుని వాక్కు ఫలించి నేను లక్షాధికారవుతాను' అని విజయలలితకు జవాబిస్తారు

శ్రీ అక్కినేని కళ్ళు మూసుకుని పడుకున్న తన్మయత్వానికి విజయలలిత ప్రత్యక్ష సాక్షి అయింది చురుకుగా నాగేశ్వరరావు గారి వీపును తట్టింది శ్రీ అక్కినేని కళ్ళు తెరచి తన బంగారంలాంటి కలను చెడగొట్టినందుకు విసుక్కున్నారు విజయలలిత—

'పగటికలలు కంటున్న మావయ్యా
గాలిమేడలెన్ని నువ్వు కట్టావయ్యా'

అంటూ వెక్కిరించసాగింది, విజయలలిత గడుసుతనానికి తట్టుకోలేని శ్రీ నాగేశ్వరరావు ఏం చేసారు? ఇది తెలుసుకోవాలంటే శ్రీ విజయభట్ ప్రొడక్షన్స్‌వారి 'భలేరంగడు' చిత్రం చూడాల్సిందే శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ కథకు శ్రీ గొల్లపూడి మారుతీరావు మాటలను సమకూర్చగా, చిత్రంలోని పాటలకు శ్రీ మహదేవన్ సంగీతాన్ని వినిపించారు శ్రీ తాతినేని రామారావు దర్శకత్వంలో ఏవరసభరితంగా నిర్మితమయిన యీ చిత్రం నవశ్రీ పిక్చర్స్‌ద్వారా విడుదల అవుతుంది ఈ చిత్రానికి ఆర్టును శ్రీ జి వి సుబ్బారావు, కెమరాను శ్రీ రామకృష్ణ, డ్యాన్సును శ్రీ తంగప్ప. ఎడిటింగును

సినిమా

శ్రీ కృష్ణస్వామి అండ్‌బాలు నిర్వహించారు శ్రీ భట్‌కు నిర్మాణంలో శ్రీ పి ఎస్ రావు, కృష్ణమూర్తి సహకరిస్తే శ్రీ తాతినేనికి శ్రీ జగన్మోహనరావు దర్శకత్వంలో సహాయపడ్డాడు.

* * *

ప్రజల కుపయోగపడే నీతివంతమయిన సాంఘిక చిత్రాలను నిర్మించడంలో సిద్ధహస్తులయిన శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు అన్నపూర్ణాపిక్చర్స్ సంస్థ తరపున నిర్మించిన ప్రతిచిత్రం మీ అభిమానాన్ని ఆదరాన్ని సంపాదించింది ప్రస్తుతం శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి విరచితంబయిన ఒక చక్కటికథను తెరకెక్కిస్తున్నారు ఈ చిత్రానికి శ్రీ డి వి నరసరాజు సంభాషణలను, శ్రీ సెల్వరాజ్ ఛాయాగ్రహణాన్ని, శ్రీ జి వి సుబ్బారావు కళాదర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు చిత్రంలోని ముఖ్యపాత్రలను శ్రీయుతులు నాగేశ్వరరావు, గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, కృష్ణంరాజు, భారతి, చంద్రకళ, సూర్యకాంతం పోషిస్తున్నారు శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు నిర్మిస్తున్న యీ చిత్రానికి శ్రీ డి. యోగానంద్ దర్శకుడు

* * *



'ఏకవీర'లో కె ఆర్ విజయ

'పెళ్ళికానుక' చిత్రాన్ని నిర్మించిన వీనస్‌పిక్చర్స్ ఆగస్టునుండి కార్యరంగంలోకి దిగుతున్నారు శ్రీ వి మధుసూదనరావు దర్శకత్వం నెరపనున్న యీ చిత్రంలో శ్రీ నాగేశ్వరరావు నాయకుడు. శ్రీ ఆరుద్ర రచన సాగిస్తున్న యీ చిత్రానికి శ్రీ శాస్త్రి (ప్రతిభ) నిర్మాణ నిర్వాహకుడు ఈ చిత్రంలో నాయిక పాత్రలు రెండున్నట్టు, మరొకవారంలో నటీనటుల ఎన్నిక పూర్తికానున్నట్టు. ఆ పైన పూర్తి వివరాలను అందించగలనని శ్రీ శాస్త్రి వెల్లడించారు ఈసంస్థనుండి కూడా చక్కటి కుటుంబ చిత్రాన్ని ప్రేక్షకులు ఆశిస్తున్నారు.

* * *

మలయాళ చిత్రాలను నిర్మించే శ్రీ సుబ్రహ్మణ్యం పిళ్ళై రవిచిత్ర అధినేత శ్రీ వై వి రావులు కలసి 'అధ్యాపిక' చిత్రాన్ని తెలుగు కన్నడ భాషల్లో నిర్మించడానికి నిర్ణయించినట్టు, షూటింగు ఆగస్టులో ప్రారంభం కానున్నట్టు 'టక్కరి దొంగ చక్కని చుక్క' నిర్మాత శ్రీ రావు వెల్లడించారు.

* * *

కౌముదీ ఫిలింస్ అధినేత శ్రీ ఎం ఎస్. శెట్టి 'శ్రీకృష్ణవిజయం' పౌరాణిక చిత్ర



"ఖిలేతమ్ముడు"లో ఎన్. టి. రామారావు, అరుణ్ ఇరానీ


తప్పక
చూడండి!
శ్రీ లక్ష్మీనారాయణ కంబైన్స్
కదలడు వదలడు
నిర్మాతలు
కె. సీతారామస్వామి
జి. సుబ్బారావు
దర్శకత్వం
బి. విఠలాచార్య
VIJAYA



"జన్మభూమి" లో విజయశ్రీ, ముక్కామల.

నిర్మాణాన్ని ప్రస్తుతానికి ఆపి, ఒక పేరొందిన జానపదచిత్రాన్ని నిర్మించడానికి పథకం వేసుకున్నారు. శ్రీ పింగళి నాగేంద్రరావు విరచితంబయిన యీ కథలో కూడా శ్రీ ఎన్. టి. రామారావు నటించడానికి అంగీకరిస్తేనే నిర్మాణానికి ఉపక్రమించ గలమని వెల్లడించారు

*　　*　　*

'భల్లారికం' నుండి 'ఆదర్శకుటుంబం' వరకు కుటుంబానికి సంబంధించిన సమస్య

సినివళా

లను పరిష్కరించే చిత్రాలను ప్రయోజనాత్మకంగా నిర్మించిన శ్రీ అనుమోలు వెంకట సుబ్బారావు యిప్పుడు మరొక కుటుంబగాధ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీ ఆత్రేయ రచన సాగిస్తున్న యీ చిత్రంలో శ్రీ నాగేశ్వరరావు కథా నాయకుడు. ఈ చిత్రంయొక్క షూటింగు డిసెంబరునుండి శారదా స్టూడియోలో ప్రారంభించనున్నట్లు నిర్మాత శ్రీ ఏ. వి. సుబ్బారావు వెల్లడించారు

*　　*　　*

స్వయంకృషితో పైకివచ్చిన శ్రీ సి. ఎస్. రాజా అక్టోబరులో ఒక చక్కటి సాంఘిక చిత్రాన్ని నిర్మిస్తారు. ఈ చిత్రానికి శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ రచన చేస్తున్నారు. శ్రీ ఎన్. టి. రామారావు నాయకుడిగా నటించనున్న యీ చిత్రానికి 'రాము' దర్శకుడు శ్రీ ఏ. సి. త్రిలోక్ చందర్ నిర్దేశకుడు. ఈ విషయాలను నిర్మాత శ్రీ రాజా యిటీవల కలసినప్పుడు వెల్లడించారు

*　　*　　*

'విచిత్ర కుటుంబం' నిర్మాతను కలిసాను. 'ఒరిజనల్ స్టోరీ' దొరకడమే తరువాయి నిర్మాణం ప్రారంభిస్తాము' అన్నారు. శ్రీ ఎన్. టి. రామారావు మరియు చిత్రరంగంలోని ప్రముఖ నటీనటులు

మీకు తెలుసా?

ప్రముఖనటుడు శ్రీ నాగేశ్వరరావు రెండుపొద్దులు సినీమారంగాన్ని నిష్క్రమించి, వ్యాపారవేత్త కావాలనుకున్నారు. కాని, ప్రేక్షకుల అభిమానం ఆయన్ను కథానాయకుడిగా వుండాలని కోరుతూంది

హిందిచిత్రాలను పత్రికలలో ప్రకటించే నిర్మాతలు ఆ చిత్రంయొక్క సంగీత దర్శకులకు ప్రాముఖ్యం యిస్తున్నారు


హిందీనటుడు, నిర్మాత, దర్శకుడయిన శ్రీ సునీల్‌దత్తుకు వయస్సు 39. ఆయన భార్య శ్రీమతి నర్గీస్ సునీల్‌దత్తు కన్నా ఒక యేడాది పెద్దట

భగవద్గీతను సంస్కృతంలో పాడిన ఘనత కుమారి లతామంగేష్కర్‌కె దక్కింది

తమ హాస్యనటనతో ప్రేక్షకులను నవ్వించే హాస్యనటులు తమ నిత్యజీవితంలో నవ్వడం అరుదుగా కనిపిస్తుంది



విరల్ కంబైన్సువారి ప్రొడక్షన్ నెం. 1 లో విజయలలిత


శ్రీ సరస్వతీ చిత్ర వారి
పంచకళ్యాణి దొంగలరాణి
నిర్మాతలు:
గిడుతూరి సూర్యం
నల్ల వెంకటరావు
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం:
గిడుతూరి సూర్యం




"ధర్మపత్ని"లో దేవిక, రాజబాబు

సినివలా

ముఖ్యపాత్రలను పోషించగలరని కూడా చెప్పారు

*　　*　　*

ప్రస్తుతం విడుదలవుతున్న ప్రతి చిత్రంలోనూ శ్రీ నాగభూషణం నటించడం, వారినటనకు ప్రేక్షకుల అభిమానం విపరీతంగా రావడం అందరికీ తెలిసిన సత్యం తనకిచ్చే ప్రతిపాత్రలో వైవిధ్యం గల నటనను కనపర్చడమే శ్రీ నాగభూషణంలోని ప్రత్యేకత పాత్ర చిన్నదయినా, పెద్దదయినా శ్రీ నాగభూషణం వున్న పరిధిలోనే పరిపక్వమైన నటనను చూపెట్టి ప్రేక్షకుల మెప్పును పొందగలుగుతున్నారు శ్రీ నాగభూషణం హరిహర ఫిలింస్‌వారి 'నాటకాల రాయుడు' చిత్రంలో కథానాయకుడి పాత్రను ప్రతిభావంతంగా పోషించి హాస్యరస పోషణలో కూడా తాను అందెవేసినచేయి అని నిరూపించుకోనున్నారని రషెస్ చూసినవారు అభిప్రాయ పడుతున్నారు శ్రీ ఎ సంజీవి దర్శకత్వంలో నవరస భరితంగా నిర్మితమవుతున్న 'నాటకాలరాయుడు' చిత్రానికి శ్రీ కొల్లిపూడి మారుతీరావు మాటలను శ్రీ ఆత్రేయ పాటలను, శ్రీ వద్దాది ఫొటోలను వ్రాసారు శ్రీ దిడ్డి శ్రీ హరిరావు నిర్మిస్తున్న యీ చిత్రం పూర్ణాపిక్చర్స్ ద్వారా విడుదల కాగలదు ఈ చిత్రపు యొక్క సంగీతాన్ని శ్రీ జి కె వెంకటేష్, గురజాల, కెమెరాను శ్రీ కమల్ ఘోష్, నిర్వహించారు సహకార దర్శకత్వాన్ని శ్రీ మదమంచి అప్పారావు, నిర్మాణ నిర్వహణను శ్రీ నాగేంద్రరావు నిర్వర్తిస్తున్న యీ



అజంతామూవీస వారి ప్రొడక్షన్ నెం 1 లో లక్ష్మి

చిత్రంలోని ప్రధాన పాత్రలను శ్రీయుతులు నాగభూషణం, కాంచన, పద్మనాభం నాగయ్య, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, రేలంగి కృష్ణమూర్తి, సీత, అనిత, హేమలత పోషిస్తున్నారు పద్మిని పిటేని కల్పనా ఎంటర్‌ప్రైజెస్ నిర్వహిస్తున్నారు

నేటి నాగరిక ప్రపంచంలో మానవుడు

నేటి నాగరికతా ప్రపంచంలో మానవుడు యెలావున్నాడు? ఆధునిక సమాజం ఎలావుంది? అనే అంశాలతో ఉన్నకక్ష్యతో



'ఉక్కుపిడుగు'లో కాంతారావు, రాజశ్రీ

సాంఘికచిత్రమే సారథీ స్టూడియోవారి ఆత్మీయులు చిత్రం తెలుగు జీవితంలో ఒకటిగా పాత్రలో జీవిగా ఎంలినమయ్యే సాంఘికం కథలో నూతనత్వం, తెరకెక్కించడంలో సాంకేతిక నిపుణుల ప్రజ్ఞా ప్రాభావం 'ఆత్మీయులు' చిత్రాన్ని మీకు మరింత సన్నిహితంగా వుండేవిధంగా శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించారు ఈ చిత్రానికి శ్రీ వి మధుసూదనరావు దర్శకుడు, శ్రీ రాజేశ్వరరావు సంగీత దర్శకుడు, శ్రీ సెల్వరాజ్ ఛాయాగ్రాహకుడు, శ్రీ డి



అన్నదమ్ములు లో విజయనిర్మల

వి సుబ్బారావు కళాదర్శకుడు శ్రీ సారథీ స్టూడియోస్ నిర్మించిన యీ చిత్రానికి శ్రీ పినిసెట్టి సంభాషణలను, శ్రీయుతులు నారాయణరెడ్డి, దాశరథి, కొసరాజు, శ్రీశ్రీ ఆరుద్ర పాటలను వ్రాసారు నవయుగా ద్వారా విడుదలయ్యే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను శ్రీయుతులు నాగేశ్వరరావు, గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, చంద్రమోహన్, వాణిశ్రీ, చంద్రకళ, సూర్యకాంతం పోషించారు ఈ చిత్రం జులై 17వ విడుదల కానుంది

* * *

'కంచుకోట' చిత్రనిర్మాత శ్రీ విశ్వేశ్వర రావు 'కంచుకాగడా' చిత్రాన్ని కలర్‌లో నిర్మించడానికి నిర్ణయించి, ఊటీ—కొడైకెనాల్ వంటి సుందర ప్రదేశాలవద్ద అవుట్‌డోర్ లొకేషన్స్ చూచి వచ్చి, షూటింగు ప్రారంభిద్దామనుకున్న సమయంలో తమ చిత్రంయొక్క కథానాయిక శ్రీమతి జమున గర్భవతిగా వున్నదన్న శుభవార్త విని, ఆమె మాతృమూర్తి అయిన పిదప షూటింగును పెట్టుకుందామని నిశ్చయించారు 'కంచుకాగడా' చిత్రంలోని నాయిక పాత్రను శ్రీమతి జమున ప్రతిభావంతంగా పోషించగలదనే నమ్మకమే చిత్రాన్ని ఒక యేడాది వాయిదా వేయించింది అంతవరకు వూరుకుంటే యెలా? అందుకే ఆగస్టునుండి ఒక చక్కటి

సాంఘిక చిత్రాన్ని శ్రీ సి. ఎస్. రావు దిగ్దర్శకత్వంలో మొదలెడుతున్నారు. ఈ చిత్రంలో శ్రీమతి సావిత్రి, శ్రీ రామారావు నాయికా నాయకులు.

* * *

'పహిల్వాన్' శ్రీ కాంతారావు, ఆయన ఆప్తమిత్రుడు శ్రీ హుస్సేన్ కలిసి నిర్మించిన మొదటి తెలుగు చిత్రం (ప్రైవేట్) 'ప్రతిజ్ఞ'; ఆ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడింది. ఆ తర్వాత కథాన్వేషణ జరిపారు; ప్రముఖ దర్శకుడు శ్రీ సి. ఎస్. రావు వ్రాసిన కథను నిర్మించడానికి నిశ్చయించారు. శ్రీ సహ

సినిమా

దవిపే సంభాషణలు వ్రాయించారు. శ్రీ కళావతిరావు సంగీతాన్ని, శ్రీ వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాగ్రహణాన్ని నిర్వహించగలరని చెప్పారు. 'అవిధ్యుడు' చిత్రానికి దర్శకత్వం నెరపిన శ్రీ వి. రామచంద్రరావే ఈ రెండవ చిత్రానికి కూడా దర్శకుడని నిర్ణయించారు. చిత్రంలోని ముఖ్యపాత్రలను శ్రీయుతులు కృష్ణ, భారతి పోషిస్తారట. ఈ చిత్రానికి 'అఖండుడు' అని పేరు పెట్టారు.

* * *



'ప్రతిజ్ఞ'లో సన్నివేశం

'పెండ్లిపిలుపు', 'సుశ్రీ–రేపా' చిత్రాలకు దర్శకత్వం నిర్వహించిన శ్రీ అనుంచర్ల శేషగిరిరావుగారి కన్నా నాల్గైదు సంవత్సరాలుగా ఇటీవల అనుకున్న దర్శకుల్లో విశేషమైన లేదా కన్నడ చిత్రాలు విశేష ప్రచారం పొందాయి. ఈ మధ్య ఆయన్ని కలుసుకున్నాము. ఆయన ప్రస్తుతం జనప్రియ పిక్చర్స్ సాంఘిక చిత్రాన్ని (తెలుగు) నిర్మిస్తున్నట్లు, శ్రీ హరనాథ్ నాయకుని పాత్రను ధరించనున్నట్లు, శ్రీ కొండేపూడి రచన సాగిస్తున్నట్లు వివరించారు.

* * *

నటుడు శ్రీ బాలయ్యను పి. ఎస్. ఆర్. పిక్చర్స్ నూతన చిత్రంలో ఒక విలక్షణమయిన పాత్ర లభించింది. ఆ చిత్రానికి దర్శకులయిన శ్రీ విఠలాచార్య శ్రీ బాలయ్యనుగూర్చి చెప్పిన మాటలను మీరూ తెలుసుకోండి. 'శ్రీ బాలయ్య మంచి నటుడు. పాత్రను బాగా అర్థంచేసుకొని నటించగల సామర్థ్యం వుంది. కాని ఆయన్ని యెవరూ ప్రోత్సహించడం లేదు. అందుకే నేను పి. ఎస్. ఆర్. చిత్రంలో సాత్విక గుణ ప్రధానమయిన మాంత్రికుడి పాత్రను ఇచ్చాను. నేను అనుకున్న దానికన్నా యెక్కువగానే ఆ పాత్రలో రాణించగలడన్న నమ్మకం నాకు యేర్పడింది.' అని శ్లాఘించారు.

—శ్రీనివాస్



వేషాలు వెయ్యడంలోను మోసాలు చెయ్యడంలోను ఆరితేరిన మొనగాళ్లను
పల్టీ కొట్టించడానికొచ్చేస్తున్నారు.
ఫల్గుణా పిక్చర్స్ వారి
జగత్ కిలాడీలు
దర్శకత్వం
ఐ.యస్. మూర్తి
నిర్మాతలు
కె. రాఘవ
ఆంధ్ర-నైజాం: లక్ష్మీ ఫిలిమ్స్, సీడెడ్ నవభారత్, మైసూరు: జయూస్
LAKSHMI

పుస్తకాలు

అందం

రచన: శ్రీ సుభా. నవ జ్యోతి పబ్లికేషన్స్.
179 పేజీలు— వెల: రూ. 3—50

కథల సంపుటికి ఆ కథలో ఓ కథ పేరెట్టి వదిలైడం రివాజయ్యింది. అందం పేరున్న యీ పుస్తకంలో అందంతోపాటు ఏనిమిది కథలున్నాయి. లలిత జగదేకసుందరి. కాలేజీ కుర్రాళ్ళు ఆమెన్న ఏవేవో అంటూ వుంటారు. (నామరల్లి.) ఆమె అన్నగారు రామారావుకిది బాధగా వుంటుంది. ఆమెను ఎమ్మేలో చేర్పడానికి వీల్లేదని, చెల్లెల్ని గేలి చేసేవారు తనని హేళన చేస్తున్నారని తల్లిదండ్రులతో వాదించి, అంతటితో ఆగక, చెల్లెలికి ఎవరో ప్రేమలేఖ రాసినట్టు తనే రాసి ఆమె చదువుకు సొడ్డు పెస్తాడు. ఇదీ అందం కథ. ఓ బుల్లి కారణం మీద తోబుట్టిన చెల్లెలుకు ఆకాశరామన్న ప్రేమలేఖ రాసి ఆమె జీవితాన్ని పాడు చేసిన వ్యక్తి నిజంగా ఎక్కడైనా వుంటే కాదన లేముగానీ, యీ విషయాన్ని కథా వస్తువుగా తీసుకుంటే చాలా కర్కశంగా వుంటుంది. మాట లనేకుర్రాళ్ళు కాలేజీ ఆడవాళ్ళనే గాక, పిల్ల తల్లుల్ని అనూ అంటున్నారు. భర్త పక్కనే నడుస్తున్న భార్యను నాకిమీదో, పిట్టమీదో పెట్టి ఏవేవో అంటూ వెనకనడిచే వ్యక్తులూ వున్నారు. అమాత్రం దానికి అటువంటి పర్యవసానం బాధాకరంగా వుంది గౌతమబుద్ధుడు లాటి కుర్రాణ్ణి ఓ పదిమంది ఆడపిల్లలు చేరి ఎగతాళి చేసి ఆనందించడం కాలేజీల్లో జరుగుతూనే వుంది ఇది సహజం' ఇక 'నాల్గో మజిలీ' కథలో ఇతి వృత్తం ఆడవారు కట్టుకునే కోక (చీర) చుట్టూ సైకో ఎనలైజ్ చేసుకుంటూ తిరుగు తుంది. ఓణి వదిలి చీర కట్టుకున్న అలిమేలు తన అందం అద్దంలో చూసుకుంటుంటే వెనుకనుంచి అక్క భర్త వెచ్చని హస్తాలతో, చప్టా ఛాతీతో ఆమెను కౌగలించుకుంటాడు అంతలో అతని భార్య వస్తున్న అలికిడి విని వదిలేసి జారుకుంటాడు 'మంచి నీళ్ళడిగానం'టూ. అక్క గ్రహించి, 'ఇదే చీర మహాత్మ్యం' అంటుంది ఓణీ అలిమేలయితే అరిచి గోల చేస్తుందనీ, చీర అలిమేలు అలా చేయలేదనీ, ఆ మంచితనాన్ని కోకకు చుట్టబెడు తుంది. ఈ కథ చివరికో పజిల్; కథ చివర మనకు వదిలి పెట్టినా, సమస్యలతో అసంపూర్తిగా వది లేసినా చదువుతున్న పుస్తకంలో చివరి పేజీలు లేకపోయినా ఓ రకం కంపరం పుడుతుంది.

మొత్తానికి కథలన్నీ చక్కని శైలితో మంచి కథాగమనంతో నడిచాయి. రచయితకి శైలిమీద కల నేర్పు, కూర్పు— కథలను విసుగులేకుండా చదివిస్తుంది— ఇదీ కథ.

—సుధారాణి

స్వీకారం

జపాన్ విదేశాంగశాఖలోని ప్రజాసంబంధ విభాగం వారు ప్రచురించిన 'ఇన్‌సైడ్ జపాన్' మా కార్యాలయం చేరింది. నేడు జపాన్ దేశంలోని సాంకేతిక, వైజ్ఞానిక, ఆర్థిక, వ్యవసాయిక, రాజకీయ తదితర రంగాలలో జరుగుతున్న అభివృద్ధిని ఈ పుస్తకంలో వివరించడం జరిగింది. ఆయా విభాగాలని కళ్లకి కట్టినట్లు అందంగా రంగులలో, తెలుపు నలుపులో చక్కగా ముద్రింపబడిన ఛాయాచిత్రాలు ఉన్నాయి. ఎంతో అందంగా ఉన్న దీనిని జపాన్‌లో ముద్రించారు.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.